సత్యం, సమర్థత, విశ్వసనీయత

WWW.SAKSHYAM.COM

# సాక్ష్యం

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | శనివారం 20 జూన్ 2026

సంపుటి: 17 | సంచిక: 173 | పేజీలు: 08 | వెల: రూ.2:00

Published from Hyderabad, Vijayawada.

## గాంధీ సరోవర్‌కు పచ్చజెండా

- మూసీ రివర్‌ఫ్రంట్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- అనుమతులు ఇస్తూ రక్షణ శాఖ ఉత్తర్వులు జారీ
- 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి అప్పగింత
- రూ.533.42 కోట్ల విలువైన డిఫెన్స్ భూమి
- అనుమతులపై సిఎం రేవంత్ రెడ్డి హర్షం
- కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు కృతజ్ఞతలు



హైదరాబాద్,జూన్19(సాక్ష్యం): తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి కీలక ముందడుగు పడింది. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ అమలుకు కేంద్రం నుంచి అధికారిక అనుమతి లభించింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మిగతా 5 లో..



## వీబీ జీరాంజీ జాబితా విడుదల

న్యూఢిల్లీ,జూన్19(సాక్ష్యం): జులై నెల 1 నుంచి వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్ గ్రామీణ్(వీబీ-జీ రాం జీ) ప్రారంభం కానుంది. ఈ పథకంలో గ్రామీణ జీవనోపాధి, జల సంరక్షణ, మౌలిక వసతులు, విపత్తు నిర్వహణ కేటగిరీల్లో 318 పనులు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. గురువారం దానికి సంబంధించిన పనుల జాబితాను విడుదల మిగతా 2 లో..



## మైనర్ల డ్రైవింగ్‌ను క్షమించేది లేదు

- స్కూల్ పిల్ల భద్రతపై యాజమాన్యాలదే బాధ్యత
- స్కూల్ యాజమాన్యాలతో భేటీలో సిపి సజ్జనార్

హైదరాబాద్,జూన్19(సాక్ష్యం): మైనర్లు డ్రైవింగ్ చేస్తే అస్సలు క్షమించమని హైదరాబాద్ సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 'స్కూల్ పిల్లల భద్రత'పై స్కూల్ యాజమాన్యాలు, మిగతా 2 లో..



## ఫోన్ ట్యాపింగ్ కేసు

విచారణకు హాజరైన చికోటి ప్రవీణ్

హైదరాబాద్,జూన్19(సాక్ష్యం): ఫోన్ ట్యాపింగ్ కేసులో బీజేపీ అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్ విచారణ ముగిసింది. దాదాపు గంటన్నరపాటు ప్రవీణ్‌ను సిట్ అధికారులు విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ సిట్ కార్యాలయంలో ఆయనను మిగతా 2 లో..

# విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు

- నాణ్యమైన విద్యతో పాటు వసతి సౌకర్యాలు
- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి
- విద్యార్థులకు యంగ్ ఇండియా స్కూల్ కిట్స్ అందచేత
- విద్యామంత్రిగా తానే నిరంతర పర్యవేక్షణ
- ఎల్బీ స్టేడియం కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి

"ప్రధాని స్ఫూర్తితో డ్రగ్స్ కట్టడి కోసం ఒక గవర్నర్‌గా హిమచల్‌ప్రదేశ్‌లో కార్యక్రమాలు చేపట్టాను. ఇక్కడ ముఖ్యమంత్రితో కలిసి డ్రగ్స్ విముక్త తెలంగాణ కోసం అందరి భాగస్వామ్యంతో అన్ని రకాల ప్రయత్నాలు చేస్తాం. ప్రత్యేక విద్యార్థులకు రూ.1505 తో కిట్, గురుకుల విద్యార్థులకు రూ.3 వేలతో కిట్ ఇస్తున్నట్లు చెప్పారు. కిట్‌లో పుస్తకాలు, యూనిఫాం వంటి సామగ్రి ఉన్నాయి. ఇది కేవలం సామగ్రి పంపిణీ కార్యక్రమం కాదు. సమాన అవకాశాలు, ఆత్మవిశ్వాసం, మంచి విద్య అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు, నిబద్ధతకు ఇది నిదర్శనం" - శివప్రతాప్ శుక్లా, గవర్నర్



హైదరాబాద్,జూన్19(సాక్ష్యం): దేశ బవిష్యత్ పాఠశాలల్లోనే ఉందని గ్రహించి, అందుకు అనుగుణంగా తెలంగాణ విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్పోరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దుతున్నామని అన్నారు. పేదలు ఆత్మన్యూన తకు లోనుకకాకుండా వారి పిల్లలకు కూడా ప్రైవేట్ తరహా విద్యను అందిస్తున్నామని అన్నారు. అందుకోసం విద్యార్థులు ఆత్మగౌరవంతో పాఠశాలకు వెళ్లేందుకు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యపై నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. అందుకోసం విద్యాశాఖను తానే స్వయంగా నిర్వహిస్తున్నానని చెప్పారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ మిగతా 2 లో..



## అట్టహాసంగా యంగ్ ఇండియా వెల్‌కమ్ కిట్ల పంపిణీ

- విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించిన గవర్నర్
- వివిధ ప్రాంతాల నుంచి 15వేలమంది విద్యార్థుల హాజరు
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



హైదరాబాద్,జూన్19(సాక్ష్యం): ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా వెల్కమ్ కిట్స్ పంపిణీ, డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించడంతో పాటు కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, మిగతా 2 లో..


## వాట్సాప్‌లో పాఠశాల విద్యా సేవలు ప్రారంభం

- 18 లక్షల మందికి పైగా విద్యార్థులు, తల్లిదండ్రులకు సమాచారం
- విద్యాశాఖ, మీసేవ నేతృత్వంలో వినూత్న కార్యక్రమం
- డిజిటల్ మస్కట్‌గా పాలపిట్టతో సమాచార వ్యాప్తి

హైదరాబాద్,జూన్19(సాక్ష్యం): డిజిటల్ పాలనలో తెలంగాణ ప్రజాప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. విద్యాశాఖ ద్వారా అన్ని పాఠశాలల సమాచారం ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు, విద్యార్థులకు అందించనున్నారు. మీసేవ సహకారంతో వాట్సాప్ ద్వారా ఇకపై స్కూల్ అప్డేట్స్ నేరుగా వారి ఫోన్‌కు చేరనున్నాయి. ఎల్‌బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి మిగతా 2 లో..

## పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు


- లెబనాన్‌పై ఇజ్రాయెల్ సైన్యం భీకర దాడి
- ఒప్పందం కుదిరిన కొన్నిగంటలకే దాడులు
- దాడుల్లో 16 మంది మృతి, కొందరికి గాయాలు
- నివాసాలు లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు
- జెనీవాలో జరగాల్సిన చర్చలు వాయిదా!?



న్యూఢిల్లీ,జూన్19(సాక్ష్యం): అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిన కొన్ని గంటలకే లెబనాన్‌పై ఇజ్రాయెల్ పెద్ద ఎత్తున దాడులు చేసింది. దక్షిణ లెనాన్‌లోని నబతియే జిల్లాలో అర్ధరాత్రి ×ణఖీ జరిపిన వైమానిక, రాకెట్ దాడుల్లో 16మంది మృతి చెందారు. కొందరు గాయపడటం లేదా గల్లంతయ్యారు. అనేక నివాసాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ ఈ దాడులు చేసినట్లు అంతర్జాతీయ వార్తా ఏజెన్సీలు తెలిపాయి. ఈ ప్రాంతంలో మిగతా 5 లో..

## కేంద్రం నిర్ణయం మేరకే కొంటే మీరెందుకు?

- కాంగ్రెస్‌ది రైతు వ్యతిరేక విశ్వాసఘాతుక ప్రభుత్వం
- రాహుల్ జన్మదినం రోజే రైతు డిక్లరేషన్‌కు చెల్లుచీటీ
- రైతులపై విషంకక్కిన తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి
- రెండు బస్తాల యూరియాతో మిర్చి రైతులు ఏం కాను
- మీడియా సమావేశంలో ప్రభుత్వంపై హరీష్ విమర్శలు



సిద్దిపేట,జూన్19(సాక్ష్యం): కేంద్రం కనీస మద్దతు ధర నిర్ణయించిన పంటలను మాత్రమే కొంటామంటే ఇక మీరెందుకని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు సూటిగా ప్రశ్నించారు. పేపర్ లెస్ కేబినెట్ అన్నారని.. కానీ మీది విశ్వాసం లేని కేబినెట్ అని అభివర్ణించారు. మీది విశ్వాఘాతుక ప్రభుత్వమని రేవంత్ రెడ్డి సర్కారుపై నిప్పులు చెరిగారు. పంట కొనుగోలుపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసిందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినం నాడు రైతులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషం కక్కారని మండిపడ్డారు. శుక్రవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మిగతా 5 లో..

## నీట్ రీ ఎగ్జామ్‌కు లైన్ క్లియర్

- పిటిషన్- తిరస్కరించిన సుప్రీం
- నీట్ రీ ఎగ్జామ్‌కు రంగం సిద్ధం
- దేశవ్యాప్తంగా నేడు మాక్ డ్రిల్
- పటిష్ట భద్రతా వ్యవస్థ ఏర్పాటు
- రేపు జరగనున్న నీట్ రీ ఎగ్జామ్

న్యూఢిల్లీ,జూన్19(సాక్ష్యం): వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ రీ ఎగ్జామ్‌కు లైన్ క్లియర్ అయ్యింది. ఈ పరీక్షను నిలిపివేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. జూన్ 21న జరగబోయే రీ ఎగ్జామ్ యథాతథంగా కొనసాగుతుందని అత్యున్నత మిగతా 5 లో..

## 20 ప్రాంతాల్లో ఆధునిక ధాన్య సైలోలు

- ధాన్యం నిల్వ వ్యవస్థ ఆధునీకరణకు చర్యలు
- ప్రస్తుత కొనుగోలు వ్యవస్థ కొనసాగుతుంది.
- ఎస్‌హెచ్‌జీలు, పీఏసీఎస్‌ల పాత్ర యథాతథం
- పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ వెల్లడి



హైదరాబాద్,జూన్19(సాక్ష్యం): రాష్ట్రంలో ధాన్యం నిల్వ వ్యవస్థను మరింత శాస్త్రీయంగా, ఆధునికంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రధాన వరి ఉత్పత్తి జిల్లాల్లో 20 ప్రాంతాల్లో అత్యాధునిక సైలోల ఏర్పాటుపై ప్రభుత్వం పరిశీలన చేస్తున్నట్లు వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శుక్రవారం ధాన్య నిల్వ, రవాణా రంగానికి చెందిన ప్రముఖ సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో వరి ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు ప్రతి ఏడాది పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిల్వ సామర్థ్యాలను కూడా పెంచాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. అందులో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సైలోల ఏర్పాటును ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ప్రారంభ దశలో 50 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో సైలోల నెట్‌వర్క్‌ను మిగతా 5 లో..

## భూవివాదాలు లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

- రాష్ట్రంలో దశల వారీగా భూముల రీసర్వే
- వచ్చేనెల నుంచి తొలిదశలో 2240 గ్రామాల్లో ప్రారంభం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్,జూన్19(సాక్ష్యం): భూ సమస్యలు, భూవివాదాలు లేని తెలంగాణను నిర్మించాలనే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో భూ సర్వే నిర్వహించాలని కీలక నిర్ణయం తీసుకుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీసర్వే కార్యక్రమాన్ని వచ్చే నెల నుంచి దశల వారీగా ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం నాడు రెవెన్యూ అధికారులతో నిర్వహించిన మిగతా 5 లో..



## హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయం

- మణికొండ మల్కం చెరువు సమీపంలో కొత్త ఆఫీస్
- జెండా ఎగురేసి ప్రారంభించిన జనసేనాని పవన్ కళ్యాణ్

హైదరాబాద్,జూన్19(సాక్ష్యం): హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం అయ్యింది. పార్టీ అధినేత, ఎపి డిప్యూటి సిఎం÷- పవన్ కళ్యాణ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. హైదరాబాద్‌లోని మణికొండ మల్కం చెరువు సమీపంలో నూతనంగా నిర్మించిన జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయం శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో అధికారికంగా మిగతా 2 లో..

# సంపాదకీయం

## సమగ్ర పంటల విధానమే మేలు !

దేశంలో పంటల విధానంపై సమగ్రత లోపించింది. రైతులు తమకు తోచిన పంటలు వేస్తున్నారు. ధరల కోసం దేబురిస్తున్నారు. ప్రభుత్వాలు వీలైనంత మేరకు కొంటున్నాయి. వీలుకాకపోతే చేతులెత్తేస్తున్నాయి. ముఖ్యంగా వరి, జొన్న, మక్కజొన్నలనే పండించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే దేశంలో ధాన్యం బాగా పోగయ్యింది. డిమాండ్ ఉన్న పంటలు వేయడం, సేంద్రియం వైపు మళ్లడంలో రైతులు ఇప్పటికీ వెనకడుగు వేస్తున్నారు. దీంతో సంప్రదాయ వరి పండిస్తూ చేతులు కాల్చుకుంటున్నారు. ఈ విధానం ముందుగా పోవాలి. ప్రభుత్వాలు కూడా రైతులను చైతన్యం చేయడం లేదా, ఫలానా పంటలు వేయండి అని చెప్పడం లేదు. తెలంగాణ రైతుల పరిస్థితి తీసుకుంటే ఇదే అర్థం అవుతోంది. సన్నాలు పండించిన వారికి గిట్టుబాటు ధరలు వస్తున్నాయి. మద్దతు ధరలను మించి కొంటున్నారు. తాజాగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్ యార్డులో సన్న వడ్లకు డిమాండ్ పెరిగింది. వరుసగా రెండ్రోజుల నుంచి 3వేలకు పైగానే మద్దతు ధరలు దక్కుతున్నాయి. ప్రభుత్వం కూడా సన్నాలు పండించాలని, ఏడు రకాలను తాజాగా గుర్తించింది. కానీ మండలాల వారిగా రైతులతో మాట్లాడి వారిని ఒప్పించి, రైతుల పంటల విధానంలో మార్పులు తీసుకుని రావాల్సి ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే కేంద్రం కూడా ధాన్యం మొత్తాన్ని కొనడానికి ముందుకు రావడం లేదు. టార్గెట్లు విధించి, ఆమేరకు ధాన్యం సేకరణకు రాష్ట్ర ప్రభుత్వాలకు చెబుతోంది. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉండగా ఇలాగే జరిగింది. ఢిల్లీలో కూడా బిఆర్ఎస్ అధినేత, ఆనాటి సిఎం కెసిఆర్ ధర్నాకు దిగారు. అయినా నేటికీ మార్పు రాలేదు. అందువల్ల రాష్ట్రాలు తమకుతాముగా సమగ్ర పంటల విధానం అమలు చేయాలి. కేవలం ఉచిత విద్యుత్, రైతుభరోసా డబ్బులు వేస్తే సరిపోదు. ఏ పంటలు వేయాలో, వాటికి మార్కెటింగ్ ఎలా ఉంటుందో తెలియచేయాలి. ప్రభుత్వాల జోక్యం లేకుండానే రైతులు పంటలు అమ్ముకునే పరిస్థితిని తీసుకుని రావాలి. ఇక విషయానికి వస్తే ఖరీఫ్ ముంచుకొస్తున్న వేళ రబీ పంటల కొనుగోళ్లు ఇంకా సాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో పంటల కొనుగోళ్లపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసింది. రైతులు పండించిన చివరి గింజ వరకు కొంటామంటూ చెబుతూ వచ్చిన మంత్రులు, ఇప్పుడు ఊహించని రీతిలో ప్రకటన చేశారు. ధాన్యం, మక్కజొన్న, జొన్న, కందులు, పెసర్లు.. ఇలా పంట ఏదైనా సరే ఇక రాష్ట్ర ప్రభుత్వం తరఫున పంటలు కొనుగోలు చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. కేంద్ర ప్రభుత్వం ఎంత కొనాలని చెబితే అంతే కొంటామని, అంతకుమించి గింజ కూడా ఎక్కువ కొనేది లేదని స్పష్టంచేసింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఇన్‌ఫార్మల్ క్యాబినెట్ సమావేశంలో పంటల కొనుగోళ్లపై సంచలన నిర్ణయం తీసుకున్నది. ధాన్యం, మక్కలు, జొన్నలు, కందులు, పెసర్లు ఇలా పంటల కొనుగోళ్ల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపైకి నెట్టేసింది. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ఏ పంటనైనా సరే కేంద్రం నిర్దేశించిన కోటా మేరకే కొనుగోలు చేస్తామని మంత్రి ఉత్తమ్ మీడియాకు చెప్పారు. పంటలకు మద్దతు ధరను కేంద్రమే నిర్ణయిస్తుంది కాబట్టి.. పంటల కొనుగోలు బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు. మంత్రి వ్యాఖ్యల నేపథ్యంలో ఇకపై రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయబోదనేది సుస్పష్టం. కేంద్రం కొనుగోలు చేస్తామని చెప్పిన పంటలను, కేంద్రం ఇచ్చిన కోటా మేరకే ఇక్కడ కేంద్రం ఇచ్చిన డబ్బులతో రైతుల నుంచి సేకరించి కేంద్రానికి అందిస్తుంది. అంతేగానీ ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన కోటాకు మించి పంటలు ఉత్పత్తి అయితే ఆ పంటలను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో కొనుగోలు చేయబోదు. పంటల కొనుగోళ్లలో కేంద్రం కోటా పూర్తికాగానే ఆ కేంద్రాలను మూసివేస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంతో పాటు ఇతర పంటలు ఉన్నా ఇక నుంచి ప్రభుత్వం పట్టించుకోదు. మొత్తంగా ఇదే విషయం అర్థం అవుతోంది. ఇలాంటి సమయంలో ఏం చేయాలన్నది కూడా ప్రభుత్వం ప్రకటించాలి. ఎంతమేరకు వరి వేయాలో, అదికూడా ఏ రకం వేయాలో రైతులకు చెప్పాలి. ఏయే జిల్లాల్లో వరి వేయాలో, వేయకూడదో కూడా నిర్ణయించాలి. నిజానికి ధాన్యం సేకరణ బాధ్యత కేంద్రానిదే. కేంద్రం ఆదేశాల మేరకే రాష్ట్రాలు ధాన్యం సేకరణ చేసి, ఎఫ్‌సిఐకి అప్పగిస్తుంది. ఈ క్రమంలో ‹ూష్ట్రంలోని వివిధ పంటలను కేంద్ర ప్రభుత్వం కొంత మేరకే కొనుగోలు చేస్తుంది. ఉత్పత్తి అయిన ధాన్యంలో మూడో వంతు మాత్రమే కొంటుంది. ఇక పెసర్లు, కందులు, జొన్నలు, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి పంటలను మొత్తం ఉత్పత్తిలో 25శాతం మాత్రమే కొనుగోలు చేస్తుంది. ఒకవేళ కేంద్ర ప్రభుత్వానికి అవసరముండి, పంట ఎక్కువగా ఉంటే మరో 5-10శాతం వరకు కొనుగోలుకు అనుమతి ఇస్తుంది. ఒత్తిడి తెచ్చినర రాష్ట్రాలకే ఈ వెసులబాటు ఉంటుంది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం.. మక్కలను మాత్రం అసలే కొనుగోలు చేయదు. ఎంత ఉత్పత్తి అయినా సరే ఒక్క గింజ కూడా కొనుగోలు చేయదు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తన కోటా కింద కొనుగోలు చేయగా మిగిలిన పంటలను కొనుగోలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. కేంద్రం తన కోటా మేరకు కొనుగోలు చేసిన తర్వాత మిగిలిన పంట ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు నిరాకరిస్తే రైతులు ఏం కావాలన్నది ఆలోచన చేయాలి. అందువల్ల పంటల విధానం అమల్లోకి రావాలి. ఏయే పంటలు వేయాలో, ఎంత విస్తీర్ణంలో వేయాలో ప్రభుత్వం నిర్ణయించాలి. అందుకు తగ్గట్లుగా ఎరువుల,విత్తనాలు సరఫరాచేసి, ఆయా పంటలనే ప్రోత్సహించడం ద్వారా సంక్షోభాన్ని అధిగమించవచ్చు.

# విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు

మొదటిపేజీ తరువాయి..

కిట్ల పంపిణీని గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం ప్రారంభించారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు 22 వస్తువులతో కిట్లు అందించారు. వసతి గృహ విద్యార్థులకు 10, పాఠశాల విద్యార్థులకు 7 వస్తువులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ భాషా ప్రయుక్తరాష్ట్రంగానో, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడింది కాదని ఈసందర్భంగా అన్నారు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, విద్యార్థుల ఆత్మబలిదానాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి కోసం ఎంతోమంది త్యాగాలు చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంది.. వాటిని పునరుద్ధరించాలన్నదే తన సంకల్పమని అన్నారు. విద్యాశాఖను గతంలో విధ్వంసం చేశారు. గత పాలకుల అరాచకంతో రాష్ట్రానికి వందేళ్ల నష్టం జరిగింది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించి ప్రక్షాళన చేపట్టాం అని వివరించారు. విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు కేటాయించాం. వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం. వీటిని భావితరాల భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడులుగా భావిస్తున్నాం. ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇలా బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరని అన్నారు. ఉద్యోగులకు జీతాల మాదిరిగానే ప్రతినెలా ఒకటో తేదీన విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో హాస్టల్ విద్యార్థులకు ఈ ఛార్జీలు పెంచలేదని, తాము అధికారంలోకి వచ్చాక పెంచామని అన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్‌తో పాటు మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.




## అట్టహాసంగా యంగ్ ఇండియా వెల్‌కమ్ కిట్ల పంపిణీ

మొదటిపేజీ తరువాయి..

ప్రారంభోత్సవాలు చేశారు. తెలంగాణ వ్యాప్తంగా రూ.50.73కోట్లతో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి సీఎం రేవంత్ శ్రీకారం చుట్టారు. అందులో రూ.36.65కోట్లతో వివిధ జిల్లాల్లో మినీ స్టేడియాల నిర్మాణం, క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. రూ.14.08కోట్లతో గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియాల్లో బాలబాలికల క్రీడా శిక్షణకు వివిధ అకాడమీలను రేవంత్ ప్రారంభించారు. రూ.10కోట్లతో రంగారెడ్డి జిల్లా కొందుర్గ్‌లో మినీ స్టేడియం నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.10కోట్లతో సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియం ఆధునికీకరణకు కొబ్బరికాయ కొట్టారు. అలాగే రూ.4కోట్లతో నారాయణపేట్ జిల్లా నర్వలో మినీ స్టేడియం నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.4కోట్లతో వనపర్తి జిల్లా ఆత్మకూర్‌లో మల్టీ పర్పస్ స్టేడియం, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో కోర్టుల నిర్మాణం, క్రికెట్ గ్రౌండ్, వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. అలాగే రూ.3.50కోట్లతో కామారెడ్డి జిల్లా గాంధారి, రూ.2.65కోట్లతో మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మినీ స్టేడియాలకు భూమిపూజ చేశారు. రూ.2.50కోట్లతో నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలం ఉట్కూరులో వాలీబాల్, కబడ్డీ కోర్టుల నిర్మాణానికీ కొబ్బరికాయ కొట్టారు సీఎం రేవంత్. రూ.5.70 కోట్లతో బాలికల కోసం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈఎఈం తెలంగాణ టాలెంట్ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.5.70 కోట్లతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈఎఈం తెలంగాణ టాలెంట్ అకాడమీ ప్రారంభించారు. రూ.35.95 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమీ ప్రారంభం అయ్యింది. రూ.35.94 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.44.50 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.44.50 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ




అకాడమీ ప్రారంభం అయ్యింది. రూ.58.50 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫుట్ బాల్ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.49 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ బాల్ అకాడమీ ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. మరోవైపు గురుకుల విద్యార్థులకు 22 రకాల వస్తువులు, హాస్టల్ విద్యార్థులకు 10, డే స్కాలర్లకు 7 రకాల విద్యా సామగ్రితో కిట్లను అందించారు. ఈ కార్యక్రమానికి సుమారు 15వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ చారిత్రాత్మక వేడుకకు రాష్ట్రంలోని ప్రభుత్వ బడులు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు), ప్రభుత్వ గురుకులాలు, విద్యా వసతి గృహాల నుంచి దాదాపు 15 వేల మంది విద్యార్థులు తరలివచ్చారు. విద్యార్థులు చదువుకునే విద్యాసంస్థల రకాన్ని బట్టి వారి అవసరాలకు తగినట్లుగా ఈ కిట్లను ప్రభుత్వం ప్రత్యేకంగా డిజైన్ చేసింది.

## వాట్సాప్‌లో పాఠశాల విద్యా సేవలు ప్రారంభం

మొదటిపేజీ తరువాయి..

ఎ. రేవంత్ రెడ్డి ఈ సేవలను అధికారికంగా ప్రారంభించారు. వినూత్న కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల మందికి పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాల విద్యకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం, సేవలు, ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను నేరుగా వాట్సాప్ ద్వారా పొందనున్నారు. విద్యా పురోగతి, పరీక్షల సమాచారం, విద్యా సామగ్రి పంపిణీ, స్కాలర్‌షిప్‌లు, పాఠశాల కార్యక్రమాలు, ఆరోగ్య, సంక్షేమ కార్యక్రమాల వంటి అంశాలపై సకాలంలో సమాచారం అందుబాటులోకి రానుంది. ప్లాట్‌ఫారమ్‌ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వ సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ / కమ్యూనికేషన్స్ (ఎ÷ఇ/అ) శాఖకు చెందిన ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ-మీసేవ విభాగం, పాఠశాల విద్యా శాఖతో కలిసి అభివృద్ధి చేసింది. విద్యార్థులు, తల్లిదండ్రులకు పారదర్శకంగా, సులభమైన రీతిలో వేగవంతమైన సేవలను అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఈ డిజిటల్ సేవలను వినియోగించు కుంటున్నారు. వాట్సాప్ ద్వారా మీసేవ ప్రస్తుతం అందిస్తున్న ప్రధాన సేవలు ఇలా ఉన్నాయి. విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులు,హాల్ టికెట్ల డౌన్‌లోడ్,మార్కుల మెమోలు,పరీక్షా ఫలితాలు,ఎస్ఎస్‌సీ మెమోలు, బోనెడ్ సర్టిఫికెట్లు,ట్రాన్స్ ఫర్ సర్టిఫికెట్లు,ఎస్ఎస్‌సీ మెమో సవరణల దరఖాస్తులు సేవల వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గి, సమయంతో పాటు వ్యయం ఆదా అవుతోంది. త్వరలో అందుబాటులోకి రానున్న సేవలు తదుపరి దశలో క్రింది సేవలను కూడా వాట్సాప్ వేదికలో అందుబాటులోకి తీసుకురానున్నారు. యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ వివరాలు,విద్యార్థుల హాజరు సమాచారం,ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులు,మధ్యాహ్న భోజన పథకం వివరాలు,ఆరోగ్య, సంక్షేమ కార్యక్రమాలు,క్రీడలు, సహపాఠ్య కార్యక్రమాల సమాచారం, రెసిడెన్షియల్ పాఠశాలల సంక్షేమ కార్యక్రమాల వివరాలు,విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయ సేకరణ ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా రాష్ట్ర పక్షి 'పాలపిట్ట'ను డిజిటల్ మస్కట్‌గా పరిచయం చేశారు. పాలపిట్ట



యానిమేషన్ వీడియోల ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులకు ముఖ్యమైన సమాచారం, అవగాహన సందేశాలు, వీడియోలు వాట్సాప్‌లో పంపించబడతాయి. దీనివల్ల ప్రభుత్వ విద్యా సమాచార ప్రసారం మరింత సులభంగా, ఆకర్షణీయంగా, ప్రజలకు చేరువ అవుతుంది. సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యా రంగంలో సాంకేతికత వినియోగాన్ని మరింత విస్తరించి విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచడం, తల్లిదండ్రులతో ప్రభుత్వ అనుసంధానాన్ని బలోపేతం చేయడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజలకు చేరువైన, సమర్థవంతమైన డిజిటల్ సేవల అందింపులో తెలంగాణ మరోసారి దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. వాట్సాప్ ఆధారిత పాఠశాల విద్యా సేవల ప్రారంభం తెలంగాణ డిజిటల్ పరివర్తన ప్రయాణంలో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది.

## కేబీఆర్ పార్క్ చుట్టూ మరోసారి వన్‌వే

### ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించనున్న పోలీసులు

హైదరాబాద్,జూన్19(సాక్ష్యం): నగరవాసులకు ట్రాఫిక్ పోలీసులు అలర్ట్ జారీ చేశారు. ఆదివారం కేబీఆర్ పార్క్ చుట్టూ మరోసారి వన్‌వే ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డెవిస్ వివరాలు వెల్లడించారు. ట్రయల్ రన్ విజయవంతమైతే వారం తర్వాత వన్‌వేను పూర్తి స్థాయిలో అమలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. పార్క్ చుట్టూ ఏడు ౖ÷÷-లఓల్గ÷వర్లు, ఏడు అండర్‌పాస్‌ల నిర్మాణాలు జరుగుతున్నాయని, పనులు జరిగే రోజుల్లో వన్‌వే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు జాయింట్ సీపీ చెప్పారు. గతంలో ఒకసారి ట్రయల్ రన్ నిర్వహించామని, ఈ సందర్భంగా పలు జంక్షన్లలో ట్రాఫిక్ ఇబ్బందులను గుర్తించామని జోయల్ డెవిస్ తెలిపారు. 45 జంక్షన్ వద్ద పీక్ అవర్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్నాయని, వాటిని పరిష్కరిస్తామన్నారు. అలాగే డ్రోన్ విజువల్స్‌ను పరిశీలించామని, ప్రయాణికులు, నిపుణుల అభిప్రాయాలను తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం



మరోసారి ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 21న ఉదయం నుంచి రాత్రి వరకు ఈ ట్రయల్ రన్ ఉంటుందని వెల్లడించారు. ఈ ట్రయల్ రన్‌లో 150 మంది సిబ్బంది పాల్గొంటున్నట్లు చెప్పుకొచ్చారు. నగరవాసులు ట్రాఫిక్ అలర్ట్‌ను గమనించాలని జోయల్ డెవిస్ పేర్కొన్నారు. ‹ూగా, నగర ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ మేరకు కేబీఆర్ పార్క్ చుట్టూ ఏడు ౖ÷÷-లఓల్గ÷వర్లు, ఏడు అండర్‌పాస్‌ల నిర్మాణాలను చేపట్టింది. ఇవి పూర్తయితే నగరవాసులకు ట్రాఫిక్ కష్టాలు తీరే అవకాశం ఉంటుంది.

## హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయం

మొదటిపేజీ తరువాయి..

ప్రారంభమైంది. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జనసేన జెండాను ఆవిష్కరించి కార్యాలయంలోకి అడుగుపెట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి నమస్కరించి, రాష్ట్ర నాయకులతో ముచ్చటించారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (ఉఊఓఅ) ఎన్నికల్లో జనసేన పార్టీ బరిలోకి దిగుతుందని పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఒంటరిగానైనా సరే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని, క్షేత్రస్థాయిలో పార్టీకి బలం పెంచేందుకు త్వరలోనే తానే స్వయంగా తెలంగాణవ్యాప్తంగా పర్యటిస్తానని ఆయన ప్రకటించారు. ఈ క్రమంలోనే గ్రేటర్ ఎన్నికలను ఒక సవాల్‌గా తీసుకుని క్యాడర్‌ను సమాయత్తం చేసేందుకు ఈ నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా మారిన జనసేన పార్టీ.. తెలంగాణపై తన రాజకీయ దృష్టిని కేంద్రీకరించింది. రాష్ట్రంలో పార్టీ విస్తరణ, సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా సరికొత్త వ్యూహాలతో దూకుడు పెంచింది. హైదరాబాద్‌లో ఇప్పటికే జనసేన పార్టీకి కార్యాలయం



ఉన్నప్పటికీ.. తెలంగాణలో పార్టీ ఉనికిని మరింత బలంగా చాటేందుకు ఈ కొత్త ఆఫీస్‌ను అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలో పార్టీ చేరికలను ప్రోత్సహించేందుకు వీలుగా త్వరలోనే ఒక ప్రత్యేక 'జాయినింగ్స్ కమిటీ'ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యాలయం కేంద్రంగానే తెలంగాణలో సంస్థాగత నిర్మాణం, కమిటీల ఏర్పాటు, ఇతర రాజకీయ వ్యూహాలపై జనసేన నాయకత్వం దృష్టి సారించనుంది. ఇటీవలి కాలంలో పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టడం, ఢిల్లీ వేదికగా జరిగిన 'సేన ప్రస్థానం' కార్యక్రమంలో తెలంగాణ రాజకీయాల గురించి ప్రస్తావించడం, అలాగే హనుమకొండలో తన అభిమాని నిరంజన్‌ను కలవడం వంటి వరుస పరిణామాలు జనసైనికుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఆంధ్రప్రదేశ్‌లో సాధించిన విజయ ఉత్సాహంతో తెలంగాణలోనూ జనసేనను ఒక బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టాలని పవన్ భావిస్తున్నారు. ఈ నూతన కార్యాలయం ప్రారంభోత్సవంతో తెలంగాణ రాజకీయాల్లో జనసేన తన తదుపరి పొలిటికల్ రోడ్ మ్యాప్‌ను ఎలా సిద్ధం చేసుకోబోతోందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## వీబీ జీరాంజీ జాబితా విడుదల

మొదటిపేజీ తరువాయి..

చేసింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో విబీ-జీ రాం జీ పథకం అమలుకు ఇప్పటికే మార్గదర్శకాలను జారీ చేసి, నిధులను కేటాయించింది. ప్రస్తుతం నడుస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోనూ వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాలు, సహజ వనరుల నిర్వహణ, వ్యక్తిగత లబ్ధిదారుల పనులు, గ్రామీణ మౌలిక సదుపాయాలు వంటివి నాలుగు కేటగిరీల్లో 266 పనులు ఉండేవి. తాజాగా జీరాంజీలో మౌలిక సదుపాయాలు కాకుండా మిగిలిన మూడింటిని మార్చేశారు. జల సంరక్షణలో చెక్‌డ్యామ్‌లు, కాలువలు, గల్లీప్లగ్‌లు, భూగర్భ డైక్‌ల నిర్మాణం, వర్షపు నీటి కాలువల మరమ్మతులు, చెరువులు, నిర్వహణ, ఇంకుడు గుంతలు, రీఛార్జ్ షాఫ్టులు, బావులు, రీఛార్జి పిట్లు మొదలైన నీటి సంరక్షణ కట్టడాల నిర్మాణం లేదా పునరుద్ధరణ, సాగునీటి బావులు, సూక్ష్మ - సాగునీటి కాలువలు మరమ్మతులు, నిర్వహణ, స్ప్రింక్లర్ సాగునీటి వ్యవస్థ ఏర్పాటు, బంజరు భూముల్లో మొక్కల పెంపకం, అటవీకరణ, భవనాలపై వర్షపు నీటి సంరక్షణ పనులు.గ్రామీణ మౌలిక సదుపాయాల్లో గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్ వాడీ, సామాజిక భవనాలు, క్రీడా మైదానాలు, ఆరోగ్య కేంద్రాలు, పశువైద్య కేంద్రాలు, మార్కెట్ యార్డులు, శ్మశాన వాటికలు, సంతలు, గ్రంథాలయాలు, కల్యాణ మండపాలు, పాఠశాలల అదనపు గదులు, ప్రయోగశాలలు, వ్యాయామశాలలు, ప్రజా శౌచాలయాలు, వంట గదులు, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు, రోడ్లు, కల్వర్టుల నిర్మాణ పనులు, ప్రహరీలు. భూమి అభివృద్ధి, రాతిగట్లు, పండ్ల తోటల పెంపకం, సంరక్షణ పనులు, పశువులు, మేకలు, పట్టు పరిశ్రమ, చేపల చెరువులు, కల్లాలు, చేపలు ఎండబెట్టే ప్లాట్‌ఫారాలు, గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, శుద్ధికేంద్రాలు, నైపుణ్యాభివృద్ధి, గ్రామీణ హస్తకళల శిక్షణ కేంద్రాలు, కుటీర పరిశ్రమ వసతుల నిర్మాణాల పనులు.విపత్తుల నిర్వహణలో భాగంగా వరద రక్షణ గోడలు, మరమ్మతులు, గట్ల నిర్మాణం, కొండ చరియలు, విరిగిపడకుండా నివారించే పనులు, విపత్తుల అనంతరం పునరావాస పనులు, నేల స్థిరీకరణ, గ్రామీణ రోడ్లు, సామాజిక ఆస్తుల పునరుద్ధరణ, అడవుల్లో మంటల నివారణ, మొక్కల పెంపకం, అగ్నిమాపక పరికరాల నిల్వ కేంద్రాల నిర్మాణం, అటవీ జంతువులు, పక్షుల సంరక్షణ కేంద్రాల పునరుద్ధరణ పనులు.'పంటల సీజన్‌లోనే రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అదే సమయంలో వనమహోత్సవం, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు ఉపాధి హామీ ద్వారా చేపడతాం. 60 రోజుల విరామంతో మొక్కలు నాటే ప్రక్రియ నిలిచిపోతోంది. అది కేంద్రం చేపట్టిన హరితభారత లక్ష్యానికి విరుద్ధం. ఈ విరామం వల్ల ఆదివాసీలు, కొండ ప్రాంతాల్లో నివసించే వారి ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయి.' అని సీతక్క తెలిపారు.

## మైనర్ల డ్రైవింగ్‌ను క్షమించేది లేదు

మొదటిపేజీ తరువాయి..

సంబంధిత శాఖలతో ట్రాఫిక్ పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సిటీ పరిధిలో 3500లకు పైగా స్కూల్స్ ఉన్నాయని, వీటిలో 12 లక్షలకు పైగా విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. సేఫ్ స్కూల్ ఎన్విరాన్మెంట్ క్రియేట్ చేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పాటించడం అన్నది అలవాటుగా మారాలని సూచించారు. విద్యాసంస్థల్లో ర్యాంక్స్ ఇంపార్టెంట్ కాదని.. సేఫ్ ఎన్విరాన్మెంట్ ముఖ్యమని సీపీ స్పష్టం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో స్కూల్ బస్సు డ్రైవర్లు పట్టుబడుతున్నారని తెలిపారు. విద్యార్థులు స్కూల్‌కు ఏ విధంగా వస్తున్నారనే దానిపై స్కూల్ యాజమాన్యం వద్ద పూర్తి రూట్‌మ్యాప్ ఉండాలన్నారు. పిల్లలు పాఠశాలకు వస్తున్నారంటే.. ఏం జరిగినా స్కూల్ యాజమాన్యానిదే బాధ్యత అని తేల్చిచెప్పారు. స్కూల్ బస్సులను నడిపే డ్రైవర్స్‌పై నిఘా ఉంచాలని సీపీ సూచించారు. ట్రాఫిక్ వాలంటీర్లు, మార్షల్స్‌ను విద్యాసంస్థలు నియమించుకోవాలని అన్నారు. పిల్లలు తెలిసీ తెలియక నేరాల్లో ఇన్వాల్వ్ అవుతున్నారని.. పిల్లలపై టీచర్స్, పేరెంట్స్ పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. స్కూల్ పరిసరాల్లో ఖచ్చితంగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. స్కూల్ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు అమ్మడం నేరమని... అలాంటి వాటిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిరోజు 45 మంది విద్యార్థులు యాక్సిడెంట్లో చనిపోతున్నారని, యాక్సిడెంట్లు మర్డర్ల కంటే ప్రమాదకరమన్నారు. అందుకే స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించాలని సీపీ సజ్జనార్ వెల్లడించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు

మొదటిపేజీ తరువాయి..

అధికారులు విచారించారు. విచారణకు ముందు సిట్ కార్యాలయం ఎదురుగా ఉన్న అమ్మవారి దేవాలయంలో దర్శనం చేసుకున్నారు చికోటి ప్రవీణ్. సిట్ విచారణ అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. 'ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాను. మా ఫోన్లు ట్యాప్ చేసి వ్యక్తిగత విషయాలను విన్నారు. ఊహించిన దానికన్నా ఘోరంగా ఫోన్ల ట్యాపింగ్ జరిగినట్లు విచారణలో నాకు అర్థమైంది. నేను 200మంది ఫోన్లు మాత్రమే ట్యాప్ అయ్యాయని అనుకున్నా. కానీ ఆ జాబితా రెండు వేలకు పైగా ఉంది. నాకు దగ్గరిగా ఉన్న వారి ఫోన్లనూ విన్నారు. విచిత్రం ఏమిటంటే, ఎక్కువగా బీఆర్ఎస్ నాయకులకు సంబంధించిన ఫోన్లనే ట్యాప్ అయ్యాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల భార్యలు, పనిమనుషులకు సంబంధించిన ఫోన్లను ట్యాప్ చేశారు. రాధా కిషన్ రావు ఎవరో తెలియదని కేసీఆర్ అన్నారు. ఆయన నియామకానికి సంబంధించిన జీవో తెచ్చింది కేసీఆర్ కాదా?. ఇలాంటి నీచమైన రాజకీయాలు ప్రపంచంలో బీఆర్ఎస్ తప్ప ఎవరూ చేయరు. ఇది ముమ్మాటికీ కేసీఆర్, కేటీఆర్ చేయించిన ట్యాపింగే. రాధా కిషన్ రావు ఆస్తులపై విచారణ చేయించాలి. లేదంటే కేంద్ర దర్యాప్తు సంస్థలకు లేఖలు రాస్తాం. ఫోన్ ట్యాపింగ్ కేసును సీఎం రేవంత్ రెడ్డి పారదర్శకంగా విచారణ చేయించాలి. నాపై ఈడీ దాడులు జరగడానికి ముందే నా ఫోన్ సంభాషణలు విన్నారు.

## సమాచార పౌర సంబంధాల శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా ముమ్మడి వెంకటేశ్వర ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

సాక్ష్యం , విశాఖపట్నం.

సమాచార పౌర సంబంధాల శాఖ విజయవాడ కమిషనరేట్‌లో జాయింట్ డైరెక్టర్‌గా ముమ్మడి వెంకటేశ్వర ప్రసాద్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి



పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ నూతన బాధ్యతలు చేపట్టిన ముమ్మడి వెంకటేశ్వర ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, శాఖ అభివృద్ధికి తోడ్పడే విధంగా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు.ముమ్మడి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ మార్గనిర్దేశంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరియు ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత విస్తృతంగా చేరవేసేందుకు వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా సమర్థవంతమైన ప్రచార కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తానని తెలిపారు. 1987 జూన్ 2న సమాచార పౌర సంబంధాల శాఖలో ఉద్యోగ జీవితం ప్రారంభించిన ముమ్మడి వెంకటేశ్వర ప్రసాద్, గత 39 సంవత్సరాలుగా శాఖలో వివిధ హోదాల్లో సేవలందించారు. కడప, చిత్తూరు, అనంతపురం, ఖమ్మం, ప్రకాశం, నెల్లూరు, విజయవాడ, కృష్ణ జిల్లాల్లో విధులు నిర్వహించిన ఆయన, తన సమర్థవంతమైన సేవలతో జిల్లా కలెక్టర్లు మరియు ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకొని ప్రతిభావంతుడైన అధికారిగా గుర్తింపు పొందారు.

## సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్‌తో జిల్లా కలెక్టర్ మర్యాదపూర్వక భేటీ

సాక్ష్యం , విశాఖపట్నం

విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ శుక్రవారం విశాఖపట్నంలోని సౌత్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయంలో జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్‌ను మర్యాదపూ



ర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. భేటీలో జిల్లా అభివృద్ధి, రైల్వే శాఖకు సంబంధించిన పలు అంశాలపై ఇరువురు చర్చించారు. ముఖ్యంగా విశాఖపట్నం నగర అభివృద్ధి, రవాణా మౌలిక సదుపాయాల బలోపేతం, ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని అభిప్రాయపడ్డారు. జిల్లా పరిపాలన, రైల్వే శాఖ మధ్య సమన్వయం మరింత పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

## ఏపీని ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యం: మంత్రి కందుల దుర్గేష్

సాక్ష్యం , విశాఖపట్నం

రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి, పర్యాటక రంగాన్ని ఉపాధి, ఆర్థికాభివృద్ధికి ప్రధాన చోదకశక్తిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో గత రెండేళ్లలో ఆయా శాఖలు సాధించిన పురోగతిని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన పర్యాటక విధానం అమలు చేస్తూ 117 సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని సుమారు రూ.20 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించిందని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టుల



ద్వారా లక్షకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. 50 కొత్త హోటళ్లకు అనుమతులు ఇవ్వగా, ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 50 వేల హోటల్ గదులు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు.

దేశీయ పర్యాటకుల రాక గత రెండేళ్లలో 17 శాతం పెరిగి 37 కోట్ల ఫుట్‌ఫాల్ నమోదైందని, విదేశీ పర్యాటకుల సంఖ్య 2.62 లక్షలకు చేరిందని వెల్లడించారు. దీంతో దేశంలో 16వ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం 13వ స్థానానికి చేరుకుందని చెప్పారు. విశాఖపట్నం, అరకు, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతిని ప్రధాన పర్యాటక హబ్‌లుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. సాంస్కృతిక రంగానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కళారత్న, ఉగాది పురస్కారాల ప్రదానం, కళాకారుల సంక్షేమ కార్యక్రమాలు, సంగీత పర్యాటకానికి ప్రోత్సాహం వంటి చర్యలు చేపట్టామని మంత్రి చెప్పారు. ప్రతి జిల్లాలో ఒక సంగీత కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు వెల్లడించారు.

చలనచిత్ర రంగ అభివృద్ధికి కొత్త ఫిల్మ్ పాలసీ రూపొందిస్తున్నామని, 2025 నుంచి మళ్లీ నంది అవార్డులు ప్రదానం చేయనున్నామని మంత్రి ప్రకటించారు. ఈ ఏడాది నవంబర్–డిసెంబర్ నెలల్లో నంది నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 100 శాతం చిత్రీకరణ జరిపే చిత్రాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పారు. 2027లో గోదావరి పుష్కరాలు, 2028లో కృష్ణా పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని మంత్రి దుర్గేష్ వెల్లడించారు.

# అమరావతి క్వాంటం వ్యాలీకి చారిత్రాత్మక విజయము

### మైనస్ 269 డిగ్రీల సెల్సియస్ వద్ద 4 కెల్విన్ ఉష్ణోగ్రత సాధన

సాక్ష్యం , విశాఖపట్నం.

అమరావతి క్వాంటం వ్యాలీ భారతదేశ క్వాంటం సాంకేతిక రంగంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. అమరావతిలోని మేధా టవర్స్‌లో ఏర్పాటు చేసిన క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీలో స్వదేశీ డైల్యూషన్ రిఫ్రిజిరేటర్ విజయవంతంగా 4 కెల్విన్ (–269□C) ఉష్ణోగ్రతను చేరుకుంది. ఈ ఘనత భారతదేశంలో స్వదేశీ క్వాంటం హార్డ్‌వేర్ అభివృద్ధికి బలమైన పునాది వేసినట్లైంది. 2025 సెప్టెంబరులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ మంత్రి నారా లోకేష్ సమక్షంలో శాస్త్రవేత్తలు, పరిశోధకులు, పరిశ్రమల ప్రతినిధులు సమావేశమై క్వాంటం కంప్యూటింగ్‌కు అవసరమైన సుమారు 85 శాతం భాగాలను దేశీయంగా అభివృద్ధి చేయవచ్చని నివేదించారు. దీనితో "మేడ్ ఇన్ అమరావతి ఫర్ ది వరల్డ్" అనే లక్ష్యంతో స్వదేశీ క్వాంటం హార్డ్‌వేర్ ఎకోసిస్టమ్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

ఈ దిశగా అమరావతి క్వాంటం వ్యాలీ, క్యూబిట్ ఫోర్స్ మరియు క్యూబిటెక్ సంస్థలతో కలిసి భారతదేశ క్వాంటం సరఫరా గొలుసును మ్యాప్ చేసి, క్రయోజెనిక్ టెక్నాలజీల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. ఈ కృషిలో భాగంగా 2026 ఏప్రిల్‌లో మేధా టవర్స్, అమరావతి మరియు ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ–ఏపీలో దేశంలోని తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీలు ఏర్పాటు చేయబడ్డాయి. 4 కెల్విన్ ఉష్ణోగ్రత సాధనతో సూపర్‌కండక్టింగ్ పరికరాలు, క్వాంటం సెన్సర్లు, క్రయోజెనిక్ ఎలక్ట్రానిక్స్, సింగిల్ ఫోటాన్ డిటెక్టర్లు, మైక్రోవేవ్ వ్యవస్థలు, క్వాంటం కమ్యూనికేషన్ పరికరాలు



మరియు ఆధునిక క్వాంటం పదార్థాల పరీక్షలు నిర్వహించే సామర్థ్యం ఈ కేంద్రానికి లభించింది. ఇవే భవిష్యత్ క్వాంటం కంప్యూటర్లు, సురక్షిత కమ్యూనికేషన్ వ్యవస్థలు, అధునాతన సెన్సింగ్ సాంకేతికతలకు కీలక నిర్మాణ భాగాలుగా నిలుస్తాయి.

ప్రస్తుతం ఈ వ్యవస్థను మరింత చల్లబరుస్తూ మిల్లీ కెల్విన్ స్థాయి అత్యల్ప ఉష్ణోగ్రతలకు తీసుకెళ్లే ప్రక్రియ కొనసాగుతోంది. అది విజయవంతమైతే భారత్‌లో స్వదేశీ క్వాంటం ప్రాసెసర్ అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది. ఈ కేంద్రం స్టార్టప్‌లు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలకు పరీక్షలు, ధృవీకరణ, పరిశోధన మరియు ఆవిష్కరణల వేదికగా సేవలందించనుంది.

## రెండేళ్లలో ప్రజలకు ఎన్నో మేలు చేశాం..

### ఎన్నో విజయాలు సాధించాం: మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి

సాక్ష్యం , విశాఖపట్నం

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం – సంక్షేమం, అభివృద్ధి" 





కార్యక్రమం శుక్రవారం ఆంధ్రా విశ్వవిద్యాలయం కన్వెన్షన్ హాలులో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వ రెండేళ్ల విజయాలను వివరించారు. గత రెండేళ్లలో పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేసి విశేష ఫలితాలు సాధించిందని మంత్రి పేర్కొన్నారు. సామాజిక భద్రతా పెన్షన్లు, తల్లికి వందనం, స్త్రీ శక్తి, దివ్యాంగ శక్తి వంటి పథకాలను అమలు చేస్తూ ప్రజలకు ప్రత్యక్ష లబ్ధి చేకూర్చుతున్నామన్నారు. విశాఖపట్నంలో భారీ పెట్టుబడులు, ప్రపంచ స్థాయి సంస్థల రాకతో ఆర్థికాభివృద్ధికి బలమైన పునాదులు పడుతున్నాయని తెలిపారు. కార్యక్రమానికి ముందు వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 13 ప్రగతి ప్రదర్శన స్టాళ్లను మంత్రి సందర్శించారు. అనంతరం డీఆర్‌డీఏ, ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు మంజూరైన ఆటోలు, ట్రాక్టర్లను పంపిణీ చేశారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.84.24 కోట్ల విలువైన మెగా చెక్కును అందజేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ మాట్లాడుతూ విశాఖ అభివృద్ధి వేగంగా కొనసాగుతోందని, గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులు నగర భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాయని తెలిపారు. విశాఖపట్నం ఎంపీ ఎం. భరత్ భోగాపురం విమానాశ్రయం అనుసంధాన రహదారులు, స్మార్ట్ ట్రాఫిక్ ప్రణాళికలు నగరాభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ మాట్లాడుతూ రాష్ట్రానికి వచ్చే పెట్టుబడుల్లో సగానికి పైగా విశాఖకు వస్తున్నాయని, రూ.75 వేల కోట్ల పెట్టుబడులతో 1.50 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్, విశాఖపట్నం ఎంపీ ఎం. భరత్, ప్రభుత్వ విప్‌లు వేపాడ చిరంజీవిరావు, పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు), ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి. విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## నాసిరకం మందుల చెలామణిపై ఉక్కుపాదం మోపాలి: మంత్రి సత్యకుమార్ యాదవ్

సాక్ష్యం , విశాఖపట్నం

రాష్ట్రంలో నాసిరకం మందుల చెలామణిని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ఔషధ నియంత్రణ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. విజయవాడలో నూతనంగా నిర్మించిన రాష్ట్ర ఔషధ పరీక్ష ప్రయోగశాల (స్టేట్ డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్) మరియు ఔషధ నియంత్రణ ప్రధాన కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత రెండేళ్లలో మందుల నమూనాల సేకరణ, పరీక్షల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. గతంలో



ఏడాదికి సుమారు 4 వేల నమూనాలు మాత్రమే పరీక్షించగా, ప్రస్తుతం రాష్ట్ర స్థాయి ల్యాబ్‌గా అభివృద్ధి చేసిన విజయవాడ కేంద్రంలో ఏడాదికి 13 వేల నమూనాలను పరీక్షించే సామర్థ్యం ఏర్పడిందన్నారు. నాణ్యత లేని మందుల శాతం 2.13 శాతం నుంచి 1.02 శాతానికి తగ్గిందని పేర్కొంటూ అధికారుల కృషిని అభినందించారు. అయితే నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజారోగ్య పరిరక్షణ విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేసిన మంత్రి, నాసిరకం మందులు, కల్తీ ఆహార పదార్థాలను గుర్తించి వాటి చెలామణిని అరికట్టేందుకు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కార్యకలాపాలను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం)తో అనుసంధానిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి ల్యాబ్‌కు ఎన్‌ఏబీఎల్ గుర్తింపు తీసుకురావడానికి అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ మాట్లాడుతూ, కొత్త ప్రయోగశాలను కేవలం భవనంగా కాకుండా ప్రజారోగ్య రక్షణకు ఉపయోగపడే వ్యవస్థగా చూడాలని అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో నాణ్యతలేని మందులు, కల్తీ ఉత్పత్తులపై సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## గాదె సాయికృష్ణ మృతి ప్రభుత్వ హత్యే..

### సీబీఐతో విచారణ జరపాలి: మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్ష్యం , విశాఖపట్నం.

కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో లాకప్ డెత్‌కు గురైన గాదె సాయికృష్ణ మృతి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని, ఈ ఘటనపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించి బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ గోదావరి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. విశాఖలోని వైఎస్సార్‌సీపీ సిటీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సాయికృష్ణ కేసులో సీఐ నాగరాజుపై హత్యాయత్నం కేసు నమోదు చేయడం ద్వారా బాధితుడు పోలీసు కస్టడీలోనే మరణించినట్లు ప్రభుత్వం పరోక్షంగా అంగీకరించినట్టేనని అన్నారు. సాయికృష్ణ అదృశ్యమైన తర్వాత నెల రోజుల పాటు అతని తల్లి పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతూ తన కుమారుడి ఆచూకీ కోసం వెతికినా సరైన సమాచారం ఇవ్వలేదని, చివరకు న్యాయస్థానాన్ని ఆశ్రయించిన తర్వాతే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని అమర్‌నాథ్ పేర్కొన్నారు. లాకప్‌లో హింసించి చంపడమే కాకుండా, కుటుంబ సభ్యులకు కనీస సమాచారం ఇవ్వకుండా వ్యవహరించడం అత్యంత అమానుషమని ఆయన విమర్శించారు. ఈ ఘటనలో కేవలం ఒక అధికారిని బాధ్యుడిగా చూపించి మిగతా ఉన్నతాధికారులను తప్పించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించిన ఆయన, పోలీస్ కమిషనర్, డీజీపీతో పాటు సంబంధిత అధికారుల పాత్రపైనా సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఐజీ స్థాయి అధికారులపై విచారణకు ఎస్పీని నియమించడం వల్ల నిజాలు బయటకు రావని, కేసును నీరుగార్చేందుకు చేస్తున్న ప్రయత్నంగానే ఇది కనిపిస్తోందని అన్నారు. సాయికృష్ణ కుటుంబానికి న్యాయం జరగాలంటే కేసును సీబీఐకి అప్పగించి స్వతంత్ర విచారణ చేపట్టాలని, ఘటనకు సంబంధించిన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అలాగే కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ



ఫుటేజీలను పూర్తిగా విడుదల చేసి వాస్తవాలను ప్రజల ముందుంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి క్షీణిస్తోందని, హత్యలు, మహిళలు మరియు చిన్నారులపై నేరాలు పెరుగుతున్నాయని ఆరోపిస్తూ, ప్రజా సమస్యలపై ప్రభుత్వం సమాధానం చెప్పకుండా దారి మళ్లింపు రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ శాసనసభ్యుడు చింతలపూడి వెంకటరామయ్య, జిల్లా పార్టీ పరిశీలకుడు రవి రెడ్డి, రాష్ట్ర పార్టీ కార్యదర్శి గండి రవి తదితరులు పాల్గొన్నారు.

## 'అరణ్యారామం' భవనానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శంకుస్థాపన

సాక్ష్యం , విశాఖపట్నం

రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖల పరిశోధన, శిక్షణ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం నిర్మించనున్న 'అరణ్యారామం' భవనానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ మరియు పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ శంకుస్థాపన చేశారు. మంగళగిరి సమీపంలోని బ్రహ్మానందపురంలో ఎయిమ్స్ వద్ద సుమారు రూ.24 కోట్ల అంచనా వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్‌తో పాటు అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అరణ్యారామం రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖలకు సంబంధించిన పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాలు, ప్రకృతి పరిరక్షణ చర్యలు, పర్యావరణ నిర్వహణ కార్యక్రమాల సమన్వయానికి కామన్ ఫెసిలిటీ సెంటర్‌గా సేవలు అందించనుంది. ఈ కేంద్రం హనుమాన్ కార్యక్రమాలకు కమాండ్ సెంటర్‌గా, ఆంధ్రప్రదేశ్ గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టుకు పర్యవేక్షణ కేంద్రంగా, పులుల సంరక్షణ, అటవీ అగ్నిప్రమాదాల నివారణ,



జీవావరణ పునరుద్ధరణ, వాతావరణ స్థిరత్వం, ఎకో–టూరిజం అభివృద్ధి, డిజిటల్ పర్యావరణ పరిపాలన వంటి కీలక కార్యక్రమాలకు సమన్వయ కేంద్రంగా పనిచేయనుంది. ఆధునిక సాంకేతికతతో ప్రకృతి పరిరక్షణకు సంబంధించిన శాస్త్రీయ పరిశోధనలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయి కార్యకలాపాల పర్యవేక్షణకు పరిపాలనా కేంద్రంగా నిలవనుంది. శంకుస్థాపన అనంతరం పవన్ కళ్యాణ్ అరణ్యారామం భవన నమూనాను పరిశీలించి, హనుమాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన వన్యప్రాణి రక్షణ చర్యలకు సంబంధించిన ఫోటో ప్రదర్శనను తిలకించారు. 2024 సంవత్సరంలో రాష్ట్ర అటవీ శాఖ 185 వన్యప్రాణి రక్షణ చర్యలు, 36 మానవ–వన్యప్రాణి ఘర్షణ నివారణ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అటవీ శాఖ సిబ్బందిని పవన్ కళ్యాణ్ అభినందించారు.

## రూ.650 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టాం – హోంమంత్రి వంగలపూడి అనిత

సాక్ష్యం , విశాఖపట్నం

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గంలో శుక్రవారం విజయోత్సవ



వేడుకలు ఘనంగా నిర్వహించారు. నక్కపల్లి మండలం దొడ్డిగల్లు జంక్షన్ నుంచి వేంపాడు టోల్ ప్లాజా వరకు కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం భారతి కన్వెన్షన్‌లో జరిగిన విజయోత్సవ సభలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ గత రెండేళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. ప్రజలకు సేవ చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాజకీయ నేపథ్యం లేకుండానే ప్రజల ఆశీర్వాదంతో రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజల మద్దతుతోనే మంత్రి పదవి దక్కిందని చెప్పారు. పాయకరావుపేట నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

నియోజకవర్గంలో రెండేళ్ల కాలంలో సుమారు రూ.650 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించిన ఆమె, పందూరు వంతెన నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేసి ప్రారంభిస్తామని తెలిపారు. సోమిదేపల్లిలో రూ.9 కోట్లతో రిటైనింగ్ వాల్, అణుకు గిరిజన గ్రామానికి రూ.3 కోట్లతో రహదారి నిర్మాణం జరుగుతోందన్నారు. అడ్డరోడ్డును కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. యువతకు 20 వేల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. సభలో అనకాపల్లి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. అనకాపల్లి జిల్లాకు భారీ స్థాయిలో పరిశ్రమలు వస్తున్నాయని, హోంమంత్రి అనిత నాయకత్వంలో పాయకరావుపేట మరింత అభివృద్ధి చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిమ్‌లపై పోలీసుల దాడులు

హైదరాబాద్,జూన్19(సాక్ష్యం): నగరంలోని పలు జిమ్‌లపై ఏసీపీ ఆకస్మిక తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇటీవల జిమ్‌లలో వరుసగా యువకులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనల నేపథ్యంలో పోలీసులు రంగంలోకి దిగారు. శరీరాకృతి కోసం స్టెరాయిడ్లను విచక్షణారహితంగా వాడటం వల్ల తీవ్రమైన గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు హైదరాబాద్‌లోని పలు జిమ్‌లలో వరుసగా తనిఖీలు చేస్తున్నారు. శుక్రవారం కుల్సుంపురా, టప్పాచబుత్ర, గుడిమల్కాపూర్ ప్రాంతాల్లోని జిమ్‌లలో పోలీసుల ముమ్మరంగా సోదాలు నిర్వహించారు.

# 20 ప్రాంతాల్లో ఆధునిక ధాన్య సైలోలు



మొదటిపేజీ తరువాయి..

అభివృద్ధి చేసే అవకాశాలను అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. సైలోలు ప్రస్తుతం అమలులో ఉన్న ధాన్యం కొనుగోలు, నిల్వ వ్యవస్థలకు ప్రత్యామ్నాయం కాదని, వాటికి అనుబంధంగా పనిచేసే ఆధునిక మౌలిక వసతులుగా ఉపయోగపడతాయని స్పష్టం చేశారు. 'తెలంగాణలో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లలో స్వయం సహాయక సంఘాలు, ఐకేపీ కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. భవిష్యత్తులో కూడా వారి పాత్ర కొనసాగుతుంది. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రస్తుత కొనుగోలు వ్యవస్థను కొనసాగిస్తూనే ఆధునిక సాంకేతికతను అనుసంధానం చేస్తాం' అని మంత్రి తెలిపారు. పంట కోతల అనంతరం నిల్వ నష్టాలను తగ్గించడం, ధాన్యం నాణ్యతను పరిరక్షించడం, రవాణా వ్యవస్థను వేగవంతం చేయడం, సరఫరా గొలుసును మరింత సమర్థవంతంగా మార్చడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన చెప్పారు. సమావేశంలో పాల్గొన్న సాంకేతిక నిపుణులు ఆధునిక సైలోల ద్వారా ధాన్యం స్వీకరణ నుంచి నిల్వ, రవాణా వరకు మొత్తం ప్రక్రియను ఆటోమేటెడ్ పద్ధతిలో నిర్వహించవచ్చని వివరించారు. డిజిటల్ నాణ్యత పరీక్షలు, యాంత్రిక అన్‌లోడింగ్, సెన్సార్ ఆధారిత పర్యవేక్షణ, శాస్త్రీయ నిల్వ విధానాల ద్వారా ధాన్య నాణ్యతను దీర్ఘకాలం కాపాడవచ్చని తెలిపారు. ÷-రస్తుతం కొనుగోలు కేంద్రాలు, నిల్వ కేంద్రాల వద్ద ఎదురవుతున్న కార్మికుల కొరత, రవాణా ఆలస్యం వంటి సమస్యలకు కూడా ఈ వ్యవస్థ సమర్థవంతమైన పరిష్కారం చూపగలదని మంత్రి అభిప్రాయపడ్డారు. ల్గ÷ల్వే అనుసంధానంతో కూడిన ఆధునిక లాజిస్టిక్స్ వ్యవస్థ ద్వారా ధాన్యాన్ని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు, దేశవ్యాప్తంగా వినియోగ కేంద్రాలకు వేగంగా తరలించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రధాన వరి ఉత్పత్తి జిల్లాల్లో సైలోల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలు, నిల్వ సామర్థ్యాలు, పెట్టుబడి వ్యయం, అమలు విధానాలపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని మంత్రి సంబంధిత సంస్థలను ఆదేశించారు. 'ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా, పంపిణీ వ్యవస్థలను మరింత బలోపేతం చేసి రైతులకు, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యంగా సాంకేతికతను వినియోగిస్తూ వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతాం' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# గాంధీ సరోవర్‌కు పచ్చజెండా

మొదటిపేజీ తరువాయి..

మంత్రిత్వ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బాపూఘాట్‌ను 'గాంధీ సరోవర్'గా అభివృద్ధి చేయడానికి వర్కింగ్ పర్మిషన్‌ను మంజూరు చేసింది. రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి వినియోగానికి అనుమతిచ్చింది. ఆర్టిలరీ సెంటర్




గోల్కొండ పరిధిలోని భూమిలో అభివృద్ధి పనులకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చింది.

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ నుండి కీలక అనుమతులు లభించాయి. హైదరాబాద్‌లోని బాపు ఘాట్ వద్ద నిర్మించతలపెట్టిన గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పనులకు రక్షణ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ కీలకమైన క్లియరెన్స్ లభించడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో సహకరించి, అనుమతులు మంజూరు చేసినందుకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర రక్షణ శాఖ , ఇండియన్ ఆర్మీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసీ నది పునరుజ్జీవనం , రివర్‌ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌కు అనుమతులు రావడం ఒక కీలక మైలురాయి అని అభివర్ణించారు. బాపు ఘాట్ పరిసర ప్రాంతాలలో ఈ ప్రాజెక్ట్ పనులు ప్రారంభం కావడం వల్ల మూసీ పరివాహక ప్రాంత రూపురేఖలు మారిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మూసీ నది పరివాహక ప్రాంతాన్ని కేవలం ఒక నదిలా కాకుండా.. అద్భుతమైన పర్యావరణ, సాంస్కృతిక , గొప్ప ప్రజా ఆస్తిగా మార్చడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా హైదరాబాద్ నగరానికి ఒక సరికొత్త పర్యాటక హంగులు తోడవుతాయని, పర్యావరణ రక్షణకు కూడా ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కేంద్ర రక్షణ శాఖ ఇచ్చిన ఈ గ్రీన్ సిగ్నల్‌తో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పనులు మరింత వేగంగా ముందుకు సాగనున్నాయి. మూసీ పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో ఇదో మైలురాయన్నారు. మూసీ పరివాహక ప్రాంతాన్ని పర్యావరణ, సాంస్కృతిక, ప్రజా ఆస్తిగా మార్చడమే లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు

మొదటిపేజీ తరువాయి..

ఇజ్రాయెల్ సేనలు జరిపిన అతిపెద్ద దాడుల్లో ఇదొకటని పేర్కొన్నాయి. నబాతియే నగరంతోపాటు కఫర్ జౌజ్, కఫర్ రెమాన్, జెబ్షెన్ చుట్టుపక్కల అనేక పట్టణాల్లో ఈ దాడులు జరిగినట్లు అంతర్జాతీయ వార్త ఏజెన్సీలు తెలిపాయి. ఆ తర్వాత వరుస వైమానిక దాడులు కఫర్ టిబ్నిట్, రేహాన్ వంటి ఎత్తైన ప్రాంతాల్లో జరిగినట్లు తెలిపాయి. ఇజ్రాయెల్ జరిపిన ఈ దాడుల కారణంగానే అమెరికా-ఇరాన్ మధ్య జెనీవాలో శుక్రవారం జరగాల్సిన చర్చలు వాయిదాపడినట్లుగా భావిస్తున్నారు. ఫలితంగా పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. "హిజ్బుల్లా ఉగ్రవాద సంస్థ కాల్పుల విరమణను పదేపదే ఉల్లంఘిస్తోంది. ముఖ్యంగా ఐడీఎఫ్ దళాలకు వ్యతిరేకంగా ఉగ్రవాద కుట్రలను అమలు చేస్తున్నందుకు ప్రతిస్పందనగా బెకా లోయలోని హిజ్బుల్లా ఉగ్రవాద సంస్థ మౌలిక సదుపాయాలపై వైమానిక దళం దాడి చేసింది." అని ఇజ్రాయెల్ వైమానిక దళం తెలిపింది. దక్షిణ లెబనాన్‌లో జరిగిన ఒక అనుమానిత డ్రోన్ దాడిలో ఐడీఎఫ్ ట్యాంక్ బెటాలియన్ కమాండర్‌తో పాటు మరో ముగ్గురు సైనికులు మరణించారని హిజ్బుల్లా కాల్పుల విరమణను ఉల్లంఘించిందని ఇజ్రాయెల్ దళాలు ఆరోపిస్తున్నాయి. మరణించిన అధికారిని లెఫ్టినెంట్ కల్నల్ డోర్ గెడాలియా బెన్ సిమోన్ (32)గా గుర్తించారు. అంతకుముందు గురువారం రాత్రి జరిగిన మరో హిజ్బుల్లా దాడిలో ఐదుగురు సైనికులు గాయపడ్డారని, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని పేర్కొంది. మరోవైపు ఈ దాడులపై ఇజ్రాయెల్ జాతీయ భద్రతా మంత్రి ఇటామర్ బెన్ గ్విర్ స్పందించారు. లెబనాన్ మొత్తం తగలబడిపోవాలని వ్యాఖ్యానించారు. తాము సంయమనంతో గెలవలేమని, ఇదే విషయాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు తెలిపామని చెప్పారు. "ఇజ్రాయెల్ తల్లి ప్రతి కన్నీటికి, వెయ్యి మంది లెబనాన్ తల్లులు ఏడవాలి. లెబనాన్ అంతా తగలపడిపోవాలి! అమెరికన్ల పట్ల గౌరవంతో మా పౌరుల భద్రతను వదులుకోలేదని స్పష్టం చేయాలి." అని అన్నారు. అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందంలో లెబనాన్ అంశాన్ని కూడా చేర్చింది. లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక ఆపరేషన్లను తక్షణమే ముగించి ఆ ప్రాంతాన్ని



వీడాలని ఒప్పందంలో ప్రస్తావించారు. అయితే, దీన్ని ఇజ్రాయెల్ ముందునుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. హెజ్‌బొల్లా నుంచి తమకు పొంచి ఉన్న ముప్పు పూర్తిగా తొలగిపోయేంతవరకు దక్షిణ లెబనాన్ నుంచి వెనక్కి వెళ్లబోమని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఇప్పటికే తేల్చి చెప్పారు. సరిహద్దు నుంచి 10 కిలోమీటర్ల వరకూ ఆక్రమించుకున్న ప్రాంతం నుంచి వైదొలగబోమని స్పష్టం చేశారు. ఈ ప్రకటన చేసిన కొద్ది గంటలకే ఇజ్రాయెల్ దళాలు దాడులను ముమ్మరం చేయడంతో మళ్లీ ఉద్రిక్తతలు రాజుకున్నాయి. అయితే, ఈ పరిణామాలపై ఇరాన్, అమెరికా ఇంకా స్పందించలేదు.

# నీట్ రీ ఎగ్జామ్‌కు లైన్ క్లియర్

మొదటిపేజీ తరువాయి..

న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇటీవల పరీక్ష నిలిపివేయాలంటూ కొందరు విద్యార్థులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం అందుకు నిరాకరించింది. పిటిషన్లను అత్యవసరంగా విచారణ జరపాలంటూ అభ్యర్థుల తరపు న్యాయవాది కోరగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం దాన్ని తోసిపుచ్చింది. నీట్‌కు సంబంధించిన అన్నీ పిటిషన్లు జస్టిస్ పీఎస్ నరసింహ ధర్మాసనం ముందుకు వెళ్లాయని వీటిని కూడా ఆ ధర్మాసనమే విచారిస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులు వేసిన పిటిషన్లలో అత్యవసర పరిస్థితి లేదని ఆయన తేల్చిచెప్పారు. పేపర్ లీకేజీ, అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్‌లో సమస్యలు ఉన్నాయన్న పిటిషన్లను ఈ మేరకు సుప్రీంకోర్టు కొట్టివేసింది విద్యార్థులు, నీట్-యూజీ అభ్యర్థులు దాఖలు చేసిన ఒక ప్రత్యేక పిటిషన్‌పై తక్షణమే విచారణ చేపట్టాలని న్యాయవాది




అదీల్ అహ్మద్ కోరారు. అభ్యర్థుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని జూన్ 21న పరీక్ష నిర్వహించే సాధ్యాసాధ్యాలను పునఃపరిశీలించాలని ఈ మేరకు కేంద్రాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. "మానసిక క్షోభ, తీవ్ర ఆందోళన, పరీక్ష రద్దు కావడం వల్ల తలెత్తిన అనిశ్చితి, తగినంత సన్నద్ధత సమయం లేకపోవడం, పరీక్ష సమగ్రతపై అనుమానాలు, ఇతర పరీక్షలతో తేదీలు ఒకేలా ఉండటం, నిర్వహణాపరమైన ఇబ్బందులు, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు వంటి అంశాల నేపథ్యంలో ఈ విజ్ఞప్తులు వస్తున్నాయి." అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

కాగా.. జూన్ 21న (ఆదివారం) నీట్ (యూజీ) రీ ఎగ్జామ్ జరగనుంది. ఈసారి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం పరీక్ష నిర్వహణ సంస్థ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తోంది. పరీక్షను పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు జూన్ 20న దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్ నిర్వహించనుంది. అంతకుముందు ప్రశ్నా పత్రాల లీకేజీ ఆరోపణలు, భద్రతా ఆందోళనల నేపథ్యంలో ఈసారి ఎలాంటి లోపాలకు అవకాశం లేకుండా పటిష్ట భద్రతా వ్యవస్థను అమలు చేస్తున్నట్లు ఎన్‌టీఏ స్పష్టం చేసింది. ఇందులో భాగంగానే పరీక్ష రోజు మాదిరిగానే నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా, ప్రశ్నాపత్రాల రవాణా నుంచి మొదలుకొని అభ్యర్థుల తనిఖీ వరకు అన్ని వ్యవస్థలు సజావుగా పనిచేస్తున్నాయో లేదో చూసేందుకు ముందస్తుగా ఈ మాక్ డ్రిల్‌ను నిర్వహిస్తున్నారు. ఇందుకోసం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తుండటం విశేషం. దేశవ్యాప్తంగా 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో పెన్ అండ్ పేపర్ మోడ్‌లో నీట్ రీ ఎగ్జామ్ నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు 22.79 లక్షల మందికిపైగా అభ్యర్థులు హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు నీట్ టెస్ట్ జరగనుంది. దివ్యాంగ అభ్యర్థులకు అదనంగా సమయం కేటాయిస్తారు. వారికి సాయంత్రం 6.20 గంటల వరకు అవకాశం ఉంటుంది. నీట్ రీ ఎగ్జామ్ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం సహా పోలీసులు, ప్రత్యేక భద్రతా బృందాలు, పరీక్ష నిర్వాహకులతో కలిపి మొత్తం 2 లక్షల మందికిపైగా సిబ్బందిని మోహరించినట్లు ఎన్‌టీఏ తెలిపింది. గతంలో నీట్ ఎగ్జామ్‌కు సంబంధించి ఆరోపణలు రాగా ఈసారి ఎన్‌టీఏ మరింత కఠినమైన భద్రతా ప్రమాణాలు అమలు చేస్తోంది. ఇక్కడ జీపీఎస్ ట్రాకింగ్ ఉన్న వాహనాల్లో ప్రశ్నపత్రాల రవాణా, పోలీస్ ఎస్కార్ట్‌లతో భద్రత, అన్ని కేంద్రాల్లోనూ సీసీటీవీ నిఘా వ్యవస్థ, ఢిల్లీలోని సెంట్రల్ కంట్రోల్ రూం నుంచి పరీక్షా కేంద్రాల్లోని సీసీటీవీ కెమెరాల్ని రియల్ టైమ్ మానిటరింగ్ చేయనున్నారు. దీని వల్ల ప్రతి టెస్ట్ సెంటర్‌ను అధికారులు లైవ్‌లో పర్యవేక్షించే వీలుంటుంది. ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ధ్రువీకరణ, హై సెన్సిటివిటీ మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు నిర్వహించనున్నారు. ఒకవేళ వేలిముద్రలు సరిగా పడకపోయినా, సాంకేతిక సమస్యలు లేదా యూఐడీఏఐ కనెక్టివిటీ లోపాలతో బయోమెట్రిక్ వెరిఫికేషన్ జరగకపోయినా విద్యార్థుల్ని పరీక్షకు అనుమతిస్తామని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. అలాంటి విద్యార్థులు సెంటర్ సూపరింటెండెంట్ ముందు రిట్టెన్ అండర్ టేకింగ్‌పై (లిఖితపూర్వక హామీ పత్రం) సంతకం చేసి, మాన్యువల్ ఐడెంటిటీ వెరిఫికేషన్ (ఇతర గుర్తింపు కార్డు) అనంతరం పరీక్ష రాయొచ్చు. విద్యార్థుల్ని పరీక్ష కేంద్రాలకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటలలోపు చేరుకోవాలని సూచించారు అధికారులు. ఆ తర్వాత అసలు ప్రవేశం ఉండదని స్పష్టం చేశారు. ఇక విద్యార్థులు తప్పనిసరిగా పరీక్ష కేంద్రాలకు అడ్మిట్ కార్డ్ ప్రింట్ కాపీ, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, ఒరిజినల్ ఫొటో ఐడీ తీసుకెళ్లాలి. పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులు ట్రాన్స్‌పరెంట్ వాటర్ బాటిల్ తీసుకెళ్లొచ్చు. దయాబెటిస్ ఉన్న వారు షుగర్ టాబ్లెట్స్, అరటి పండ్లు, యాపిల్, నారింజ పండ్లు వంటివి తీసుకెళ్లేందుకు అనుమతి ఉంటుంది. ఇక మొబైల్ ఫోన్స్, స్మార్ట్ వాచ్‌లు, కాలిక్యులేటర్స్, బ్లూటూత్ పరికరాలు, జువెల్లరీ, వాలెట్స్ వంటివి తీసుకెళ్లరాదు.

# కేంద్రం నిర్ణయం మేరకే కొంటే మీరెందుకు?

మొదటిపేజీ తరువాయి..

వరంగల్‌లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. ఆయన జన్మదినం రోజే ఆ డిక్లరేషన్‌ను తెలంగాణ సీఎం బొందపెట్టారని హరీశ్ రావు విమర్శించారు. ధాన్యం ఏదైనా కనీస మద్దతు ధరతోపాటు బోనస్ కూడా ఇస్తామని నాడు రాహుల్ గాంధీ వరంగల్ వేదికగా ప్రకటించారని గుర్తు చేశారు. కానీ అందుకు భిన్నంగా కేంద్రం చెప్పిందే కొంటాం.. ఎంత కొనమంటే అంతే కొంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెలిపారు. తన బాధ్యత నుంచి తప్పించుకుంటుందంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం కొన్నా కొనకపోయినా.. అన్ని పంటలు కొన్నది కేసీఆర్ ప్రభుత్వమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తన నిర్ణయం మార్చుకోవాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేంద్రం ఎంఎస్‌పి ప్రకటిస్తుంది తప్ప మక్కలూ, జొన్నలు కొనదా? అని అసహనం వ్యక్తం చేశారు. పప్పు దినుసులు, వేరుశనగ 25 శాతం మాత్రమే కేంద్రం కొనుగోలు చేస్తుందన్నారు. అంటే మిగతా పంటను రైతులు బయట అమ్ముకోవాలా? అని ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. దళారుల దయాదక్షిణ్యంపై రైతులు ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేంద్రం కొంటుందని.. మిగతా పంటను రైతులు ఏం చేయాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలంటున్న రైతులకు ప్రభుత్వం భరోసా ఇస్తుందా అని అడిగారు. తడి గుడ్డతో రైతుల గొంతును రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోస్తుందన్నారు. రైతులు జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయన్నారు. ఎకరాకు రెండు బస్తాల యూరియా మాత్రమే.. అదీ నెలకు ఒకటి చొప్పున ఇస్తారట అంటూ ఆయన ఆందోళన చెందారు. రైతులంటే మీకు ఎందుకు ఇంత చిన్నచూపు అని మంత్రులను ఆయన ప్రశ్నించారు. యూరియా ఇచ్చే తెలివి కూడా లేదా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. మిర్చి రైతులు ఎకరాకు ఐదారు యూరియా బస్తాలు వాడుతారని.. మరి మీరు రెండే ఇస్తే మిగతాది ఎట్లా అని ప్రశ్నించారు. కేంద్రం 30 శాతం యూరియా ధరలు పెంచిందని వివరించారు. రెండు బస్తాల ఆలోచన విరమించుకోవాలని ప్రభుత్వానికి ఆయన హితవు పలికారు. 45 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయిల రైతు బంధు ఇస్తామన్నారని.. 90 రోజులు అయ్యిందని.. ఇప్పటికీ రైతుల ఖాతాల్లో నగదు మొత్తం పడలేదని విమర్శించారు. ఎకరాకు రూ.15 వేలు అన్నారని చెప్పారు. 2024-25 వానాకాలం పంటకు ఒక్క రూపాయి ఇవ్వలేదని.. పూర్తిగా ఎగ్గొట్టారని తెలిపారు.

ల్గ÷తుబంధు కింద కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం 5 పంటలకు రైతులకు రూ.29,358 కోట్లు బకాయి పడ్డిందని అన్నారు. రైతు బీమా ఆగలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల చెప్పారని గుర్తు చేశారు. మరి ఈ ఏడాది జనవరి నుంచి నేటి వరకు రైతు బీమా ఆగిందా? లేదా చెప్పాలని మంత్రులను ఆయన బల్ల గుద్ది ప్రశ్నించారు. దీనిపై చర్చకు ఏ ఊరుకైనా పోదాం వస్తారా అని మంత్రులకు ఆయన సవాల్ విసిరారు. మొత్తం రాష్ట్రంలో 7,600 మందికి బీమా రాలేదని గణాంకాలతో సహా హరీశ్‌రావు వివరించారు. ఎందుకు భీమా రావడం లేదంటే.. ప్రభుత్వం ప్రీమియం కట్టలేదన్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో గురువారం మీరు కేబినెట్‌లో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. అన్ని పంటలు యథావిధిగా కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి స్పష్టం చేశారు. తప్పుడు నిర్ణయం తీసుకున్నందుకు రైతులకు క్షమాపణ చెప్పాలని రేవంత్ సర్కార్‌ను హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# గండిపేట భూకబ్జా కేసు


## షరతులతో బ్రహ్మానాయుడికి బెయిల్

హైదరాబాద్,జూన్19(సాక్ష్యం): గండిపేట భూకబ్జా కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడికి బెయిల్ మంజూరు అయ్యింది. ఆయనకు రంగారెడ్డి కోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. ప్రతి 15 రోజులకు ఒకసారి నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసింది. రూ.20 వేల చొప్పున రెండు ష్యూరిటీలు సమర్పించాలని రంగారెడ్డి న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసులో సాక్షులను, విచారణను ప్రభావితం చేసే విధంగా ప్రవర్తించవద్దని షరతుల్లో పేర్కొంది. ఫేక్ జీవో కేసులో ఇప్పటికే ఈవోడబ్ల్యూ పోలీసులు మూడు రోజుల పాటు బొల్లా బ్రహ్మానాయుడిని కస్టడీలోకి తీసుకుని విచారించారు. కస్టడీ ముగిసిన తర్వాత ఆయనను జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ బొల్లా బ్రహ్మానాయుడు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు ముగిసిన అనంతరం మాజీ ఎమ్మెల్యేకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే, కస్టడీలో మాజీ ఎమ్మెల్యే సరైన సమాధానాలు చెప్పలేదని, ఏ ప్రశ్నలు అడిగా తనకు తెలీదని మాత్రమే చెప్పారని, తాము ఆశించిన స్థాయిలో విచారణకు సహకరించలేదంటూ న్యాయస్థానం దృష్టికి పోలీసులు తీసుకెళ్లారు. కస్టడీ పూర్తి అయినందుకు బెయిల్ పొందేందుకు అర్హుడే అంటూ బొల్లా బ్రహ్మానాయుడు తరఫు న్యాయవాదులు వాదించారు. దీంతో మాజీ ఎమ్మెల్యేకు రంగారెడ్డి జిల్లా కోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది.

# అనుమానం..పెను భూతమై

## పసికందును బలి తీసుకున్న తండ్రి
## భార్యపై అనుమానంతో చిన్నారి హత్య

నిజామాబాద్,జూన్19(సాక్ష్యం): నిజామాబాద్ పట్టణంలో దారుణ ఘటన వెలుగు చూసింది. రెండు నెలల చిన్నారిని కన్నతండ్రే అత్యంత దారుణంగా నరికి చంపడం కలకలం రేపింది. భార్యపై అనుమానంతో పిల్లాడు తనకు పుట్టలేదన్న అనుమానంతో నిందితుడు ఈ ఘాతుకానికి పాల్పడటం కలకలం రేపుతోంది. మహారాష్ట్రలోని నయాగావ్‌కు చెందిన యువరాజ్, నిజామాబాద్‌లోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన ప్రియాంక ఏడాది కిందట వివాహం చేసుకున్నారు. కొన్ని నెలలపాటు వారి బంధం అన్యోన్యంగా సాగింది. ఆ తర్వాత ప్రియాంకపై యువరాజ్ అనుమానం పెంచుకోవడం ప్రారంభించాడు. ప్రియాంకను అనుమానిస్తూ ప్రతిరోజూ వేధించడం మొదలుపెట్టాడు. మరోవైపు ఆమె గర్భం దాల్చడంతో వేధింపులు మరింత పెరిగాయి. ఇటీవల పుట్టింటికి వచ్చిన బాధిత తల్లి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే, చిన్నారి తనకు పుట్టలేదంటూ ప్రియాంక కుటుంబ సభ్యులతో పలుమార్లు యువరాజ్ గొడవకు దిగాడు. ఈ నేపథ్యంలోనే జూన్ 17న బుధవారం చిన్నారిని ఇంటి నుంచి తీసుకెళ్లిపోయాడు. అనంతరం నిర్మానుష్య ప్రదేశంలో బాలుడిని కత్తితో పలుమార్లు నరికి హత్య చేశాడు. ఆ తర్వాత మృతదేహాన్ని రైల్వే పట్టాల పక్కన పడేసి పరారయ్యాడు. సాయంత్రం అయినా భర్త, కుమారుడు ఇంటికి రాకపోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు కోసం గాలింపు చర్యలు చేపట్టి శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం చిన్నారి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. బాలుడి మృతితో ప్రియాంక, ఆమె కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదం నింపింది. యువరాజ్ కిరాతక చర్యపై పట్టణవాసులు తీవ్రంగా నిరసించారు. కఠినంగా శిక్షించాలని కోరారు.



# భూవివాదాలు లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి..

టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి గారు మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలుండగా తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల నుంచి 70 గ్రామాల చొప్పున మొత్తం 2240 గ్రామాలను ఎంపిక చేసి రీసర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని.. అది అతని జీవనాధారమని ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణను భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఈ రీ-సర్వే కార్యక్రమం చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో 1936 నాటి నిజాం కాలం సర్వే రికార్డులే ప్రధాన ఆధారంగా ఉన్నాయని, కాలక్రమేణా భూముల విభజనలు, ఉపసంఖ్యలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దులు మారడం వల్ల అనేక ప్రాంతాల్లో భూముల అసలు హద్దులపై స్పష్టత లేకుండా పోయిందన్నారు. ఈ పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం సమగ్ర రీ-సర్వే చేపడుతోందని తెలిపారు. భూ వివాదాల పరిష్కారంలో భాగంగా రాష్ట్రంలో నిజాం కాలం నుంచి నక్షాలు లేని 378 గ్రామాలను గుర్తించామని, వాటిలో ఇప్పటికే 5 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి భూదార్ నంబర్లు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన 373 గ్రామాల్లో కూడా రోవర్స్ వంటి ఆధునిక సాంకేతికతతో సర్వే పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు పూర్తిగా స్వస్తి చెబుతున్నామని మంత్రి తెలిపారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ శాస్త్రీయ పద్ధతిలో భూముల సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 411 రోవర్స్ కొనుగోలు చేయగా, త్వరలో మరో 400 రోవర్స్ కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. భూముల రీ-సర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూకమతానికి ఖచ్చితమైన హద్దులను నిర్ణయించి, ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపుగా భూదార్ కార్డులు జారీ చేస్తామని చెప్పారు. డీజీపీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేసి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా, ప్రస్తుతం అవి 2 కోట్ల 29 లక్షలకు పెరిగాయని రాష్ట్రంలోని అన్ని సర్వే నంబర్లకు దశలవారీగా భూదార్ నంబర్లు కేటాయించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించిందన్నారు. రీ-సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన మానవ వనరులను ప్రభుత్వం సమకూర్చిందని, 5,520 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి లైసెన్సులు జారీ చేశామని, భూవిస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6 మంది సర్వేయర్లను నియమించామని చెప్పారు. రాష్ట్రంలోని రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భూముల రీ-సర్వే పూర్తయిన తర్వాత ప్రతి కమతానికి ఖచ్చితమైన సరిహద్దులు, ప్రత్యేక పటాలు సిద్ధమవుతాయని, తద్వారా భూ యాజమాన్యంపై ఎలాంటి వివాదాలకు తావు ఉండదన్నారు. భూ భారతి చట్టం ద్వారా సాగు భూముల రిజిస్ట్రేషన్లకు సర్వే పటం తప్పనిసరి చేసిన నేపథ్యంలో రీ-సర్వే ద్వారా భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా మారనున్నాయని తెలిపారు.

# అక్రమంగా వేధిస్తున్న ఆలయ అధికారులు

వేములవాడ,జూన్19(సాక్ష్యం): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అధికారులపై కొండ్లెపు ముత్యం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బిగితే కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. మోచి కులం రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్న తను వేములవాడ భీమేశ్వర స్వామి ఆలయం ఎదురుగా కొబ్బరికాయలు, స్వామి వారి ఫొటోలతో కూడిన దుకాణం నడుపుతూ జీవనోపాధి పొందుతున్నానని తెలిపారు. పురపాలక సంఘం రహదారిపై దుకాణం పెట్టావని, దీనిని వెంటనే తీసివేయాలని మానసికంగా వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. 20 రోజులుగా తనను వేధిస్తుండగా తన దుకాణంలోకి ఏఈఓలు శ్రవణ్ కుమార్, జయ కుమారి, పర్యవేక్షకులు నూగూరి నరేందర్, గడ్డం రాజేందర్, ఏఈ రామ్ కిషన్ రావు, భగవంత రావు, భరత్, గంగిశెట్టి సాయి, ఎస్పీఎఫ్ భద్రతా సిబ్బంది దుకాణంలోకి చొరబడి కులం పేరుతో దూషించి బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులు పేర్కొన్నారు. కులం పేరుతో దూషించి తనను బెదిరించిన వారిపై ఈవో రమాదేవితో పాటు ఆలయ ఉద్యోగులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు పేర్కొన్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

## ● ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ



**సికింద్రాబాద్, జూన్ 19 (సాక్ష్యం):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని తార్నాక డివిజన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరుద్ ఆధ్వర్యంలో లాలాపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ఆయన జన్మదినాన్ని ఆర్భాటాలకు దూరంగా, సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఆసుపత్రిలోని సాధారణ వార్డులతో పాటు ప్రసూతి వార్డులో చికిత్స పొందుతున్న రోగులను, వారి సహాయకులను పలకరించి పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. రాహుల్ గాంధీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, దేశ ప్రజల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న పోరాటం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ కమిటీ ప్రతినిధులు అనిల్ కుమార్ (కోటి), మాచర్ల అరవింద్, సంపత్, చైతన్య, మహమ్మద్ అజీమ్, యువజన కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాచారంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**ఉప్పల్, జూన్ 19 (సాక్ష్యం):** నాచారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్మిక విభాగం ఉపాధ్యక్షుడు వి.ఎస్. ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, యువత సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తున్న రాహుల్ గాంధీకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు, సామాన్య ప్రజల హక్కుల కోసం ఆయన చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్ గౌడ్, అశ్వత్థామ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ యాదవ్, సుధాకర్ రెడ్డి, సునీల్ రెడ్డి, నరసింగ్ రావు, షరీఫుద్దీన్, అజీమ్, నరేష్, యూసుఫ్, కృపాకర్, ఫిరోజ్, రేవంత్, సాయిబాబా, మహిళా నాయకులు ఉమా, సునీత, మమత, యాస్మీన్, యువజన కాంగ్రెస్ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఉద్యమకారులంతా తరలిరావాలి శంతన్ రామరాజు

# పూర్వ తెలంగాణ జెఏసి మానుకోట మండల కన్వీనర్





**మహబూబాబాద్ జిల్లా కరస్పాండెంట్ సాక్ష్యం (జూన్ 19)** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమావేశానికి ఉద్యమకారులంతా తరలి రావాలని పూర్వ జేఏసీ మానుకోట కన్వీనర్ శంతన్ రామరాజు పిలుపునిచ్చారు.శుక్రవారంనాడు స్థానిక అమరవీరుల స్థూపం వద్ద కోకన్వీనర్ కమ్మగాని కృష్ణమూర్తి అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈసందర్భంగా శంతన్ రామరాజు మాట్లాడుతూ ఎందరో విద్యార్థులు, మేధావులు బలిదానాల పునాధులై నిర్మితమైన ఈతెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు.ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమం కోసం కార్యాచరణ రూపొందిస్తోందని హర్షం వ్యక్తంచేశారు.అందులో భాగంగా ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులైన ఎమ్మెల్సీలు కోదండరాం, అద్దంకి దయాకర్ ఆదివారం మానుకోట ఆర్తి కల్యాణ మండపంలో జరిగే ఉద్యమకారుల సమావేశానికి రానున్నారని పేర్కొన్నారు.నాడు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులంతా తరలి రావాలని కోరారు.ఈకార్యక్రమం ద్వారా ఉద్యమకారుల సూచనలు సలహాలు తీసుకుంటారన్నారు. అదేవిధంగా ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రభుత్వ విధివిధానాల గురించి వివరిస్తామని ఉద్యమకారులంతా ఈ ఆదివారం 21వ తేదీన జరిగే సమావేశానికి తప్పకుండా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు కంబాలపల్లి సత్యనారాయణ,కరాటే ఖాజా,ముదారి బుచ్చయ్య,గౌస్ తదితరులు పాల్గొన్నారు.

### బాబానగర్‌లో అక్రమ స్క్రాప్

# దుకాణంపై చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, జూన్ 19 (సాక్ష్యం):** నాచారం డివిజన్ పరిధిలోని బాబానగర్ కాలనీలో అక్రమంగా నిర్వహిస్తున్న స్క్రాప్ దుకాణం కారణంగా తీవ్ర శబ్ద కాలుష్యం ఏర్పడి స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బస్తీవాసులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బాబానగర్ ప్రాంత ప్రజలను వెంటబెట్టుకుని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి సమస్యను వివరించారు. అక్రమంగా నడుస్తున్న స్క్రాప్ దుకాణంపై తక్షణ చర్యలు తీసుకుని స్థానిక ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరారు.ఈ సందర్భంగా కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించి, సంబంధిత దుకాణంపై విచారణ చేపట్టి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాబానగర్ బస్తీవాసులు, మనోజ్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను

# చేర్పించి ఆదర్శంగా నిలిచిన గ్రామ ప్రముఖులు





**మహబూబాబాద్ జిల్లా కరస్పాండెంట్ (జూన్ 19)** మహబూబాబాద్ మండలంలోని జంగిలిగొండ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో పాఠశాల మూతపడే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచ్ గుండెల రేణుక ఇచ్చిన పిలుపుతో గ్రామ ప్రముఖులు స్పందించి ప్రభుత్వ పాఠశాలను కాపాడేందుకు ముందుకు వచ్చారు.గ్రామ ఉపసర్పంచ్ కోయల అనిల్ తన కుమార్తెను, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మట్టికాసం వీరేష్ తన కుమార్తెను, ఐకేపీ వీవో- సీఏ గోల్కొండ స్రవంతి తన కుమారుడిని, ప్రైవేట్ ఉద్యోగులు వేముల మధు, వేముల మురళి, జర్నలిస్టు పోతుగంటి విజయ్ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో పాఠశాల మూతపడే ప్రమాదం నెలకొనడంతో గ్రామ సర్పంచ్ గుండెల రేణుక, ఉపసర్పంచ్ కోయల అనిల్, వార్డు సభ్యులు బోయిని వెంకటేశ్వర్లు,కొయ్యల కోమిరెల్లి, ఇరుగు రమేష్, రత్నపురం సునీతలు కలిసి బడిబాట కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను వివరించి,తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుండెల రేణుక మాట్లాడుతూ, గ్రామ ప్రభుత్వ పాఠశాల మనందరి ఆస్తి అని, దానిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చదివించే కుటుంబాలకు ఇంటి నల్లా పన్నులు, ఇతర స్థానిక పన్నులను తన సొంత ఖర్చులతో చెల్లిస్తానని ప్రకటించారు. అలాగే ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాల అమలులో ఆ కుటుంబాలకు ప్రాధాన్యత కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రముఖులు స్వయంగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, మరిన్ని కుటుంబాలు కూడా ప్రభుత్వ పాఠశాల వైపు అడుగులు వేస్తున్నాయి. దీంతో జంగిలిగొండ ప్రభుత్వ పాఠశాల పరిరక్షణకు గ్రామస్థుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

### భూధార్ సర్వే భూభారతి

# దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి

## ● సాదా బైనామా, రీ-సర్వే ప్రక్రియలను గడువులోగా పూర్తి చేయాలి



**మహబూబాబాద్ జిల్లా కరస్పాండెంట్ సాక్ష్యం (జూన్ 19):** భూధార్ సర్వే,భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని, సాదాబైనామా,రీ-సర్వే ప్రక్రియలను గడువులోగా పూర్తి చేయాలని,రెవెన్యూ సేవలను ప్రజలకు పారదర్శకంగా అందించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డిఎస్ లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం,హైదరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డిఎస్ లోకేష్ కుమార్ పలు జిల్లాల కలెక్టర్లతో భూధార్ సర్వే, భూభారతి, సాదాబైనామా, నాన్-కడాస్ట్రల్ గ్రామాల రీ-సర్వే, నక్షా కార్యక్రమం, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న భూధార్ సర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని,ప్రతి భూ యజమానికి ఖచ్చితమైన భూ వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అలాగే భూభారతి కార్యక్రమం కింద వచ్చిన దరఖాస్తులను ఎటువంటి జాప్యం లేకుండా పరిశీలించి,త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజలకు రెవెన్యూ సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సాదాబైనామా దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసి, అర్హులైన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని,భూములకు సంబంధించిన పెండింగ్ అంశాలను ప్రాధాన్యతగా తీసుకొని పూర్తి చేయాలని పేర్కొన్నారు.జిల్లాల్లో కొనసాగుతున్న నాన్-కడాస్ట్రల్ గ్రామాల రీ-సర్వే కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని,ఎంపిక చేసిన గ్రామాల్లో నక్షా డిజిటల్ భూ మ్యాపింగ్ పనులను నాణ్యత ప్రమాణాలతో అమలు చేయాలని ఆదేశించారు.భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ భూ రికార్డుల ఆధునీకరణకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్,సంబంధిత రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### వర్షాకాల సన్నద్ధతపై సమన్వయ

# సమావేశంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, జూన్ 19 (సాక్ష్యం):** వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. నాచారం సర్కిల్ పరిధిలోని మల్లాపూర్ వార్డు కార్యాలయంలో వర్షాకాల సన్నద్ధతపై అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ, నాలాల శుభ్రత, రహదారుల మరమ్మతులు, నీటి నిల్వలు, విద్యుత్ సరఫరా, తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వర్షాల కారణంగా తలెత్తే సమస్యలను వెంటనే పరిష్కరించేలా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ నిత్యానంద్, కార్యనిర్వాహక ఇంజనీర్ రమేశ్ బాబు, జలమండలి ఉప ప్రధాన నిర్వాహక అధికారి వేణుగోపాల్, హైడ్రా అధికారులు, వివిధ శాఖల అధికారులు, బీఆర్ఎస్, కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వర్షాకాల సన్నద్ధతకు సంబంధించిన పలు అంశాలపై అధికారులు సమీక్ష నిర్వహించారు.

### రాహుల్ గాంధీ జన్మదినం

# సందర్భంగా విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



**సికింద్రాబాద్, జూన్ 19 (సాక్ష్యం) :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు, రబ్బర్లు, బిస్కెట్లు పంపిణీ చేయడంతో పాటు కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పిల్లల్లో ఆనందాన్ని నింపడంతో పాటు విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమైన నాయకులు వారికి శుభాకాంక్షలు తెలియజేసి, విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రాంతీయ రవాణా సంస్థ సభ్యుడు సురేష్ లాల్ నేతికర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కిట్టు తార్నాకతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా రాహుల్ గాంధీ జన్మదినాన్ని నిర్వహించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.


## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించాలి

**హైదరాబాద్, జూన్ 19, (సాక్ష్యం న్యూస్):** ముషీరాబాద్ ఏక్ మినార్ మసీదు నుండి కృష్ణానగర్ కు వెళ్తున్న దారిలో 1-5-241/ఎ అడ్రస్ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడనుండి తొలగించి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి తరలించాలని స్థానికుడు షబ్బీర్ ఖాన్ హసన్ కోరారు. ఈ మేరకు ఆయన ముషీరాబాద్ లో విలేకరులతో మాట్లాడుతూ... పైన తెలిపిన అడ్రస్ పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వల్ల తమకు ఇబ్బందిగా ఉందని, మాటిమాటికి ఆ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుండి మంటలు వస్తున్నాయని తెలిపారు. ఆ అడ్రస్ లో శంకర్ అనే వ్యక్తికి కొంత భాగాన్ని 2021 నుండి అద్దెకు ఇవ్వడం జరిగిందన్నారు. అతను జిలేబి షాపును నడుపుతున్నాడన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుండి తరచు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ రావడం అక్కడ పనిచేసే కార్మికులకు, వచ్చి పోయే వారికి ఇబ్బందిగా మారిందన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు సైతం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుండి వచ్చే మంటల వల్ల భయభ్రాంతులకు గురవుతున్నారని పేర్కొన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వారు పట్టించుకోలేదన్నారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి తరలించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి కూడా తీసుకెళ్లడం జరిగిందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడ నుండి తరలించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ కూడా సంబంధిత అధికారులకు లేఖ రాశారని తెలిపారు. నివాసాలను అనుకోని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించాలని షబ్బీర్ ఖాన్ హసన్ అధికారులను కోరారు.

### లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్, నివి చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో

## ఉచిత జ్యూట్ బ్యాగ్ తయారీ శిక్షణ శిబిరం

**హైదరాబాద్, జూన్ 19, (సాక్ష్యం న్యూస్):** లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్, ని వి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా గాంధీనగర్ డివిజన్ చిక్కడపల్లిలోని మహిళా భవన్ లో



ఉచిత జూట్ బ్యాగ్ తయారీ శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ తో కలిసి తమ ని వి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా మహిళలకు స్వయం ఉపాధి రూపకల్పనకు తోడ్పాటును కల్పిస్తూ వారికి ఉచితంగా టైలరింగ్, మగ్గం, బ్యూటిషియన్ కోర్సుల్లో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి, శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికేట్ లను అందచేసారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ... ఉచిత శిక్షణ శిబిరాల ద్వారా అనేక మంది మహిళలు స్వయం ఉపాధి ఏర్పరచుకొని వారి కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించుకుంటున్నారని తెలిపారు. అందుకు మహిళా సాధికారతతో సేవలందించేందుకు ఎల్లపుడూ ముందు ఉండే లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. నేటి నుండి ప్రారంభమయ్యే ఉచిత జూట్ బ్యాగ్ తయారీ శిక్షణ శిబిరాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు చంద్రమోహన్, ఐపిపి సెరిపల్లి గణేష్, ప్రవీణ్, విజయెంధర్, కాసం శ్రీనివాస్, నాగరాజు, హేమంత్, పవన్, జుట్ బ్యాగ్ ప్రాజెక్టు చైర్మన్ పవిత్ర, బిజెపి నేతలు, దామోదర్, పరిమల్, ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ కాబోయే ప్రధాని తిప్పర్తి శ్రీధర్

**మహబూబాబాద్ జిల్లా కరస్పాండెంట్ సాక్ష్యం (జూన్ 19):** ఈరోజు లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు,కాంగ్రెస్ పార్టీ అగ్రనేత శ్రీ రాహుల్ గాంధీ గారి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి శేసం కిరణ్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలోని ఆశ భవన్ చిల్డ్రన్ హోమ్ లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షులు కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం పిల్లలకు స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా తిప్పర్తి శ్రీధర్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ,సామాజిక న్యాయం,యువత మరియు రైతుల సంక్షేమం కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్న నాయకుడని కొనియాడారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశంలో ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కేంద్రంలో మోదీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ గొప్ప పోరాట యోధుడిగా గుర్తింపు తెచ్చుకుని దేశమంతా జోడో యాత్ర తో ప్రజలను ఐక్యం చేశారని 2029 లో దేశానికి ప్రధాని అవుతారని ఆశాభావాన్ని వ్యక్తంచేశారు.రాష్ట్రంలో ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం నాయకులు శేషం కిరణ్,బల్లెం చంటి,జాన్ విక్టర్,మహేందర్,పడిదల అజిత్,బిర్రు రమేష్,చుక్క క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కార వేదికగా టీడీపీ కార్యాలయం

- ప్రజాదర్బార్‌లో ఎరిక్షన్ బాబు చొరవతో సత్వర స్పందన
- అర్జీలను స్వయంగా పరిశీలించి అక్కడికక్కడే పరిష్కరించిన కాబోయే ఎమ్మెల్యే
- అధికారులకు ఆదేశాలు జారీ,ప్రజల్లో హర్షాతిరేకాలు



**మార్కాపురం జిల్లా బ్యూరో : సాక్ష్యం**

ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా తెలుగుదేశం పార్టీ పనిచేస్తోందని యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి, కాబోయే శాసనసభ్యుడు గూడూరి ఎరిక్షన్ బాబు మరోసారి నిరూపించారు. శుక్రవారం యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా యర్రగొండపాలెం మండలంలోని వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎరిక్షన్ బాబు గారికి సమర్పించారు. ప్రతి అర్జీని స్వయంగా పరిశీలించిన ఆయన తక్షణమే సంబంధిత శాఖల అధికారులకు ఫోన్ ద్వారా సంప్రదించి పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించి ప్రజల మన్ననలు పొందారు. మిగిలిన వినతులపై కూడా వెంటనే తగు చర్యలు తీసుకుని అర్జీదారులకు సత్వరమే న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి వినతి పత్రాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని సంబంధిత శాఖల అధికారులకు ఆయన సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎరిక్షన్ బాబు చొరవ, సత్వర స్పందన పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రజాదర్బార్ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు చౌదరి,మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళ్ రెడ్డి,మాజీ మండలాధ్యక్షులు యం సి హెచ్ మంత్రునాయక్,కొత్తమాసు సుబ్రహ్మణ్యం,తోట మహేష్ నాయుడు,మాజీ ఎస్ఎల్సిపి మెంబర్ చెవుల అంజయ్య, మాజీ సర్పంచ్ కంచర్ల సత్యనారాయణ గౌడ్, సీనియర్ నాయకులు మూడమంచు బాలయ్య యాదవ్,కంచర్ల పెద్ద చెన్నయ్య గౌడ్, తెదేపా మాజీ పట్టణ అధ్యక్షులు మూడమంచు గురవయ్య యాదవ్,డీలర్ల సంఘం నాయకులు షేక్ మస్తాన్ వలి మ్యాక్స్,పెరుమాళ్ళ కిషోర్ బాబు,దోంతా వెంకట్రావ్ గౌడ్,ఎన్డీయే కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకునే నాయకుడిగా గూడూరి ఎరిక్షన్ బాబు ప్రజల్లో రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని టీడీపీ శ్రేణులు పేర్కొన్నాయి.

## జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్







**సూర్యాపేట జిల్లా కరస్పాండెంట్ సాక్ష్యం (జూన్ 19)** జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు టెక్స్ట్ బుక్స్,కంప్యూటర్ ల్యాబ్‌ను సందర్శించి,విద్యార్థులకు అందుతున్న డిజిటల్ విద్యపై ఉపాధ్యాయులను వివరాలు అడిగారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును తెలుసుకోవడానికి కిచెన్ షెడ్‌ను,పాఠశాలలోని టాయిలెట్లను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని,పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పదవ తరగతి గదిలోకి వెళ్ళిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అక్కడ కాసేపు ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థిని, విద్యార్థులతో ముచ్చటించారు. వారి చదువుల తీరును,భవిష్యత్తు లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల భాషా నైపుణ్యాలను పరీక్షించడానికి స్వయంగా వారి చేత తెలుగు టెక్స్ట్ బుక్ చదివించారు. స్పష్టమైన ఉచ్చారణతో చదివిన విద్యార్థులను ఆయన అభినందించారు. పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని,పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ప్రధానోపాధ్యాయురాలు పద్మ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.







## ఘనంగా జమాండ్లపల్లిలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**మహబూబాబాద్ జిల్లా కరస్పాండెంట్ సాక్ష్యం (జూన్ 19):** మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామంలో 2వ వార్డు పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (గ్రా.నూ)లో విద్యార్థిని విద్యార్థుల సమక్షంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అజ్మీర సురేష్ నాయక్ ఆధ్వర్యంలో, దేశ ప్రజల ఆశాజ్యోతి,లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు,కాంగ్రెస్ పార్టీ అగ్రనేత,భావి భారత ప్రధానమంత్రి శ్రీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా



మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళీ నాయక్ ,మహబూబాబాద్ డీసీసీ అధ్యక్షురాలు డాక్టర్ భూక్య ఉమ మురళీ నాయక్,మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోతు జ్యోతి రమేష్ ,రెండవ వార్డు కౌన్సిలర్ అంబాల శివకుమార్,ఏడవ వార్డు కౌన్సిలర్ నీరుటి హైమ లక్ష్మి నారాయణ,24వ వార్డు కౌన్సిలర్ సల్వాది దిలీప్,29 వ



వార్డు కౌన్సిలర్ బొల్లు రాజు,హాజరై విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పాఠశాలలోని 8వ, 9వ, 10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, కంపాక్స్ బాక్స్‌లు, చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడటమే కాకుండా వారి భవిష్యత్తుకు ప్రోత్సాహం అందించడం కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళీ నాయక్,డిసిసి అధ్యక్షురాలు డాక్టర్ భూక్య ఉమ మురళీ నాయక్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ,రాజ్యాంగ విలువల కాపాడటం,సామాజిక న్యాయం,యువతకు ఉపాధి అవకాశాలు,రైతులకు గిట్టుబాటు ధరలు,మహిళల సాధికారత,పేద మరియు మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడు రాహుల్ గాంధీ గారని దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన కుటుంబం వారిదని పేర్కొన్నారు. భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ యాత్రల ద్వారా దేశ ఐక్యత,సౌభ్రాతృత్వం,ప్రేమ,సామరస్య సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కోట్లాది భారతీయుల మనసులను గెలుచుకున్న ప్రజానాయకుడు రాహుల్ గాంధీ ని కొనియాడారు. యువత,విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆలోచించే నాయకత్వం దేశానికి అవసరమని,విద్య మరియు ఉపాధి అవకాశాల కల్పనలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. దేశ ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న రాహుల్ గాంధీ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో,సంక్షేమ హాస్టల్ లలో చదివే విద్యార్థిని విద్యార్థులకు మంచి యూనిఫామ్,షూస్, పుస్తకాలు,నోట్స్ లు,బ్రేక్ ఫాస్ట్,మధ్యాహ్న భోజనం,స్కూల్ బస్సు సౌకర్యాలు కల్పిస్తుందని ప్రతి నియోజకవర్గంలో రెండు వందల కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్ లు ఏర్పాటు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా యస్టీ సెల్ అధ్యక్షులు బానోత్ ప్రసాద్ నాయక్,పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాడిపల్లి చరణ్,జమాండ్లపల్లి గ్రామ నాయకులు రెండవ వార్డు అధ్యక్షులు చిట్టోజు పాపా చారి, మూడవ వ వార్డు అధ్యక్షులు గాడిపల్లి రవి,కాలసాని నర్సింహా రెడ్డి,కాలసాని రాంమోహన్ రెడ్డి,చిట్టోజు రవీంద్రా చారి,కొన్ రెడ్డి మహేందర్ రెడ్డి, దేవిడి మధుసూదన్ రెడ్డి,కొంతం లింగా రెడ్డి,వేముల రమేష్,యూత్ నాయకులు గందు కార్తీక్ గౌడ్,పిట్టల నవీన్,అంబాల ప్రవీణ్,కర్పూరపు సురేష్,గందసిరి నరేష్, ఎగిత సతీష్,బయ్య సాయి,కాంగ్రెస్ పార్టీ నాయకులు గొడుగు వెంకన్న,పిట్టల వెంకన్న,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,ఉపాధ్యాయులు విద్యార్థులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## ప్రైవేట్ స్కూళ్ల బస్సుల్లో ప్రయాణం భద్రమేనా?

- ఫిట్నెస్ లేని ప్రైవేట్ పాఠశాల బస్సులు
- ఫీజుల వసూల్ పై చూపే శ్రద్ధ బస్సులపై లేకపోవడం
- ఉన్నవాటితోనే సర్ది పెడుతున్న వైనం

**ఆర్మూర్ సాక్ష్యం న్యూస్ జూన్19:** విద్యా సంవత్సరం ప్రారంభమైంది. కానీ విద్యార్థులను చేరవేసే ప్రైవేట్ పాఠశాల బస్సులలో విద్యార్థుల ప్రయాణం భద్రమేనా అన్న ప్రశ్న తలెత్తుతుంది. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు ఫీజుల వసూలు పై చూపుతున్న శ్రద్ధను విద్యార్థులను చేరవేసే బస్సులపై చూపకపోవడం బాధాకరంగా మారింది. ఉన్న బస్సులకే తాత్కాలిక మరమ్మత్తులు చేసి చేతులు దులుపుకుంటున్న ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలను పోటీ పడి మరి అడ్మిషన్ చేస్తున్న పాఠశాల యాజమాన్యాలను విద్యార్థులు ప్రశ్నించకపోవడం విద్యార్థుల తల్లిదండ్రుల అమాయకత్వానికి నిదర్శనంగా మారింది. కేవలం విద్యార్థుల తల్లిదండ్రులు ఏ పాఠశాల ఎంత అంగుహార్భాటాలతో ఉందో అది మాత్రమే పరిగణలోకి తీసుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు తమ విద్యార్థులను ఇంటి నుండి పాఠశాలకు, పాఠశాల నుండి తమ గమ్యస్థానాలకు చేరవేసే బస్సులపై శ్రద్ధ చూపకపోవడం వాటి ఫిట్నెస్ లపై ఆరా తీయకపోవడంతో చాపకింద నీరులా యాజమాన్యాలు తమ పని తాము చేసుకుంటూ పోతున్నారు. అధికారులు సైతం విద్యా సంవత్సరం ఆరంభంలో మాత్రమే తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి తర్వాత వాటి జోలికి పోకపోవడంతో యాజమాన్యాలు తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఆరంభంలోనే కాకుండా నిత్యం విద్యార్థులను చేరవేసే పాఠశాల బస్సుల పై దృష్టి సారిస్తే యాజమాన్యాలు భయంతో వాటి మరమ్మత్తులు ఎప్పటికప్పుడు చేయించి ఖండించకండి ఉంచుతారు. అలా కాకుండా ఏదో ప్రమాదం జరిగినప్పుడే హడావిడి చేసే అధికారులు కాలం చెల్లిన వాహనాలను ఎలాంటి ఒత్తిళ్లకు తలగకుండా ఫీజ్ చేస్తే విద్యార్థుల భవిష్యత్తు బాగుంటుంది. తక్కువ రేటుకు లభించే వాహనాలను యాజమాన్యాలు ఇతర రాష్ట్రాల నుండి కొనుగోలు చేసి, ఆకర్షణీయమైన రంగులు వేసి తాత్కాలిక మరమ్మత్తులు చేసి విద్యార్థులను చేరవేసేందుకు ఉపయోగిస్తున్నారు. తమ పాఠశాలలో ఇన్ని బస్సులు ఉన్నాయి అని చెప్పుకుంటున్న యాజమాన్యాలు అందులో ఎన్ని వాహనాలు కండిషన్ లో పనిచేస్తున్నాయో చెప్పలేకపోతున్నారు. ఇదిలా ఉంటే ఆటోవాలా కూడా పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకొని నడపడానికి వీలు లేకుండా చుట్టూ విద్యార్థుల బ్యాగులను వేలాడదీస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఎంతో భవిష్యత్తు ఉండే చిన్నారి విద్యార్థుల భవిష్యత్తు కు చిన్న పొరపాటే ప్రధాన కారణం అవుతుంది. కావున విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేముందు పాఠశాల కు చెందిన వాహనాలను కూడా పరిశీలించి తమ పిల్లలను పాఠశాలలలో చేర్పిస్తే బాగుంటుంది.

## యునాని, ఆయుర్వేద మందులతో అన్ని రకాల వ్యాధులకు నివారణ

- చౌదరి డిస్పెన్సరీ నిర్వాహకులు డాక్టర్ హకీమ్ ఇస్మాయిల్ ఖాన్ చౌదరి



**హైదరాబాద్, జూన్ 19, ( సాక్ష్యం న్యూస్ ) :** యునాని, ఆయుర్వేద మందులతో అన్ని రకాల వ్యాధులకు నివారణ జరుగుతుందని చౌదరి డిస్పెన్సరీ నిర్వాహకులు డాక్టర్ హకీమ్ ఇస్మాయిల్ ఖాన్ చౌదరి అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ నియోజకవర్గం అడిక్‌మెట్ డివిజన్ విద్యానగర్ ఏ ఆర్ కె పిజి కాలేజీ ఎదురుగా నూతనంగా చౌదరి డిస్పెన్సరీ యునాని, ఆయుర్వేద క్లినిక్ ను ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ మైనారిటీ విభాగం రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు ఎం.ఏ. వాహిద్ అలీ హాజరయ్యారు. ఈ ఆయన చౌదరి డిస్పెన్సరీ నిర్వాహకులు డాక్టర్ హకీమ్ ఇస్మాయిల్ ఖాన్ చౌదరి తో కలిసి క్లినిక్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చౌదరి డిస్పెన్సరీ నిర్వాహకులు డాక్టర్ హకీమ్ ఇస్మాయిల్ ఖాన్ చౌదరి మాట్లాడుతూ... హైదరాబాద్ ఫీల్ ఖానా లో పుట్టిన తాను 1973 నుండి తాను 53 ఏళ్లుగా యునాని, ఆయుర్వేదంలో వైద్యం చేస్తున్నానని తెలిపారు. మహారాష్ట్రలో కోలాపూర్‌లో, హైదరాబాద్ ఫీల్ ఖానా లో క్లినిక్ ను పెట్టి 35 ఏళ్ల పాటు యునాని, ఆయుర్వేద వైద్యాన్ని అందచేశానన్నారు. యునాని, ఆయుర్వేద వైద్యంలో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఏమి లేవన్నారు. వెయిట్ లాస్ ను తగ్గించేందుకు, కిడ్నీలో రాళ్లను తొలగించేందుకు, సెక్స్ త్వరగా స్కలనం కాకుండా వైద్యం చేసి మందులను ఇస్తామన్నారు. ఈ రోజుల్లో రకరకాల కారణాల వల్ల దాంపత్య జీవితంలో సెక్స్ సరిగ్గా చేయలేపోతున్నారని, అటువంటి వారికి వైద్యం, మందులను ఇస్తామన్నారు. కొంత ఆలస్యమైన కానీ.. తప్పకుండా అన్ని ఆరోగ్య సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. పిల్లలు పుట్టకపోతే కూడా మా వద్ద వైద్యం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జాకీర్, షేక్ సమీర్, సయ్యద్ సలీం, ఇర్ఫాన్ బెగ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మహ్మద్ ఖదీర్, ఖలీల్, అహ్మద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- ఎంపీడీవో అద్వైత



**ఖానాపురం జూన్ 19(సాక్ష్యం న్యూస్ ):** ఈనెల 28 పల్స్ పోలియో,జూలై 13 న నేషనల్ డి వార్మింగ్ డే కార్యక్రమాలను సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలనిఎంపీడీవో అద్వైత అన్నారు. ఖానాపురం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో పల్స్ పోలియో ప్రోగ్రాం , నేషనల్ డి వార్మింగ్ డే కార్యక్రమాలపై సమావేశం జరిగింది. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో అద్వైత మాట్లాడుతూ పల్స్ పోలియో మరియు నేషనల్ డి వార్మింగ్ డే కార్యక్రమాలను వైద్య శాఖ అధికారులు సిబ్బంది, ఐసిడిఎస్ అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని కోరారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ పల్స్ పోలియో ప్రోగ్రాం ఈనెల 28 ఆదివారం 0-5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయాలన్నారు. మండలంలో 25 నిర్దేశిత కేంద్రాలలో పల్స్ పోలియో చుక్కల కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మొదటిరోజు బూత్ లలో రెండవ రోజు,మూడవ రోజు ఇంటింటికి తిరిగి మార్కింగ్ చేస్తారని ,వేయించుకొని పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఐదు సంవత్సరాలు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. జూలై 13 న నేషనల్ డి వార్మింగ్ డే ప్రోగ్రాం జరుగుతుందని ఖానాపురం మండలంలోని1 సంవత్సరం నుండి19 సంవత్సరాల బాలబాలికలకు అంగన్ వాడి సెంటర్స్ , ప్రైమరీ స్కూల్స్ ,హైస్కూల్స్, కళాశాలలో విద్యార్థుల కు నట్టల నివారణ మాత్రలుఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలకు ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు,అంగన్ వాడీ టీచర్స్ అందరి సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమాదేవి,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సయ్యద్ జమీరుద్దీన్ , హెల్త్ సూపర్ వైజర్ దామోదర్ రెడ్డి, దేవిక ఫార్మసీ ఆఫీసర్ శ్రీనివాసచారి, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్ ,వైద్య సిబ్బంది కనక లక్ష్మి , పరోశిని విజయ రాణి, విజయ సునీత, సుజాత, రజిత, జ్యోతి, ప్రతిభ భార్గవి, రమ్య ,గొడిశాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్యం పై తల్లిదండ్రులే శ్రద్ధ వహించాలి

- జిల్లా సంక్షేమ అధికారి మల్లేశ్వరి



**భూపాలపల్లి జూన్ 19 (సాక్ష్యం):** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సుభాష్ కాలనీలో శుక్రవారం ఐసీడీఎస్ సూపర్వైజర్ రజిత ఆధ్వర్యంలో “అమ్మ మాట అంగన్వాడి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి, స్థానిక కౌన్సిలర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీడబ్ల్యూఓ మల్లీశ్వరి మాట్లాడుతూ ప్రతి తల్లి అమ్మ మాట అంగన్వాడి బడిబాట కార్యక్రమం ద్వారా సూచనలను పాటించి పిల్లల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు వసంత,సుజాత స్వరూప రామ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రాయపర్తిలో రాహుల్ గాంధీ బర్త్‌డే సంబరాలు

### ● కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా కేక్ కటింగ్




**రాయపర్తి, జూన్ 18(సాక్ష్యం):** కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బర్త్ డే సంబరాలు రాయపర్తి లో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా జరిపారు. పాలకుర్తి ఎమ్మెల్యే శ్రీమతి యశస్విని ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు రాయపర్తి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్య పరిరక్షణకు, రాజ్యాంగ విలువలకు రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటం స్ఫూర్తి దాయకమని వారు కొనియాడారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా దేశ ప్రజలను ఏకం చేశారని, నిరుద్యోగం, ధరల పెరుగుదలపై కేంద్రాన్ని నిలదీస్తున్నారని నాయకులు అన్నారు. మోడీ పాలన అంతా కార్పొరేట్లకు మేలు చేసేలా ఉందని, ప్రజలు రాహుల్ గాంధీ గారి పాలనను కోరుకుంటున్నారానీ తెలిపారు. ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో , స్థానిక సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి, ఉపసర్పంచ్ మచ్చ రమేష్, మండల యూత్ అధ్యక్షుడు కళ్యాణ్ గౌడ్, మండల మైనారిటీ సేల్ అధ్యక్షుడు ఎండీ అఫ్రోజ్, మండల నాయకులు మందాటి సుదర్శన్ రేడ్డి, మైనార్టీ నాయకులు ఎండి నహీం, కాంచనపల్లి వనజ రాణి, ఎండీ రఫి, గట్టికల్ గ్రామ పార్టీ అధ్యక్షుడు నాంచార్ల లక్ష్మణ చారి, ఎండీ రియాజ్, నరసింహులా రాంమూర్తి, గారే ఉప్పల్ స్వామి, ఉబ్బని బాబు, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నూతన మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

### ● మెరుగైన పౌర సేవలందించడమే తమ లక్ష్యం
### ● వర్ధన్నపేట నూతన కమిషనర్ జీ అశోక్



**వర్ధన్నపేట, జూన్ 18(సాక్ష్యం):** వర్ధన్నపేట మున్సిపాలిటీ పట్టణ ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడమే తమ తొలి ప్రాధాన్యత అని వర్ధన్నపేట నూతన మున్సిపల్ కమిషనర్ జీ అశోక్ అన్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ నూతన మున్సిపల్ కమిషనర్‌గా జి. అశోక్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కార్యాలయంలో నిరాడంబరంగా జరిగిన కార్యక్రమంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ జి. అశోక్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడమే తమ లక్ష్యం అన్నారు. పారిశుధ్య నిర్వహణను మరింత బలోపేతం చేయడం, తాగునీటి సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడడం, వీధి దీపాల నిర్వహణ, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని కమిషనర్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పరిపాలన అందించేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొని నూతన కమిషనర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియ జేశారు.

## ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లిలో చేపట్టిన జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజ్, పొన్నేకల్‌లోని యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**సాక్ష్యం జూన్ 19 ఖమ్మం**

ఖమ్మం రూరల్ మండల పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా, నియమిత గడువు లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శుక్రవారం పాలేరు నియోజకవర్గం పరిధిలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి లో 108 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాయ్స్, గర్ల్స్ హాస్టల్ భవనాలు, ప్రధాన భవనం, అకాడమిక్ బ్లాక్ నిర్మాణాల పనుల పురోగతిని పరిశీలించారు. కార్మికులను పెంచి అనుసంధానంగా పనులు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం



పొన్నేకల్ లో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ ప్రాంతాలను తిరుగుతూ, పనుల నాణ్యతను, భవనాల నమునా మ్యాప్ లను పర్యవేక్షించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల వద్ద లింక్, అంతర్గత రోడ్డు, ప్రణాళిక ప్రకారం 4 జూనియర్, 9 సీనియర్ హాస్టల్ బ్లాకులు, వెయిటింగ్ హాల్, అకాడమిక్ బ్లాక్ భవనాల నిర్మాణంకు కార్మికులకు అత్యధికంగా పెంచి, పనులను త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగం అభివృద్ధిని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతున్నదని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఉన్నత విద్య, మెరుగైన ఉపాధి కోర్సులను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని అన్నారు. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం పూర్తయితే స్థానిక యువతకు సాంకేతిక విద్య అందుబాటులోకి వచ్చి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని అన్నారు. అదే విధంగా యంగ్ ఇండియా స్కూల్ పూర్తి కావడంతో పరిసర ప్రాంతాల విద్యార్థులకు మంచి విద్య అవకాశాలు అందుతాయని



తెలిపారు. పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ ఉండకూడదని, ప్రతి దశలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఆలస్యం లేకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన వనరులు సమకూర్చుకుని, నిర్ణీత గడువులోపే పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారి బుగ్గయ్య, ఖమ్మం రూరల్ మండల తహసీల్దారు యం. వినయేందర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ

### ● పేదలకు పండ్లు పంపిణీ చేసిన ఆదం సంతోష్ కుమార్





**సికింద్రాబాద్, జూన్ 19 (సాక్ష్యం):** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. తార్నాక చౌరస్తాలో టీపీసీసీ కార్యదర్శి జీడీ అమర్నాథ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదం సంతోష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన కేక్ కట్ చేసి పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదం సంతోష్ కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, సామాజిక న్యాయం, యువతకు ఉపాధి అవకాశాలు, రైతుల సంక్షేమం కోసం రాహుల్ గాంధీ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దేశ ఐక్యత, లౌకికవాదం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఆయన చేపడుతున్న కార్యక్రమాలు యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు దేశవ్యాప్తంగా పాదయాత్రలు, ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమైన నాయకుడిగా రాహుల్ గాంధీ ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. దేశ భవిష్యత్తు కోసం ఆయన అందిస్తున్న నాయకత్వం కాంగ్రెస్ పార్టీకి నూతన ఉత్సాహాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ సంపూర్ణ ఆరోగ్యంతో దీర్ఘాయుష్షుతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శిల్పా చారి, శశాంక్, మహేష్, ప్రమోద్, నరేష్, వెంకటేష్, రాజు, డేవిడ్, శ్రవణ్, భాస్కర్, సైదులు తదితరులతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రాజెక్టు నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### ● దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్





**డిండి. సాక్షం న్యూస్:** ప్రాజెక్టు నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, శుక్రవారం ఇరిగేషన్ అధికారులతో కలిసి నీటిని విడుదల చేసిన దేవరకొండ ఎమ్మెల్యే లిశ్రీ నేనావత్ బాలు నాయక్ గారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వానాకాలం సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు సకాలంలో సాగునీరు అందించాలనే లక్ష్యంతో డిండి రిజర్వాయర్ నుండి ఆయకట్టుకు నీటిని విడుదల చేసుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ గారు మాట్లాడుతూ, రైతుల సంక్షేమం, మరియు వ్యవసాయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డిండి రిజర్వాయర్ నుంచి విడుదల చేసిన నీటితో డిండి మండల పరిధిలోని ఆయకట్టు ప్రాంతాల్లో సుమారు 20 వేల ఎకరాల్లో వరి సాగు జరగనున్నట్లు తెలిపారు. సాగునీరు అందుబాటులోకి రావడంతో రైతులు కరీఫ్ పంటల సాగుకు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇరిగేషన్ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి,నీటి పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. రైతులు నీటిని సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రైతుల అవసరాలకు అనుగుణంగా సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బాలు నాయక్ గారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

### "వన మహోత్సవం" కార్యక్రమంలో పాల్గొని

## మొక్కలు నాటిన దేవరకొండ ఎమ్మెల్యే లినేనావత్ బాలు నాయక్



**డిండి. సాక్షం న్యూస్ :** మండల పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన "వన మహోత్సవం" కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ గారు, యస్. ఐ. బాలకృష్ణ. నాయకుల తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ గారు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం కూడా అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.చెట్లు మనకు ప్రాణవాయువును అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.తెలంగాణ ప్రభుత్వం హరిత తెలంగాణ లక్ష్యంతో చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరిన ఎమ్మెల్యే, గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు మరియు ప్రజా ప్రదేశాల్లో మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలని సూచించారు.ఈ సందర్భంగా డిండి సర్కిల్ పోలీస్ అధికారులు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో పోలీస్ శాఖ కూడా తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తోందని, ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో మంచి అవగాహన కల్పిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిండి సర్కిల్ పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది, అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్



**డిండి. సాక్షం న్యూస్ :** కాంగ్రెస్ జాతీయ నాయకులు, పార్లమెంట్ సభ్యులు, రాహుల్ గాంధీ జన్మ దినం సందర్భంగా శుక్రవారం డిండి ఆర్ పి ఆర్ పి ఆశ్రమ పాఠశాల్లో మొక్కలు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు, నాటి విద్యార్థులు రేపటి పౌరులని కొనియాడారు. అనంతరం విద్యార్థినులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు శ్రీ రాహుల్ గాంధీ గారి జన్మదినాన్ని పురస్కరించుకొని డిండి మండల కేంద్రంలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ (బాలికల) స్కూల్ మరియు జూనియర్ కాలేజ్‌లో దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ గారు ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ



సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి, విద్యార్థినులకు బ్రెడ్ ప్యాకెట్లు మరియు అరటిపండ్లు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ గారు మాట్లాడుతూ, రాహుల్ గాంధీ గారు దేశ ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, యువత అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడని కొనియాడారు. అలాగే దేశ స్వాతంత్ర్య ఉద్యమం నుండి నేటి వరకు నెహ్రూ–గాంధీ కుటుంబం దేశ నిర్మాణంలో, ప్రజాస్వామ్య పరిరక్షణలో, పేద ప్రజల సంక్షేమంలో విశేష సేవలు అందించిందని తెలిపారు.ప్రజల హక్కుల కోసం, సామాన్యుల అభ్యున్నతి కోసం రాహుల్ గాంధీ గారు చేస్తున్న పోరాటం యువతకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ గారిని ప్రధానమంత్రిగా చేసుకోవడమే మనందరి లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

### యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో

## ఘనంగా రాహుల్ గాంధీ జయంతి

**డిండి. సాక్షం న్యూస్ :** దేవరకొండ శాసనసభ్యులు గౌరవ శ్రీ నేనావత్ బాలు నాయక్ గారి ఆదేశానుసారం,యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి గారి సూచన మేరకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జరుపుల లక్ష్మీ గారి ఆధ్వర్యంలో ప్రతాప్ నగర్ గ్రామంలోని ఎంపీపీయ స్ పాఠశాల లోశుక్రవారం జన్మదిన వేడుకలు నిర్వహించారు. ప్రియతమ నాయకులు బిదేశంలో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న నియంత ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తున్న పోరాట యోధుడు జననాయకుడు కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు లోక్ సభ ప్రతిపక్ష నేత యంగ్ డైనమిక్ లీడర్ రాహుల్ గాంధీ గారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. యువజన కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ



కార్యక్రమంలో డిండి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బద్దేల శ్రీనివాస్, గోనబోయినపల్లి గ్రామ సర్పంచ్ బాలనారాయణ, వార్డు సభ్యులు మాగాణి భాస్కర్, విభూది రాములు,కేతవత్ లాలి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బిచ్చలు,లాలు , నారయ్య, వేముల బాలకృష్ణ సోషల్ మీడియా కో – ఆర్డినేటర్ గణేష్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### రిపోర్టర్ ఎర్రం సతీష్‌ను పరామర్శించిన సిరికొండ మధుసూదనాచారి



**భూపాలపల్లి జూన్ 19 (సాక్ష్యం):** భూపాలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన నవతెలంగాణ జిల్లా సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ ఎర్రం సతీష్ కుమార్ తండ్రి ఎర్రం సమ్మయ్య ఇటీవల మరణించగా విషయం తెలుసుకున్న మాజీ స్పీకర్ శాసన మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి వారి స్వగృహానికి వెళ్లి సమ్మయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఎర్రం సతీష్ కుమార్ తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, సమ్మయ్య మరణం పట్ల తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

### రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో భాగంగా
## కేక్ కట్ చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించిన ఎమ్మెల్యే

**భూపాలపల్లి జూన్ 19 (సాక్ష్యం) :** జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ గారి జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కరుణాకర్ ఆధ్వర్యంలో ఘనంగా కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై కేక్ కట్ చేసి, రాహుల్ గాంధీ గారి దీర్ఘాయుష్షు, సంపూర్ణ ఆరోగ్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, "రాహుల్ గాంధీ దేశ ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడు. యువత, రైతులు, మహిళలు, కార్మికులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ఆయన రాజకీయాల లక్ష్యం. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు ఆయన చేస్తున్న కృషి దేశ ప్రజలకు ఆదర్శం" అని అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కరుణాకర్ మాట్లాడుతూ, "రాహుల్ గాంధీ జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా సేవా కార్యక్రమాల దినంగా నిర్వ హిస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుందని, రాహుల్ గాంధీ చూపిన మార్గంలో కార్యకర్తలంతా ప్రజా సేవలో ముందుండాలని" పిలుపు నిచ్చారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుతూ, రాహుల్ గాంధీ గారి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య మున్సిపల్ వైస్ చైర్మన్ అంబల శ్రీనివాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భువన సుందర్ వెంకీ తదితరులు పాల్గొన్నారు.



### విత్తన, ఎరువుల
## దుకాణాల్లో వ్యవసాయ, పోలీసుల తనిఖీలు

**సాక్ష్యం జూన్ 19 పాలేరు** రైతులను మోసం చేసే నకిలీ విత్తన మాఫియాపై చర్యలు తీసుకునేందుకు శుక్రవారం పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు ఉమ్మడిగా కూసుమంచి లోని పలు విత్తన, ఎరువులు దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు కూసుమంచి సిఐ సంజీవ్, వ్యవసాయ శాఖ ఏవో వాణి, ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్ షాపులను సందర్శించి, విక్రయాల రికార్డులు, స్టాక్ వివరాలు, లైసెన్సులు, బిల్లుల నిర్వహణ, నిల్వల పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులకు విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని తనిఖీ చేశారు. అలాగే ప్యాకెట్లపై ఉన్న వివరాలు, తయారీ తేదీలు, గడువు తేదీలు, కంపెనీ గుర్తింపు తదితర అంశాలను పరిశీలించారు. రైతులను మోసం చేసే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదన్నారు. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు లేదా నాసిరకం పురుగుమందులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత దుకాణాల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే కేసులు నమోదు చేసి, పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.



## కందుల దివ్యను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి

### - సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్న గాంధీజీ విద్యార్థిని కందుల దివ్య

**చండూరు: (సాక్ష్యం)జూన్ 19** మార్చి 2026 పదవ తరగతి ఫలితాల్లో 579 మార్కులు సాధించిన గాంధీజీ స్కూల్ విద్యార్థిని కందుల దివ్య ను తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రశంసా పత్రం అందించి, అభినందించారు. పేద కుటుంబంలో జన్మించిన కందుల దివ్య జి.యడవల్లి గ్రామం నుండి ప్రతిరోజు చండూరు రావడానికి ఇబ్బంది పడి, చండూరులోని షెడ్యూలు కులముల అభివృద్ధి శాఖ వారి బాలికల వసతి గృహంలో సీటును పొంది అక్కడే ఉంటూ గాంధీజీ పాఠశాలలో చదువుకుంది. ఈ సంవత్సరం మార్చి నెలలో జరిగిన పదవ తరగతి పరీక్షల్లో 579 మార్కులతో ఉత్తమ ఫలితాన్ని సాధించింది. బాలికల వసతి గృహంలో ఉంటూ నల్లగొండ జిల్లాలోనే అత్యధిక మార్కులు సాధించినందుకు గాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం నాడు లాల్ బహదూర్ స్టేడియం నందు ప్రశంసా పత్రం అందుకుందని గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్, చండూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, హాస్టల్ వార్డెన్ రమ్యశ్రీ తెలిపారు. కందుల దివ్య ను అతని తల్లిదండ్రులను తోటి స్నేహితులు, ఉపాధ్యాయులు అభినందించి, భవిష్యత్తులో దివ్య ఉన్నత స్థానంలో ఉండాలని ఆశించారు.



## నీట్ పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

### - వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్

**హనుమకొండ, జూన్ 19 (సాక్ష్యం)** ఆదివారం జరిగే నీట్ పరీక్ష సజావుగా నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషన్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలో ఈ నెల 21వ తారీకు ఆదివారం జరిగే నీట్ పరీక్ష సంబంధించి పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ ప్రకారం నిషేధాజ్ఞలు అమలు చేయబడతాయని. ఈ ఉత్తర ప్రకారం పరీక్ష జరిగే 500 మీటర్ల పరిధిలో ప్రజలు గుంపులుగా గుమి కూడటం, సభలు సమావేశాలు ర్యాలీలు ధర్నాలు నిషేధించబడ్డాయని, అలాగే పరీక్షా జరిగే పరిసరాలలో పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని. ఈ ఉత్తర్వులు ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందని. ఎవరైనా ఈ ఉత్తరం అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.




## గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

**పాలకుర్తి,జూన్ 19(సాక్ష్యం):** జనగామ జిల్లాపాలకుర్తి మండలం విస్నూర్ గ్రామంలో పిడుగు పడడంతో తాటి చెట్టు పై నుండి ఒక్కసారిగా జారిపడి గీత కార్మికుడు కన్నా బిక్షంకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం నిమ్స్ ఆసుపత్రికి తరలించగా అతని పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.



### తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం తనిఖీ చేసి,
## నూతనంగా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ పనుల పురోగతిని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**సాక్ష్యం జూన్ 19 పాలేరు** ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగికి సత్వర మెరుగైన సేవలు అందేలా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. పాలేరు నియోజకవర్గంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, లేబర్ రూమ్, ఎమర్జెన్సీ వార్డ్, ఓపి రూమ్, ల్యాబ్, కాన్పుల అపరేషన్ థియేటర్, ప్రసుతి వార్డు, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, రోగులకు అందుతున్న సేవలు, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు తదితర అంశాలను పరిశీలిస్తూ రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవల వివరాలను ఆరా తీశారు. ఔషధ నిల్వల గదిని పరిశీలించి అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోగులకు అత్యవసర మందుల నిల్వలు, చికిత్స విధానంలో ఏలాంటి ఆలస్యం లేకుండా వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సకాలంలో అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచి, రోగులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని అన్నారు. తిరుమలాయపాలెం ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు పెంచడానికి చర్యలు తీసుకోవాలని, ఆశా కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ గర్భిణీ మహిళలను ఎప్పటికప్పుడు ఫాలోఅప్ చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో ఉన్న వసతులను వినియోగించుకుంటూ ప్రసవాల సంఖ్య పెంచాలని ఆ దిశగా వైద్య అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం తిరుమలాయపాలెం మండలం కేంద్రంలో నూతనంగా 26 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణాలకు ఉపయోగించే కాంక్రీట్, సిమెంట్, ఐరన్ ల నాణ్యత ను పర్యవేక్షించారు. హాస్పిటల్ లో గుర్తించిన ప్రాధాన్యత పనులు త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని, జిల్లా యంత్రాంగం పనుల పూర్తిలో సహకారం అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం వైద్య రంగ అభివృద్ధిని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతున్నదని తెలిపారు. మండల, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని అన్నారు. పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ ఉండకూడదని, ప్రతి దశలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఆలస్యం లేకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన వనరులు సమకూర్చుకుని, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్ ఉన్న ఆస్పత్రి భవన నిర్మాణ పనులు, పూర్తి చేసి, కావలసిన వైద్య పరికరాలు, మౌళిక సదుపాయాలు ఏర్పాటుచుకొని ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ డా. కృప ఉషశ్రీ, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వరరావు, తిరుమలాయపాలెం మండల ఎంపిడివో సిలార్ సాహెబ్, తహసీల్దార్ విల్సన్, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.









## తహసిల్దార్ కార్యాలయం ముందు రైతు సంఘం ధర్నా

- విద్యుత్‌ను ప్రైవేటి కరించే రైతు డిస్కం వెనక్కి తీసుకోవాలి
- వానాకాలం యాసంగి సన్న వడ్లకు ఇచ్చే బోనస్ వెంటనే విడుదల చేయాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య

**పాలకుర్తి జూన్ 19(సాక్ష్యం):** పాలకుర్తి తాసిల్దార్ కార్యాలయం ముందు శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసిల్దార్ ఎస్. సరస్వతికి అందజేశారు. ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్యమాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సన్నవడ్లకు ఇచ్చే బోనస్ వానాకాలం పెండింగ్ ఉందని అదే విధంగా యాసంగి బోనస్ కూడా కలిపి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా ఎగ్గొట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ను రైతును మోసం చేసిందన్నారు. ఇటువంటి సందర్భంలో రైతును రాజును చేస్తానంటే నమ్మాలా? అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ ప్రైవేటీకరణ కోసం తెచ్చిన రైతు డిస్కం వెనక్కి తీసుకోవాలి అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పొటాష్, భాస్వారం, కాంప్లెక్స్ ఎరువుల ధరలు వెంటనే తగ్గించాలి అని డిమాండ్ చేశారు. అదేవిధంగా యూరియా బుకింగ్ యాప్ ను రద్దు చేయాలి తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ నిబంధనల ప్రకారం బ్యాంకు డిపాజిట్ ధనము నుండి నుండి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం 18 శాతం పంట రుణాలు ఇవ్వాలని తెలిపారు. కిసాన్ సమ్మాన్ నిధి పథకం రైతులందరికీ అందించాలని, ఇప్పటికీ కిసాన్ సామాన్ నిధి పథకం ప్రారంభంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకే లబ్ధి చేకూరుతుందని కొత్త రైతులకు లబ్ది అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నకిలీ కల్తీ విత్తనాలను అరికట్టడానికి సమగ్ర విత్తన చట్టం అమలు చేయాలని వివరించారు. రైతు వేదిక క్లస్టర్ ఏరియాలోని ఏఈవో లు పంటలను సమగ్రంగా పరిశీలించి నమోదు చేసేట్లు చూడాలని తెలిపారు. వరి, మొక్కజొన్న వంటి పంటలు వేసినప్పుడు రైతులు పంటలు అమ్ముకునేటప్పుడు పంటలు సరిగా నమోదు కాకపోయేసరికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం వెంటనే ఈ విషయంలో తగు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ముసుకు ఇంద్రారెడ్డి, బి.శ్రీలత, బెల్లి సంపత్, జల్లెల సోమనసయ్య, చెలివేరు ఐలయ్య, గూడ మల్లయ్య, చిలువేరు ఐలయ్య, లోడంగి కుమార్, కుంట ఉప్పలయ్య, జ్యోతి కొమురయ్య, కుంట సోమయ్య, గుగ్గిళ్ళ కుమార్, తోటకూరి గట్టయ్య, బెల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## 19వ ఏరియా స్థాయి త్రైపాక్షిక రక్షణ సమావేశం నిర్వహణ

**భూపాలపల్లి, జూన్ 19 (సాక్ష్యం):** సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని ఇల్లందు క్లబ్ లో శుక్రవారం 19వ ఏరియా స్థాయి త్రైపాక్షిక రక్షణ సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డీఎంఎస్ డాక్టర్ ఇనుముల సత్యనారాయణ హాజరయ్యారు. డీడీఎంఎస్ (మైనింగ్) శ్రీ టి. హరిప్రసాద్, డీడీఎంఎస్ (ఎలక్ట్రికల్) శ్రీమతి నాగుల్ మీరా, డీడీఎంఎస్ (మెకానికల్) శ్రీ సుధీర్ కుమార్ బొల్ల, జీఎం (సేఫ్టీ-కార్పొరేట్) శ్రీ కె. సాయిబాబు, జీఎం (సేఫ్టీ) ఆర్జీ రీజియస్ శ్రీ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం ప్రారంభానికి ముందు రక్షణ ప్రతిజ్ఞ చేయించగా, గత త్రైపాక్షిక రక్షణ సమావేశంలో గుర్తించిన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలు మరియు సాధించిన పురోగతిని సమీక్షించారు. ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మాటూరి రవీందర్ పిపిటీ ద్వారా వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎంఎస్ డాక్టర్ ఇనుముల సత్యనారాయణ మాట్లాడుతూ... గనులలో రక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఉద్యోగి తన రక్షణకు తానే బాధ్యత వహించాలన్నారు. ఉద్యోగులు విధి నిర్వహణ సమయంలో నిర్దేశించిన రక్షణ నిబంధనలు, భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదాలకు కారణమవుతుందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా పనిచేయాలని కోరారు. గనులలో పనిచేసే ప్రతి ఉద్యోగి వ్యక్తిగత రక్షణ పరికరాలు (బ్రాజు) తప్పనిసరిగా వినియోగించాలని, పని ప్రారంభానికి ముందు పనిస్థలాన్ని పరిశీలించి ప్రమాదకర పరిస్థితులను గుర్తించి వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.





## నిరుపేద కుటుంబాలకు అండగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్

### - మృతుల కుటుంబాలకు 50 కేజీల బియ్యం, నూనె పంపిణీ

**రాయపర్తి, జూన్ 19(సాక్ష్యం):** మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గారి ఆదేశాల మేరకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి సేవా దృక్పథంతో నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కాట్రపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబాలకు చెందిన ఎండీ చెత్తబి, ఎండీ లాలు, ఇటీవల వివిధ కారణాలతో మరణించారు. శుక్రవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి 50 కేజీల బియ్యం, ఆయిల్ క్యాన్‌లను సహాయంగా అందించారు. ఈ సహాయాన్ని రాయపర్తి మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, ఆశ్రఫ్ పాషా మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ ముఖ్య నాయకులు గిరిక సురేష్, ఎండీ అన్వార్, ఎండీ ఖలీల్, బూడిద యాకయ్య తదితరులు పాల్గొన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సూచనలతో నియోజకవర్గంలో ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అండగా ఉంటుందని చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.






# ప్రభుత్వ పథకాల ప్రచారంలో మీడియా పాత్ర కీలకం

## – పీఐబీ వార్తాలాప్ వర్క్‌షాప్‌లో డీపీఆర్వో పి. శ్రీనివాస్

మహబూబ్‌నగర్, జూన్ 19 ( సాక్ష్యం బ్యూరో ) : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలని జిల్లా పౌర సంబంధాల అధికారి పి. శ్రీనివాస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ పాలనలో 12 ఏళ్ల విశ్వాసం, వికాసం, ప్రజా సంక్షేమం అంశంపై దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాల్లో భాగంగా పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) హైదరాబాద్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మహబూబ్‌నగర్‌లో ప్రత్యేక 'వార్తాలాప్' మీడియా వర్క్‌షాప్ నిర్వహించింది. కార్యక్రమాన్ని ప్రారంభించిన డీపీఆర్వో పి. శ్రీనివాస్ మాట్లాడుతూ, కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ సమాచార యుగంలో వాస్తవ నిర్ధారణకు అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. సమాచారాన్ని ప్రచురించే ముందు దాని నిజానిజాలను ధ్రువీకరించుకోవడం జర్నలిస్టుల బాధ్యత అని పేర్కొన్నారు. నైతిక విలువలతో కూడిన పాత్రికేయం సమాజంలో చైతన్యం పెంపొందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. పీఐబీ హైదరాబాద్ విభాగం మీడియా, కమ్యూనికేషన్ అధికారి వర్గంటి గాయత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న



సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో వార్తాలాప్ కార్యక్రమం ముఖ్య వేదికగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజల మధ్య సమాచార అంతరాన్ని తగ్గించడంలో పీఐబీ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. వర్క్‌షాప్‌లో ప్రముఖ పాత్రికేయుడు ముద్దం నరసింహస్వామి కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లలో సాధించిన పురోగతి, అమలు చేస్తున్న ప్రధాన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనా సంస్కరణలపై సమగ్ర ప్రజెంటేషన్ అందించారు. వివిధ రంగాల్లో చోటుచేసుకున్న మార్పులను వివరించి పాత్రికేయులకు అవగాహన కల్పించారు. డిజిటల్ యుగంలో ఫ్యాక్ట్ చెకింగ్, తప్పుడు సమాచారాన్ని గుర్తించడం, విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారాన్ని ధ్రువీకరించుకోవడం వంటి అంశాలపై ఫ్యాక్ట్ చెక్ శిక్షకురాలు బీఎన్ సత్యప్రియ ప్రత్యేకంగా వివరించారు. అసత్య ప్రచారాన్ని అడ్డుకోవడంలో మీడియా బాధ్యతను గుర్తు చేస్తూ, విశ్వసనీయతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సుమారు 140 మంది జర్నలిస్టులు పాల్గొన్న ఈ వర్క్‌షాప్‌లో డిజిటల్ మీడియా, సమాచార ప్రసారం, పాత్రికేయ నైతిక విలువలు, ఆధునిక జర్నలిజం సవాళ్లపై నిపుణులతో చర్చలు జరిగాయి. పాత్రికేయుల సందేహాలకు నిపుణులు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమం ముగింపులో డీపీఆర్వో పి. శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజలకు కచ్చితమైన, విశ్వసనీయ సమాచారాన్ని సకాలంలో అందించడంలో మీడియా పాత్రను మరింత బలోపేతం చేసేందుకు ఇటువంటి వర్క్‌షాప్‌లు ఉపయోగపడతాయని తెలిపారు.

# మాడుగులపల్లిలో 'వైన్స్' దందా..

- రోడ్డుపై నరకం చూస్తున్న ప్రయాణికులు!
- కనీస సౌకర్యాలు లేవు.. పార్కింగ్ స్థలం లేదు..
- వైన్స్ నిర్వాహకుల ఇష్టారాజ్యం!
- రహదారిపై నిత్యం ట్రాఫిక్ జామ్..
- ఇంత జరుగుతున్న పట్టించుకోని అధికారులు!

మాడుగులపల్లి,జూన్ 19 సాక్ష్యం : మండల కేంద్రంలో మద్యం దుకాణాల నిర్వాహకుల ఆగడాలు





మితిమీరిపోతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కుతూ..స్థానిక ప్రజల, ప్రయాణికుల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. మాడుగులపల్లి మండల కేంద్రంలో ఉన్న వైన్స్ దుకాణం ముందు కనీస సౌకర్యాలు లేకపోవడంతో నిత్యం తీవ్రమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది.దీంతో స్థానికులు,వాహన దారులు నరకయాతన అనుభవిస్తున్నారు.

### రోడ్డంతా వైన్స్ సామ్రాజ్యమేనా..?

మాడుగులపల్లి నుంచి పాములపాడు వెళ్లే ప్రధాన రహదారిపై ఈ వైన్స్ దుకాణం ఉంది.నిబంధనల ప్రకారం వైన్స్ నిర్వాహకులు వచ్చే వినియోగదారుల వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాన్ని కేటాయించాల్సి ఉంది కానీ,ఇవేమీ పట్టించుకోని నిర్వాహకులు లాభాల వేటలోనే తప్ప ప్రజల ఇబ్బందులను గాలి కొదిలేశారు వైన్స్‌కు వచ్చే మందుబాబులు తమ వాహనాలను రోడ్డుకు ఇరువైపులా, ఇష్టం వచ్చినట్లు నిలిపివేస్తున్నారు. దీంతో అత్యంత కీలకమైన ఈ రహదారి కాస్తా ఇరుకుగా మారి, అడుగు ముందుకు పడనంతగా ట్రాఫిక్ స్తంభించిపోతోంది.

### అత్యవసర వాహనాలకూ తప్పని తిప్పలు!

ఈ దారి గుండా వెళ్లే పాఠశాల బస్సులు,ఆర్టీసీ బస్సులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయి కనీసం అత్యవసర పరిస్థితుల్లో వెళ్లే అంబులెన్స్‌లకు కూడా దారి దొరకని పరిస్థితి ఇక్కడ నెలకొంది మద్యం మత్తులో వాహనాలను రోడ్డుపైనే నిలిపి గొడవలకు దిగుతున్నా అడిగే నాథుడే కరువయ్యాడని స్థానికులు మండిపడుతున్నారు. ఆడపిల్లలు, మహిళలు ఈ దారి గుండా నడవాలంటేనే భయపడిపోతున్నారు.

### అధికారులు నిద్రపోతున్నారా లేక మామూళ్ల మత్తులో ఉన్నారా?

రోజూ ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు కానీ, స్థానిక పోలీసులు కానీ పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి నిర్వాహకుల ఇష్టారాజ్యానికి అధికారుల అండదండలు ఉన్నాయా అనే అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి.

### స్థానికుల హెచ్చరిక:

ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే ఈ వైన్స్ ముందు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి నిబంధనలు ఉల్లంఘించిన వైన్స్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలి లేనిపక్షంలో స్థానిక ప్రజలందరినీ సమీకరించి పెద్ద ఎత్తున రాస్తారోకోకు దిగుతాం

# రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు

## పంట మార్పిడిపై అవగాహన కల్పించాలి: జిల్లా కలెక్టర్ డా. సత్య శారద

వరంగల్, జూన్ 19 (సాక్ష్యం): వానాకాలం సాగు సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా చూడటంతో పాటు,




మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా లాభసాటి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ, సహకార శాఖ, రెవెన్యూ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు, ఎరువుల డీలర్లు, క్షేత్రస్థాయి అధికారులతో వానాకాలం సాగు ముందస్తు ఏర్పాట్లు, ఎరువుల పంపిణీ, పంట మార్పిడి విధానాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులను తట్టుకునే కందులు, జొన్నలు తదితర ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. రైతులకు పంట మార్పిడి ప్రయోజనాలపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో రైతుల అవసరాలకు అనుగుణంగా అదనపు యూరియా పంపిణీ కేంద్రాలను గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలని మండల వ్యవసాయ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దార్లకు సూచించారు. రైతులు ఎరువుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామాలకు సమీపంలోనే పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఫర్టిలైజర్ డీలర్ కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, రద్దీని నియంత్రించేందుకు అవసరమైన చోట వాలంటీర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి రైతుకు సకాలంలో యూరియా అందేలా వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు



సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో డీలర్లతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, వారు ఎదుర్కొంటున్న రవాణా, సాంకేతిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఎరువుల బ్లాక్ మార్కెటింగ్, కృత్రిమ కొరతను అరికట్టేందుకు అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, మండలాల స్పెషల్ ఆఫీసర్స్ మండలాల తాసిల్దార్, ఎరువుల డీలర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, భరోసా కేంద్ర నిర్మాణానికి స్థల పరిశీలన

నాగర్‌కర్నూల్ : జూన్ 19 (సాక్ష్యం) : పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణను బలోపేతం చేయడంతో పాటు మహిళలు, చిన్నారుల భద్రతకు సేవలను విస్తరించే లక్ష్యంతో ప్రతిపాదిత ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, భరోసా కేంద్ర నిర్మాణానికి నాగర్‌కర్నూల్ కొల్లాపూర్ చౌరస్తా సమీపంలోని ప్రభుత్వ భూమిని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్పీ





డా. సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ సంయుక్తంగా పరిశీలించారు. స్థల అనుకూలత, రహదారి అనుసంధానం, భూమి విస్తీర్ణం తదితర అంశాలను పరిశీలించిన అధికారులు, అవసరమైన భూమి వివరాలను త్వరితగతిన సమర్పించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రతిపాదిత భరోసా కేంద్రం ద్వారా మహిళలు, చిన్నారులకు కౌన్సెలింగ్, న్యాయ, వైద్య, పోలీసు సహాయ సేవలు ఒకేచోట అందుబాటులోకి రానుండగా, ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ద్వారా ట్రాఫిక్ నిర్వహణ, రహదారి భద్రత మరింత మెరుగుపడనుంది.

# బ్లడ్ బ్యాంక్ పనులు త్వరలో పూర్తి చేస్తాం: రెడ్ క్రాస్ చైర్మన్ ఆకుతోట సాయిబాబు

నాగర్‌కర్నూల్ : జూన్ 19 (సాక్ష్యం) నాగర్‌కర్నూల్ మున్సిపల్ కార్యాలయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో





మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్, వైస్ చైర్మన్ బాదం రమేష్ సభ్యత్వం తీసుకోగా, మున్సిపల్ కమిషనర్ నాగి రెడ్డి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ సునేంద్ర కుమార్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సంస్థ మానవతా సేవలతో దేశవ్యాప్తంగా విశిష్ట సేవలు అందిస్తోందన్నారు. అత్యవసర పరిస్థితులు, యుద్ధ సమయాల్లో సేవలందించేందుకు రెడ్ క్రాస్ సభ్యులకు ప్రత్యేక అవకాశాలు ఉంటాయని తెలిపారు. రెడ్ క్రాస్ చైర్మన్ ఆకుతోట సాయిబాబు మాట్లాడుతూ నాగర్‌కర్నూల్‌లో అసంపూర్తిగా ఉన్న బ్లడ్ బ్యాంక్ పనులను త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. వైస్ చైర్మన్ రాధాకృష్ణ మాట్లాడుతూ నూతన మేనేజింగ్ కమిటీ ఏర్పాటుతో వివిధ కమిటీల పునర్వ్యవస్థీకరణ చేపడుతున్నామని, యూత్ రెడ్ క్రాస్, జూనియర్ రెడ్ క్రాస్, బ్లడ్ క్యాంప్స్ కమిటీలకు త్వరలో కన్వీనర్లను నియమిస్తామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవ

యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి అమ్మవార్లకు



నిత్య కైంకర్యాలు, అమ్మవారికి ఊంజల్ సేవ పర్వాలను అర్చకులు శాస్త్రోక్తంగా చేపట్టారు. సాయంత్రం ఆలయంలో ఆండాళ్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఉంజల్ సేవ నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు.వివిధ రకాల పూలతో, తులసి



దళాలతో,పూజలు చేపట్టారు. ఆలయ అర్చకులు ఊంజల్ సేవలో, కొలువై ఉన్న ఆండాళ్ అమ్మవారికి హారతినిస్తూ కీర్తన చేశారు. వేద మంత్రోచ్చారణల మధ్య మంగళవాయిద్యాల సన్నాయి మేళంనడుమ అమ్మవారికి ఉంజల్ సేవ మహోత్సవం కోలాహలంగా నిర్వహించారు.మొదటగా శ్రీ మన్యు సూక్త పారాయణం జరిపారు. ప్రత్యేకంగా బంగారంతో తయారుచేసిన 108 పుష్పాలను శ్రీవారి సన్నిధిలో ఉంచి వాటితో అర్చన జరిపారు. తిరువీధి సేవ అనంతరం అమ్మవారిని ఆలయంలోని అద్దాల మండపంలోని ఉయ్యాలలో శయనిపు చేయించారు. గంట పాటు వివిధ రకాల పాటలతో అమ్మవారిని కొనియాడుతూ, లాలి పాటల కోలాహలం కొనసాగింది.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శ్రీ స్వామి అమ్మ వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా "ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కొరకు యోగా"

వరంగల్, జూన్ 19 (సాక్ష్యం): వరంగల్‌లోని అనంత లక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల, లేబర్ కాలనీ మరియు లక్ష్మీపురంలోని ప్రభుత్వ ఆయుర్వేద బోధనాసుపత్రి వద్ద యోగా అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అనంత లక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. అనసూయ అధ్యక్షత




వహించగా, సూపరింటెండెంట్ డా. జి.ఎస్.కె. ధర్మరాజ్, కళాశాల మరియు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డా. బాల్నే సాంబమూర్తి, యునెస్కో అధ్యక్షులు రాజ గోవిందు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ యూనిట్ కోఆర్డినేటర్ డా. పుల్లూరి కళ్యాణ్ (అసిస్టెంట్ ప్రొఫెసర్) సమన్వయ పరిచారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ మెడికల్ ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు, కళాశాల మరియు ఆసుపత్రి నాన్-టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు మరియు హౌస్ సర్జన్లు పాల్గొన్నారు.

# బీజేపీ మండల అధ్యక్షునిగా వినుకొల్లు చక్రవర్తి

ఏటూరునాగారం,జూన్ 19, (సాక్ష్యం) :



ఏటూరునాగారం బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు గా వినుకొల్లు చక్రవర్తి శుక్రవారం నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో, మాట్లాడుతూ, రెండవసారి నాకు మండల అధ్యక్షునిగా, నియమించినందుకు ములుగు జిల్లా బీజేపీ పార్టీ అధ్యక్షులు సిరికొండ బలరాం, ఏటూరునాగారం మండల నాయకులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ, మండలంలోని ప్రజా సమస్యల పై పార్టీ తరపున పోరాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చక్రవర్తి అన్నారు.

# సమస్య చెప్పిన వెంటనే స్పందించిన సర్పంచ్ అవి రెండ్ల వజ్రమ్మ

## దగ్గరుండి పని చేయించిన అరుణ్ యువసేన

మిర్యాలగూడ డివిజన్ జూన్ 19 (సాక్ష్యం న్యూస్): నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండల పరిధిలోని బాధలపురం గ్రామపంచాయతీలో గాలివానకు చెట్లు కూలి కరెంటు పోల్లు విరిగి విద్యుత్ అంతరాయం కలిగి డ్రైనేజీలు పొంగి పొర్లి డ్రైనేజీకి అడ్డుపడి కొట్టుకుపోయినటువంటి విషయంలో గ్రామంలో ఉన్న



ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు బాధలపురం గ్రామంలో గ్రామ సర్పంచ్ అవి రెండ్ల వజ్రమ్మ పిలుపుమేరకు స్పందించిన అరుణ్ యువసేన ఆధ్వర్యంలో ఈరోజు గ్రామములో వార్డు వార్డు తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకొని వారి సమస్యలను వెంటనే పరిష్కరించి వాటర్ సౌకర్యం లేనిచోట వాటర్ సౌకర్యం కల్పించి మురుగునీరు డ్రైనేజ్ లాంటి సమస్యలను పరిష్కరించి వాటిని క్లియర్ చేస్తూ తనదైన శైలిలో బాధలపురం గ్రామ ప్రజల మన్ననలు పొందారు ఈ విషయమై గ్రామ ప్రజలు సంతోషించారు. ఇదేవిధంగా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తుండాలని సర్పంచ్ ఆదేశాల మేరకు గ్రామంలో అరుణ్ యువసేన ఆధ్వర్యంలో అన్ని పనులు జరగాలని ఆమె కోరారు.

సమస్యల పరిష్కారం కొరకు గ్రామ ప్రజలు ఏ క్షణంలోనైనా యే రోజుల్లోనైనా ప్రజలు ఎప్పుడు వచ్చినా సమస్యలపై స్పందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు సంతోషించారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులందరూ ఒకటవ వార్డు మెంబర్ పంతంగి సంపూర్ణ మురళి మెంబర్లు మాజీ ఎంపీటీసీ పంతంగి సత్యనారాయణ పంతంగి రామయ్య మాజీ వార్డ్ మెంబర్ గ్రామపంచాయతీ సిబ్బంది రాపోల్ మహేష్ నాయకులు మాలి రామకృష్ణయ్య లింగంపల్లి మల్లేష్ నాగరాజు బంటు కృష్ణయ్య రాజు సైదులు పంతంగి అంజయ్య మాలి సైదులుతదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఆశాకిరణం రాహుల్ గాంధీ : ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

## – మహబూబ్‌నగర్‌లో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు, మెగా రక్తదాన శిబిరం ప్రారంభం

మహబూబ్‌నగర్, జూన్ 19 ( సాక్ష్యం బ్యూరో ) భారతదేశ భవిష్యత్తుకు మార్గదర్శిగా, యువతకు



ఆశాకిరణంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ నిలిచారని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. రాహుల్ గాంధీ 56వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ నగరంలోని గడియారం చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 56 అడుగుల బర్త్‌డే కేక్‌ను అనాథ విద్యార్థులతో కలిసి కట్ చేసి వారికి తినిపించారు. అనంతరం విద్యార్థులకు కొత్త దుస్తులను పంపిణీ చేశారు. తదుపరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. గత పన్నెండు సంవత్సరాలుగా దేశంలో కొనసాగుతున్న పాలనలో మధ్యతరగతి ప్రజల జీవితం కష్టాల్లోకి నెట్టబడిందని, దేశ ఆర్థిక పరిస్థితి బలహీనపడిందని, నిరుద్యోగం పెరిగిందని, సామాన్య ప్రజలపై భారం అధికమైందని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశానికి దిశానిర్దేశం చేసే నాయకుడిగా రాహుల్ గాంధీ ఎదిగారని అన్నారు. పదవుల కోసం కాకుండా ప్రజల కోసం రాజకీయాలు చేసే అరుదైన నాయకుడు ఆయన అని కొనియాడారు. వ్యక్తిగత ఆశయాల కంటే పార్టీ, దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చిన నాయకుడిగా అభివర్ణించారు. దేశవ్యాప్తంగా ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ఆయన చేపట్టిన పాదయాత్రలు, పోరాటాలు, ప్రజలతో మమేకమైన తీరు ఆయన నాయకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశాన్ని ఏకతాటిపైకి తీసుకురావడానికి కృషి చేసిన నాయకుడు రాహుల్ గాంధీయేనని అన్నారు. ఈరోజు యువతలో ఆయనపై విశ్వాసం పెరుగుతోందని, భవిష్యత్తులో ప్రధానమంత్రిగా చూడాలని కోట్లాది మంది భారతీయులు ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. దేశానికి నూతన దిశను చూపగల నాయకత్వం రాహుల్ గాంధీదేనని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని, పార్టీ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గ్రామం నుంచి నగరం వరకు "గడప గడపకు కాంగ్రెస్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణలో ప్రజా సంక్షేమ పాలన కొనసాగించేందుకు, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మిథున్ రెడ్డి, నగర మేయర్ గుమ్మాల మమత , ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఐ మన్మథ కుమార్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఓరగంటి శ్రీనివాస్



చౌటుప్పల్ జూన్ 19 (సాక్ష్యం ): చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్ జన్మదినం సందర్భంగా ఓరగంటి ఎట్టయ్య – అంజమ్మ ఫౌండేషన్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాస్ శుక్రవారం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి పూల బొకేతో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఐ మన్మథ కుమార్ మునుముందు పోలీస్ డిపార్ట్మెంట్లో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## ఏటూరునాగారంలో భారీ వర్షం

ఏటూరునాగారం, జూన్ 19, (సాక్ష్యం) : ఏటూరునాగారం మండలంలో సాయంత్రం కురిసి భారీ వర్షానికి ప్రజలంతా అతలాకుతలం అయ్యారు.



శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడడంతో వ్యాపారులు, గ్రామస్తులంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరుణుడి భీభత్సానికి మండలంలో ఉష్ణోగ్రత తీవ్రత తగ్గి ఒక్కసారిగ చల్లబడదంతో కాస్త ఊపిరి పీల్చుకున్నప్పటికిని వీపరీతమైన ఈదుర గాలితో కూడిన భారీ వర్షం కురియడంతో చిరు వ్యాపారులు, గుడిసెవాసులు సైతం ఇబ్బందులు పడ్డ సంఘటనలు చోటు చేసుకున్నాయి.

## కనేకల్ గ్రామంలో తీరని గ్యాస్ కష్టాలు నెల రోజులైనా రాని సిలిండర్లు

మాడుగులపల్లి, జూన్ 19 సాక్ష్యం : మండల పరిధిలోని కనేకల్ గ్రామంలో గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిచిపోవ



దంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిడమనూర్ భారత్ గ్యాస్, సూర్య ప్రకాష్ భారత్ గ్యాస్ గ్రామీణ్ వితరక్ ఆధ్వర్యంలో కనేకల్ గ్రామానికి నిబంధనల ప్రకారం గ్యాస్ సిలిండర్లను క్రమబద్ధంగా సరఫరా చేయాల్సి ఉంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం దీనికి పూర్తి విరుద్ధంగా జరుగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు గ్రామంలో గ్యాస్ కొరత తీవ్రంగా ఉండటంతో వినియోగదారులు సిలిండర్ల కోసం రోజుల తరబడి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద లైన్లలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్యాస్ సిలిండర్లు వస్తాయన్న ఆశతో పనులన్నీ మానుకుని ఎదురుచూస్తున్నామని, కానీ ఏజెన్సీ నిర్వాహకులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు గ్రామస్తుల సమస్యలను ప్రజాప్రతినిధులు ఏజెన్సీ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించినప్పటికీ, వారు ఫోన్ కాల్స్ కూడా ఎత్తడం లేదని ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు గ్యాస్ సిలిండర్ల కోసం బుక్ చేసుకుని నెల రోజులు దాటుతున్నా ఇంతవరకు ఏజెన్సీ వారు గ్రామానికి రాలేదు. గ్యాస్ లేక వంట చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం అని గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని, కనేకల్ గ్రామానికి సక్రమంగా గ్యాస్ సరఫరా అయ్యేలా చూడాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## సమిష్టి కృషి తోనే మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యం : జిల్లా ఎస్పీ డి. జానకి

### – ప్రభుత్వ ఆసుపత్రి డి–అడిక్షన్ సెంటర్‌ను సందర్శించిన ఎస్పీ

మహబూబ్‌నగర్, జూన్ 19 ( సాక్ష్యం బ్యూరో ) మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసు శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ దరావత్ జానకి పేర్కొన్నారు. మాదకద్రవ్యాల



నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని డి–అడిక్షన్ సెంటర్‌ను జిల్లా ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించి, వైద్యులతో సమావేశమై పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. మాదకద్రవ్యాల వ్యసనానికి గురై చికిత్స కోసం ఎంతమంది వస్తున్నారు, వారికి ఎలాంటి వైద్య సేవలు అందిస్తున్నారు, చికిత్స అనంతరం వారి ప్రవర్తనలో వస్తున్న మార్పులు, పునరావాస కార్యక్రమాల పురోగతి వంటి అంశాలపై వైద్యుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అలాగే చికిత్స పొందుతున్న వ్యక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించారు. వారికి అందుతున్న వైద్య సేవలు, కౌన్సెలింగ్ విధానం, కుటుంబ సభ్యుల సహకారం వంటి అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల బారిన పడిన వారిని నేరస్తులుగా కాకుండా సరైన చికిత్స, మార్గదర్శకత్వం అవసరమైన బాధితులుగా చూడాలని సూచించారు. సకాలంలో వైద్య చికిత్స, కౌన్సెలింగ్, కుటుంబ సభ్యుల మద్దతుతో వారిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడం సాధ్యమవుతుందని తెలిపారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీర, డీఎస్పీ రమణారెడ్డి, సైకియాట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్ రాజ్, ఆర్ఎంఓ డాక్టర్ దుర్గా, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇజాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## రాయపర్తిలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీ కలకలం

### కాపర్ దొంగల హల్‌చల్ – రైతులకు కరెంట్ కష్టాలు.. కాపర్ కోసం మూడోసారి ధ్వంసం

రాయపర్తి, జూన్ 19(సాక్ష్యం): రాయపర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఎదురుగా ఉన్న వ్యవసాయ





భూముల్లో 25 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. కాపర్ వైర్ కోసం కరెంట్ కనెక్షన్ లైన్లను పూర్తిగా తొలగించి ట్రాన్స్‌ఫార్మర్‌లోని వైర్‌ను దొంగిలించారు. ఇదే ట్రాన్స్‌ఫార్మర్‌ను గతంలోనూ రెండుసార్లు దొంగిలించారని, ఇది మూడోసారి అని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు నీళ్లు పెట్టే సమయంలో ఇలా ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వరుసగా చోరీలు జరుగుతుండడం తాము వ్యవసాయం చేయలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దుండగులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన చేపడతామని రైతులు హెచ్చరించారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పెట్రోలింగ్ పెంచాలని, పాత నేరస్తులపై నిఘా ఉంచి చోరీలకు అడ్డుకట్ట వేయాలని రైతు సంఘాల డిమాండ్ చేస్తున్నాయి.

## ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు సువర్ణావకాశం : ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

### – మహబూబ్‌నగర్‌లో పారిశ్రామికవేత్తల అవగాహన, వెండర్ అభివృద్ధి కార్యక్రమం

మహబూబ్‌నగర్, జూన్ 19 ( సాక్ష్యం బ్యూరో ) ఎస్సీ, ఎస్టీ యువత మరియు ఔత్సాహికులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే



యెన్నం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ (ఎంఎస్ఎంఈ) ఆధ్వర్యంలోని నేషనల్ ఎస్సీ–ఎస్టీ హబ్ (ఎన్ఎస్ఎస్‌హెచ్), డిక్కీ తెలంగాణ చాప్టర్ సంయుక్తంగా మహబూబ్‌నగర్ నగరంలోని శివం కన్వెన్షన్‌లో నిర్వహించిన "పారిశ్రామికవేత్తల అవగాహన మరియు ప్రత్యేక వెండర్ అభివృద్ధి కార్యక్రమం"కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలకు వ్యాపార రంగంలో ఎదగడానికి ఇటువంటి అవగాహన కార్యక్రమాలు సువర్ణావకాశమని పేర్కొన్నారు. దళితులు, గిరిజనులు వ్యాపారవేత్తలుగా ఎదిగి ఆర్థికంగా అభివృద్ధి సాధించడంతో పాటు దేశానికి పన్నులు చెల్లించే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పారిశ్రామిక రంగంలో యువత ముందుకు రావడానికి అవసరమైన మార్గదర్శకత్వం, శిక్షణ, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని తెలిపారు. స్వయం ఉపాధి ద్వారా వ్యక్తిగత అభివృద్ధితో పాటు మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ మేయర్ గుమ్మాల మమత , డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, మూడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనితా రెడ్డి, కార్పొరేటర్లు ఎంపీ ప్రవీణ్ కుమార్, పూజిత తదితరులు పాల్గొన్నారు. అలాగే నేషనల్ ఎస్సీ–ఎస్టీ హబ్ తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల హెడ్ ఎస్. సురేష్, డిక్కీ తెలంగాణ చాప్టర్ అధ్యక్షుడు సీతారాం, నెక్స్ట్ జెన్ కోఆర్డినేటర్ అరుణ్, డిక్కీ తెలంగాణ బృంద సభ్యులు బాలరాజ్, ఇంద్రకాంత్, తిరుపతి కార్తీక్ హాజరయ్యారు. పరిశ్రమల రంగానికి చెందిన ప్రముఖ అధికారులు శుభదీప్ ఘోష్ (అడిషనల్ జనరల్ మేనేజర్, మిధాని), కిషన్ (డీజీఎం, మిధాని), హరికిషన్ (డీఎం, ఎన్ఎండీసీ), యాదయ్య (జనరల్ మేనేజర్, డీఐసీ), చంద్రశేఖర్ (ఎల్డీఎం, మహబూబ్‌నగర్), దశరథ్ (అసిస్టెంట్ డైరెక్టర్, ఎంఎస్ఎంఈ), ప్రఫుల్ కుమార్ (మేనేజర్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) తదితరులు పాల్గొని పారిశ్రామిక అవకాశాలు, ప్రభుత్వ పథకాలు, రుణ సదుపాయాలు, వెండర్ అభివృద్ధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ వ్యాపారవేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని డిక్కీ జిల్లా కోఆర్డినేటర్ బి. వెంకటయ్య, వనపర్తి జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు నరసింహులు, ఎం. శివ నాయక్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు నిర్వాహకులను అభినందిస్తూ, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల అభివృద్ధికి డిక్కీ, నేషనల్ ఎస్సీ–ఎస్టీ హబ్ సంస్థలు చేస్తున్న కృషిని ప్రశంసించారు.

## కమ్యూనిటీ కనెక్టింగ్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన పెంపు : జిల్లా ఎస్పీ జానకి

### - దివిటిపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో పోలీసుల ప్రత్యేక అవగాహన కార్యక్రమం

మహబూబ్‌నగర్, జూన్ 19 ( సాక్ష్యం బ్యూరో ): ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కమ్యూనిటీ కనెక్టింగ్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ దరావత్ జానకి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దివిటిపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో మహబూబ్‌నగర్ రూరల్ పోలీసులు కమ్యూనిటీ కనెక్టింగ్ కార్యక్రమాన్ని



నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ జానకి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా సరైన పత్రాలు లేని 36 ద్విచక్ర వాహనాలు, 6 ఆటోలను గుర్తించారు. సంబంధిత వాహన యజమానులు తమ వాహనాలకు సంబంధించిన చట్టబద్ధమైన పత్రాలను సమర్పించిన అనంతరం వాహనాలను తిరిగి తీసుకెళ్లవచ్చని పోలీసులు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు తమ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. పోలీస్ శాఖతో ప్రజలు సత్సంబంధాలు కొనసాగిస్తూ, అనుమానాస్పద ఘటనలు లేదా వ్యక్తుల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే సమాజంలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, మహబూబ్‌నగర్ రూరల్ సీఐ గాంధీ నాయక్, రూరల్ ఎస్ఐ విజయ్ కుమార్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మసాయిపేట గ్రామంలో ఫ్రైడే-డ్రై డే కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్: శుక్రవారం యాదగిరిగుట్ట మండలం మసాయిపేట గ్రామంలో నిర్వహించిన ఫ్రైడే–డ్రై డే కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్...గ్రామంలో



పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి, వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఇళ్ల పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూడాలని, పాత సామగ్రి , ఇతర ఉపయోగించని వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల లోని కిచెన్ షెడ్, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు . డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను నివారించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సక్రమంగా తొలగింపు, డ్రైనేజీల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి మనోహర్, ఎంపీడీవో ,గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## మండల విద్యాధికారి వాసుదేవా రెడ్డి ఆధ్వర్యంలో తిమ్మాపురం లో బడిబాట

ఆత్మకూరు యం జూన్ 19 (సాక్ష్యం) యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (యం) మండలం తిమ్మాపురం గ్రామంలో మండల విద్యాధికారి వాసుదేవా రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ





పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యత గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఎలాంటి ఫీజులు లేకుండా ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం యూనిఫామ్ లు, టెక్స్ట్, నోట్ బుక్స్ అందిస్తున్నామని తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విశాలమైన గ్రౌండ్ అన్ని రకాల వసతులు ప్రభుత్వ పాఠశాలలోనే ఉంటాయని అన్నారు. ఎంఈఓ వాసుదేవ రెడ్డి విజ్ఞప్తి మేరకు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి తల్లిదండ్రులు అంగీకరించారు. మూతపడిన ప్రభుత్వ పాఠశాలను కు పునర్జీవన కల్పించిన వాసుదేవ రెడ్డికి గ్రామ సర్పంచ్ కొనన లక్ష్మమ్మ కిష్టయ్య, యువజన సంఘాలు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంతోష, ఉప సర్పంచ్ బట్టు మహేష్, శ్యామల నరేష్, దయాకర్ కొనన మల్లేష్, కొనన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

చౌటుప్పల్ జూన్ 19 (సాక్ష్యం ) : కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ చౌటుప్పల్ మండల, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని





ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్చార్జి పప్పు రాజు గౌడ్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి,మండల మున్సిపాలిటీ అధ్యక్షులు బోయ దేవేందర్, కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చౌటుప్పల్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డి ఆర్థిక సహకారంతో బాధితులకు ఆర్థిక సహాయం

మాడుగులపల్లి జూన్ 19 సాక్ష్యం: మాడుగులపల్లి మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తల్లమల చంద్రయ్య,కట్ట లింగారెడ్డి,బొల్లం లింగయ్య,కుటుంబా



లకు స్థానిక సర్పంచ్,కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న రోడ్లు భవనాల శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఒక్కొక్కరికి పదివేల రూపాయల చొప్పున శుక్రవారం మూడు కుటుంబాలకు ఆర్థిక సహాయం సర్పంచ్ అర్రూరి నరేష్ ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎరుకల వెంకన్న గౌడ్,పింగళరెడ్డి,సిద్ధార్ధ రెడ్డి,వెంకటరెడ్డి,పాల్గొన్నారు.




# కెనడా 6-0తో ఖతార్‌పై విజయం

ఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీలో కెనడా దుమ్ముదులిపింది. గ్రూప్-బిలో భాగంగా సొంత గడ్డపై జరిగిన వన్-సైడెడ్ మ్యాచ్‌లో కెనడా జట్టు 6-0 గోల్స్ తేడాతో ఖతార్‌ను చిత్తు చేసింది. ఫిఫా ప్రపంచకప్ సుదీర్ఘ చరిత్రలోనే కెనడా జట్టుకు ఇదే మొట్టమొదటి విజయం కావడం విశేషం. ప్రపంచకప్ మ్యాచ్‌లో ఒక ఆతిథ్య దేశం ఆరు గోల్స్ చేయడం 1978 తర్వాత ఇదే తొలిసారి. ఆ ఏడాది అర్జెంటీనా జట్టు పెరూపై 6-0తో గెలవగా, ఇన్నేళ్ల తర్వాత కెనడా ఆ రికార్డును సమం చేసింది.కెనడా స్టార్ స్ట్రైకర్ జొనాథన్ డేవిడ్ ఈ మ్యాచ్‌లో అదరగొట్టాడు. కెనడా తరఫున ప్రపంచకప్‌లో మొదటి హ్యాట్రిక్ సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. యూరప్, దక్షిణ అమెరికాయేతర దేశాల తరఫున ప్రపంచకప్‌లో హ్యాట్రిక్ సాధించిన రెండో ఆటగాడిగా డేవిడ్ నిలిచాడు ఇంతకుముందు 1930లో అమెరికాకు చెందిన బెర్ట్ పటేనాడ్ ఈ ఘనత సాధించారు. మ్యాచ్ ఆరంభం నుంచే కెనడా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. 16వ నిమిషంలోనే కైల్ లారిన్ గోల్ ఖాతా తెరిచి కెనడాకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత జొనాథన్ డేవిడ్ తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. కెనడా ఆటగాళ్ల దూకుడుకు తోడు ఖతార్ ఆటగాళ్ల క్రమశిక్షణా రాహిత్యం ఆ జట్టును మరింత దెబ్బతీసింది. మ్యాచ్ ముగిసే సమయానికి ఖతార్ జట్టు కేవలం 9 మంది ఆటగాళ్లతోనే ఆడాల్సి వచ్చింది. మొదటి సగ భాగంలోనే హోమామ్ అల్ అమీన్ రెడ్ కార్డ్ చూసి వెళ్లగా, రెండో సగభాగంలో మరో ఆటగాడు మైదానం వీడాల్సి వచ్చింది. మ్యాచ్ ఎంతో ఉత్కంఠభరితంగా సాగుతున్న సమయంలో కెనడా మిడ్‌ఫీల్డర్ ఇస్మాయిల్ కోనే తీవ్ర గాయానికి గురయ్యాడు. ఖతార్ మిడ్‌ఫీల్డర్ అసిమ్ మడిబో వెనుక నుంచి అత్యంత ప్రమాదకరమైన రీతిలో కోనేను ట్యాకిల్ చేయడంతో ఆయన మైదానంలోనే తీవ్ర నొప్పితో కుప్పకూలిపోయాడు. చివరకు కోనేను స్ట్రెచర్‌పై మైదానం వెలుపలికి తీసుకెళ్లాల్సి వచ్చింది. కోనే గాయంతో వెనుదిరిగిన తర్వాత 57వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్‌గా మైదానంలోకి వచ్చిన నాథన్ సాలిబా 64వ నిమిషంలో గోల్ కొట్టాడు. ఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీలో స్విట్జర్లాండ్ జట్టు బోస్నియాపై విజయం సాధించింది. గ్రూప్-బిలో భాగంగా బోస్నియా అండ్ హెర్జెగోవినాతో జరిగిన ఉత్కంఠభరిత పోరులో స్విట్జర్లాండ్ 4-1 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో నమోదైన మొత్తం 5 గోల్స్ కూడా ఆట 74వ నిమిషం తర్వాతే రావడం విశేషం. ప్రపంచకప్ చరిత్రలోనే ఇంత సుదీర్ఘ సమయం తర్వాత ఇన్ని గోల్స్ నమోదైన మ్యాచ్ మరొకటి లేదని క్రీడా నిపుణులు చెబుతున్నారు. మ్యాచ్ ఆఖరి దశ వరకు ఇరు జట్లు హోరాహోరీగా తలపడినప్పటికీ, చివరి నిమిషాల్లో స్విస్ జట్టు ఆటను పూర్తిగా తమ వైపు తిప్పుకుంది. స్విట్జర్లాండ్ కోచ్ మురత్ యాకిన్ చేసిన వ్యూహాత్మక మార్పులు, ముఖ్యంగా సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు జోహాన్ మంజంబి, రూబెన్ వర్గాస్ మైదానంలోకి రావడం మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసింది. మ్యాచ్ ప్రారంభంలో బోస్నియా డిఫెన్స్‌ను ఛేదించడానికి స్విట్జర్లాండ్ తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. మొదటి సగభాగంలో స్విస్ ఆటగాళ్లు డాన్ న్డోయ్, రెమో ఫ్రూలర్ గోల్ చేయడానికి ప్రయత్నించినప్పటికీ లక్ష్యాన్ని చేరలేకపోయారు. రెండో సగభాగం ప్రారంభంలో బోస్నియా గోల్ కీపర్ వాసిల్జ్ అద్భుతమైన సేవ్స్‌తో స్విట్జర్లాండ్‌ను అడ్డుకున్నాడు. 57వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్‌గా మైదానంలోకి వచ్చిన స్విస్ ఆటగాడు జోహాన్ మంజంబి మ్యాచ్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచాడు. రూబెన్ వర్గాస్ ఇచ్చిన క్రాస్‌ను బోస్నియా డిఫెండర్లు అడ్డుకునే ప్రయత్నంలో బంతి రిబౌండ్ అవ్వగా, మంజంబి దానిని అద్భుతమైన వాలీ షాట్‌తో గోల్‌గా మలిచి డెడ్‌లాక్‌ను బ్రేక్ చేశాడు.

ఆ తర్వాత కొద్దిసేపటికే మంజంబి ఇచ్చిన కీలక పాస్ అందుకున్న ఎంబోలోను బోస్నియా డిఫెండర్ తారిక్ ముహారెమోవిచ్ కింద పడేసాడు. దీనితో రెఫరీ ఆయనకు నేరుగా 'రెడ్ కార్డ్' ఇచ్చి మైదానం నుంచి పంపించివేశాడు. దీంతో బోస్నియా 10 మంది ఆటగాళ్లకే పరిమితమైంది. దీనిని అనుకూలంగా మార్చుకున్న రూబెన్ వర్గాస్ స్విట్జర్లాండ్ ఆధిక్యాన్ని 2-0కు పెంచగా, 90వ నిమిషంలో మంజంబి తన వ్యక్తిగత రెండో గోల్ చేసి జట్టును 3-0తో తిరుగులేని స్థితికి చేర్చాడు. ఈ గోల్‌తో ప్రపంచకప్ చరిత్రలో అతి పిన్న వయసులో ఒకే మ్యాచ్‌లో రెండు గోల్స్ చేసిన ఆటగాళ్ల జాబితాలో మంజంబి చేరాడు.

## కెనడా- ఖతార్ మ్యాచ్‌లో తీవ్ర ఉద్రిక్తత!
### మ్యాచ్‌లో ఆటగాళ్ల మధ్య ఘర్షణ

ఫిఫా వరల్డ్‌కప్ 2026లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఖతార్‌తో జరిగిన మ్యాచ్‌లో కెనడా జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో కెనడా 6-0 తేడాతో ఖతార్‌ను చిత్తు చేసింది. అయితే మ్యాచ్ అనంతరం మైదానంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరుజట్ల ఆటగాళ్లు గ్రౌండ్‌లోనే గొడవకు దిగడంతో అక్కడి ప్రాంతం ఒక్కసారిగా హీటెక్కింది. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ప్రపంచకప్‌లో వాంకోవర్ బీసీ ప్లేస్ స్టేడియం వేదికగా తాజాగా కెనడా- ఖతార్ జట్లు తలపడ్డాయి. అయితే మ్యాచ్ ముగిసిన వెంటనే ఇరు జట్ల ఆటగాళ్లు మైదానంలోనే ఘర్షణకు దిగారు. మ్యాచ్ అనంతరం కెనడా హెడ్ కోచ్ జెస్సీ



మార్ష్- ఖతార్ మేనేజర్ జూలెన్ లోపెటెగీతో కరచాలనం చేస్తుండగా వాళ్లిద్దరి మధ్య గొడవ మొదలైంది. జూలెన్‌తో కెనడా కోచ్ దురుసుగా ప్రవర్తించినట్లు కనిపించింది. ఇది ఖతార్ ఆటగాళ్లకు ఆగ్రహం తెప్పించింది. ఆ తర్వాత ఇరుజట్ల ప్లేయర్లు, సిబ్బంది మైదానంలోనే ఒకరినొకరితో కలపడ్డారు. పరస్పరం నెట్టేసుకున్నారు. వెంటనే భద్రతా సిబ్బంది మైదానంలోకి చేరుకుని ఇరు జట్ల ఆటగాళ్లను విడగొట్టారు. దీంతో అభిమానులు ఆందోళనకు గురయ్యారు. అయితే మ్యాచ్ సమయంలోనే ఈ వివాదం మొదలైంది. ఖతార్ ఆటగాడు అసిమ్ మడిబో, కెనడా మిడ్‌ఫీల్డర్ ఇస్మాయిల్ కోన్‌ను ఆట మధ్యలో గాయపర్చాడు. దీంతో కెనడా జట్టు తీవ్ర ఆగ్రహానికి గురైంది. సెకండ్ హాఫ్ ప్రారంభమైన కొద్ది సేపటికే, అసిమ్ మడిబో చేసిన ప్రమాదకరమైన టాకిల్ వల్ల ఇస్మాయిల్ కోన్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడు నొప్పితో విలవిల్లాడాడు. దీంతో అతడిని స్ట్రెచర్‌పై మైదానం నుంచి బయటకు తీసుకెళ్లారు. ఇస్మాయిల్ కోన్‌కు గాయపర్చడం కెనడా తోటి ఆటగాళ్లను కలచివేసింది. ఈ ఆగ్రహమే ఘర్షణకు దారితీసింది. ఇక దీనికి కారణమైన అసిమ్ మడిబోకు రిఫరీ రెడ్ కార్డ్ చూపించి మైదానం నుంచి బయటకు పంపించేశాడు. అసిమ్ మడిబోకు రెడ్ కార్డ్ రావడంతో ఖతార్ 10 మంది ఆటగాళ్లతోనే ఆడాల్సి వచ్చింది. దీనిని పూర్తిగా సద్వినియోగం చేసుకున్న కెనడా విజృంభించింది. ఇస్మాయిల్ కోన్ గాయపడడంతో కెనడా జట్టులోకి జాకబ్ షాఫెల్‌బర్గ్ వచ్చాడు. అతడు గోల్ చేసిన అనంతరం ఇస్మాయిల్ జెర్సీని గాలిలో ఊపుతూ సంబరాలు చేసుకున్నాడు. అలాగే కెనడా తరఫున జొనాథన్ డేవిడ్ అద్భుతంగా రాణించాడు. మూడు గోల్స్‌తో హ్యాట్రిక్ సాధించాడు. ఇక ఫీఫా ప్రపంచ కప్ చరిత్రలో కెనడాకు ఇదే తొలి విజయం కావడం విశేషం. ఈ విజయంతో కెనడా ప్రస్తుతం నాలుగు పాయింట్లతో ఉంది. గ్రూప్ బీ లో టాప్ ప్లేస్‌కు దూసుకెళ్లింది.

## డూప్లెసిస్ 46 బంతుల్లోనే సెంచరీ

మేజర్ లీగ్ 2026లో ఫాఫ్ డుప్లెసిస్ తొలి మ్యాచ్‌లోనే విధ్వంసం సృష్టించాడు. సియాటెల్ ఆర్కాస్‌తో జరిగిన మ్యాచ్‌లో టెక్సాస్ తరఫున ఆడిన డూప్లెసిస్ 46 బంతుల్లోనే సెంచరీ చేశాడు. 41 ఏళ్లలో 46 బంతుల్లో సెంచరీ చేసిన ఫాఫ్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ మేజర్ లీగ్‌లో ఫాఫ్ 4 సెంచరీలతో అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఇదే మ్యాచ్‌లో సియాటెల్ ఓపెనర్ టిమ్ సైఫర్ట్ కూడా సెంచరీ చేయడం విశేషం. ఈ మ్యాచ్‌లో టెక్సాస్ ఘన విజయం సాధించింది.ఫాఫ్ డుప్లెసిస్ వావ్ అనిపించే ప్రదర్శన చేశాడు. 41 ఏళ్ల వయస్సులో కేవలం 46 బంతుల్లోనే సెంచరీ బాది తనలో ఇంకా సత్తా ఉంది అనిపించాడు. ఇంటర్నేషనల్ క్రికెట్‌కు ఎప్పుడో గుడ్ బై చెప్పిన డుప్లెసిస్.. టీ20 లీగ్‌లలో మాత్రం కొనసాగుతున్నాడు. ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున చివరిసారిగా ఆడిన ఈ లెజెండ్.. ఐపీఎల్ 2026కు ముందు ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ఇస్తున్నట్లు ప్రకటించాడు. తాజాగా యూఎస్ఏ వేదికగా జరుగుతున్న మేజర్ లీగ్ టీ20లో చెన్నై సూపర్ కింగ్స్‌కి టెక్సాస్ సూపర్ కింగ్స్ తరఫున ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. టెక్సాస్‌కి కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న ఫాఫ్ డుప్లెసిస్ మేజర్ లీగ్ 2026 తొలి మ్యాచ్‌లోనే సెంచరీ బాది జట్టుకు మరచిపోలేని విజయాన్ని అందించాడు. సియాటెల్ ఆర్కాస్‌తో జరిగిన మ్యాచ్‌లో 221 పరుగుల లక్ష్యాన్ని నాటౌట్‌గా నిలిచి ఛేదించాడు. మేజర్ లీగ్‌లో నాలుగు సెంచరీలు నమోదు చేసిన ఫాఫ్, ఈ లీగ్‌లో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాడిగా నిలిచాడు. డల్లాస్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టెక్సాస్ సూపర్ కింగ్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన సియాటెల్ ఆర్కాస్ టెక్సాస్ బౌలర్లను ఉతికారేసింది. న్యూజిలాండ్ స్టార్ హిట్టర్ టిమ్ సైఫర్ట్



బౌండరీల మోత మోగించాడు. 66 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, ఆరు సిక్సర్లతో 104 పరుగులు చేయగా.. షయాన్ జహంగీర్ 47 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్సర్లతో 78 పరుగులు బాదాడు. ఆఖర్లో కెప్టెన్ మార్కస్ స్టొయినీస్ 3 బంతుల్లో 13 పరుగులు చేయడంతో సియాటెల్ 20 ఓవర్లలో కేవలం 2 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన రెండో బంతికే వికెట్ కోల్పోయింది. తెలుగు ఆటగాడు సాయితేజ ముక్కమల్ల తాను ఎదుర్కొన్న మొదటి బంతికే డకౌట్ అయ్యాడు. తొలి ఓవర్‌లోనే వికెట్ పడినప్పటికీ ఫాఫ్ డుప్లెసిస్ సియాటెల్ బౌలర్లకు చుక్కలు చూయించాడు. రీలీ రోస్సోతో కలిసి పవర్ ప్లేలోనే 89 పరుగులు రాబట్టాడు. 21 బంతుల్లో 7 ఫోర్లు, రెండు సిక్సర్లతో రోస్సో 49 పరుగులు చేసి అవుటయ్యాడు. ఆ వెంటనే మిలింద్ కుమార్, శుభమ్ రంజనే కూడా అవుటవ్వడంతో 165కే నాలుగు వికెట్లు కోల్పోయింది. వియాన్ ముల్డర్‌తో కలిసి ఫాఫ్ డుప్లెసిస్ మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ని ఫినిష్ చేశాడు. 46 బంతుల్లో సెంచరీ చేసిన ఫాఫ్ 52 బంతుల్లో 9 ఫోర్లు, 7 సిక్సర్లతో 113 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ముల్డర్ కూడా 15 బంతుల్లో మూడు సిక్సర్లతో 31 పరుగులు చేశాడు. దాంతో టెక్సాస్ 18.3 ఓవర్లలోనే 221 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

## టోర్నీ మొత్తానికి దూరమైన శ్రేయాంక పాటిల్
### జట్టులోకి రానున్న లెగ్ స్పిన్నర్ ప్రేమా రావత్

మహిళల టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో వరుస విజయాలతో జోరు మీదున్న టీమిండియాకు బిగ్ షాక్ తగిలింది. జట్టు ప్రధాన స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ చీలమండ గాయంతో ఈ టోర్నీ మొత్తానికి దూరమైంది. ఆమె స్థానంలో ప్రేమా రావత్‌ను జట్టులోకి తీసుకున్నారు. నెదర్లాండ్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో బంతిని అడ్డుకునే ప్రయత్నంలో శ్రేయాంక పాటిల్ కుడి చీలమండకు తీవ్ర గాయమైంది. తీవ్ర నొప్పితో బాధపడిన ఆమె కనీసం నడవలేకపోవడంతో స్ట్రెచర్ సాయంతో స్టేడియం బయటకు తీసుకెళ్లారు. హుటాహుటిన ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అయితే ఈ టెస్ట్‌లో ఆమె చీలమండ స్నాయువు చిరిగిపోయినట్లు తేలింది. ఫలితంగా ఆమె ఈ టోర్నీ మొత్తానికి దూరమైంది. ఈ విషయాన్ని ధ్రువీకరిస్తూ ఐసీసీ ప్రకటనను విడుదల చేసింది. 'ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026 'ఈవెంట్ టెక్నికల్ కమిటీ' భారత జట్టులో శ్రేయాంక పాటిల్ స్థానాన్ని ప్రేమ రావత్‌తో భర్తీ చేయడానికి ఆమోదం తెలిపింది. బుధవారం నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు శ్రేయాంక కుడి మడమకు గాయం కావడంతో ఆమె ఈ టోర్నీ నుంచి తప్పుకుంది.ఈ నేపథ్యంలో ఆమె స్థానంలో రావత్‌ను జట్టులోకి తీసుకున్నారు.' అని ఐసీసీ తన అధికారిక ప్రకటనలో పేర్కొంది. గతంలో చేతి వేలికి ఫ్రాక్చర్ కావడం వల్ల 2024



ప్రపంచకప్‌కు దూరమైన 23 ఏళ్ల శ్రేయాంక పాటిల్.. ఇప్పటి వరకు 24 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి 29 వికెట్లు తీసింది.శ్రేయాంక పాటిల్ స్థానంలో జట్టులోకి వచ్చిన ప్రేమా రావత్.. ఉత్తరాఖండ్‌కు చెందిన ఒక లెగ్ స్పిన్నర్. వుమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో ఆర్‌సీబీకి ప్రాతినిధ్యం వహిస్తుంది. భారత్-ఏ తరఫున అద్భుత ప్రదర్శన కనబర్చడంతో ఆమెకు తొలిసారి టీమిండియా తరఫున ఆడే అవకాశం దక్కింది.హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు ఈ టీ20 ప్రపంచకప్‌లో వరుస విజయాలతో అద్భుతమైన ఆరంభాన్ని అందుకుంది. తమ తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను 64 పరుగుల తేడాతో ఓడించిన భారత్.. నెదర్లాండ్స్‌పై భారీ విజయాన్ని అందుకుంది. ఈ రెండు విజయాలతో పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆదివారం మాంచెస్టర్ వేదికగా జరిగే తమ తదుపరి లీగ్ మ్యాచ్‌లో సౌతాఫ్రికాతో తలపడనుంది. ఈ కీలక మ్యాచ్‌కు ముందు శ్రేయాంక పాటిల్ దూరమవ్వడం భారత్‌ను కలవరపెడుతోంది.





## టీమ్ ఇండియాకు ధోని లాంటి మెంటార్ కావాలి!

భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ లక్ష్యంగా మాజీ పేసర్ ఎస్. శ్రీశాంత్ చేసిన కొన్ని ఘాటు వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రస్తుతం ఉన్న టీమ్ ఇండియా సెటప్‌కు గౌతమ్ గంభీర్ కంటే ఎంఎస్ ధోని లాంటి వ్యక్తి అవసరమని శ్రీశాంత్ అభిప్రాయపడ్డాడు. టీమ్ ఇండియాకు ప్రస్తుతం ఆటగాళ్లు మనస్ఫూర్తిగా గౌరవించే ఒక మార్గదర్శకుడు కావాలని, అంతేగానీ "ఆటగాళ్ల వెనుక మాట్లాడేవాడు" లేదా టీవీల్లో ప్రశంసల కోసం ప్రాకులాడే వ్యక్తి కాదని గంభీర్‌ను ఉద్దేశించి పరోక్షంగా విమర్శలు గుప్పించాడు. కాగా, ఈ పూర్తి ఇంటర్వ్యూ ఇంకా విడుదల కావాల్సి ఉంది. ఇటీవల న్యూజిలాండ్, సౌతాఫ్రికా వంటి జట్లతో స్వదేశంలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌ల్లో భారత్ ఎందుకు ఇబ్బంది పడిందనే ప్రశ్న శ్రీశాంత్‌కు ఎదురవగా.. ఆ ప్రశ్నను మధ్యలోనే అడ్డుకుంటూ.. "అప్పుడు కోచ్ ఎవరు?" అని ఎదురుప్రశ్న వేశాడు. ఆటగాళ్ల ఎంపికకు సంబంధించిన సమస్యలపై స్పందిస్తూ.. దీనికంతటికీ గంభీరే కారణమన్నట్లుగా మాట్లాడాడు. "ముందు కోచ్‌ను మార్చండి. భారత్‌కు ఇప్పుడు కావాల్సింది కోచ్ కాదు, ఒక మంచి మెంటార్" అని శ్రీశాంత్ స్పష్టం చేశాడు. ఒక షో సజావుగా సాగడానికి డైరెక్టర్ ఎంత ముఖ్యమో, జట్టుకు కోచ్ కూడా అంతే ముఖ్యమని చెబుతూనే.. తనకు సాధారణంగా కోచ్‌లపై ఎలాంటి వ్యతిరేకత లేదని, కానీ అంతర్జాతీయ జట్లకు సాంప్రదాయ కోచ్‌ల కంటే మెంటార్ల అవసరమే ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డాడు. గంభీర్ అనుసరిస్తున్న కోచింగ్ విధానం ఆటగాళ్లపై తీవ్రమైన ఒత్తిడిని పెంచుతోందని శ్రీశాంత్ ఆందోళన వ్యక్తం చేశాడు. ఫెయిల్ అయితే జట్టు నుంచి తీసేస్తామనే భయాన్ని కల్పించి, ఆటగాళ్లను ఒక కఠినమైన వ్యవస్థలోకి నెట్టే కోచ్ జట్టుకు అవసరం లేదని అన్నాడు.దీనికి ఉదాహరణగా ఎంఎస్ ధోనిని ప్రస్తావిస్తూ.. ధోని ఎప్పుడూ అలా వ్యవహరించలేదని చెప్పాడు. "జనాలు ఏమైనా చెప్పుకోవచ్చు.. కానీ ధోని ఆలోచనా విధానం, అతను ఆటగాళ్లలో నింపిన ఆత్మవిశ్వాసమే జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాయి" అని శ్రీశాంత్ గుర్తుచేశాడు. భారత్ టీ20 ప్రపంచకప్ గెలవడంలో గంభీర్‌కు మితిమీరిన క్రెడిట్ ఇవ్వడం సరికాదని శ్రీశాంత్ వాదించాడు. "మైదానంలో చెమటోడ్చి ఆడేది ఆటగాళ్లు, కాబట్టి ఆ గుర్తింపు, క్రెడిట్ వారికే దక్కాలి" అని అన్నాడు. ప్రపంచకప్ విజయాన్ని ప్రస్తావిస్తూ.. ఆటగాళ్ల ప్రదర్శనే అక్కడ అత్యంత కీలకమని చెప్పాడు. "ఒకవేళ సంజూ శాంసన్ రాణించకపోయినా, సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీ సరిగ్గా చేయకపోయినా, లేదా సమయానికి బౌలింగ్ మార్పులు జరగకపోయినా మనం గెలిచేవాళ్లమా? మైదానంలోకి వచ్చి కోచ్ ఏమైనా నిర్ణయాలు తీసుకున్నాడా?" అంటూ శ్రీశాంత్ ఘాటుగా ప్రశ్నించాడు.2013 స్పాట్ ఫిక్సింగ్‌లో శ్రీశాంత్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ధోని వల్లే శ్రీశాంత్ కెరీర్ నాశనం అయ్యిందంటూ కామెంట్స్ కూడా వినిపించాయి. అయితే ఇప్పుడు శ్రీశాంత్ ధోనిపై ప్రశంసలు కురిపించడం కాస్త విచిత్రంగానే ఉంది.

## 2027 వన్డే ప్రపంచకప్‌లో ఇషాన్ ఖాయం: గవాస్కర్

అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన రెండో వన్డేలో 125 పరుగులతో చెలరేగిన వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌పై క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ప్రశంసలు కురిపించారు. ప్రస్తుత ఫామ్ చూస్తుంటే వన్డే ప్రపంచకప్ 2027 కోసం ఇషాన్‌కు అప్పుడే దక్షిణాఫ్రికా వీసా దొరికినట్లు అనిపిస్తోందని, అతడిని జట్టు నుంచి తప్పించడం అసాధ్యమని గవాస్కర్ జోస్యం చెప్పారు. ఇంగ్లాండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ సైతం ఇషాన్ బ్యాటింగ్ శైలిని కొనియాడాడు. టీమిండియా వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ .. ఇటీవల దుమ్మురేపుతున్నాడు. ఐపీఎల్ 2025లో అద్భుత ప్రదర్శనతో టీమిండియా తరఫున కమ్‌బ్యాక్ ఇచ్చిన ఈ లెఫ్ట్ హ్యాండర్..



ప్రస్తుతం భారత జట్టులో కీలక ఆటగాడిగా మారిపోయాడు. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా పరుగుల వరద పారిస్తున్నాడు. తాజాగా అఫ్ఘానిస్థాన్‌తో రెండో వన్డేలో మెరుపు శతకంతో సత్తాచాటాడు. దీంతో జట్టు నుంచి అతడిని తప్పించలేని పరిస్థితి తీసుకొచ్చాడు. ఈ నేపథ్యంలో ఇదే విషయంపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ మాట్లాడారు. ఇషాన్ కిషన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా వేదికగా జరిగే వన్డే ప్రపంచకప్ 2027లో తప్పకుండా ఆడతాడని జోస్యం చెప్పారు. నాకు తెలిసి ఇషాన్ కిషన్‌కు ఇప్పటికే దక్షిణాఫ్రికా వీసా (వన్డే ప్రపంచకప్ 2027 కోసం) వచ్చి ఉంటుందని అనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో అతడిని జట్టు నుంచి తప్పించాలంటే మరో ఆటగాడు అద్భుతమైన ప్రదర్శన చేయాల్సిందే. టీ20 ఫార్మాట్‌లో ఇషాన్ జట్టుకు ఎంతో కీలకమైన ఆటగాడు. పైగా చక్కగా రాణిస్తున్నాడు. షాట్లు అద్భుతంగా ఆడుతున్నాడు. డిఫెన్స్ కూడా బాగుంది. బంతి షార్ట్‌గా వస్తే.. వెంటనే వెనక్కి జరిగి సిక్సర్లు కొడతాడు. గత ఏడాదిన్నర కాలంలో ఇషాన్ సంపూర్ణ ఆటగాడిగా మారిపోయాడు" అని సునీల్ గవాస్కర్ అన్నారు. మరోవైపు ఇంగ్లాండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ కూడా ఇషాన్ కిషన్.. బ్యాటింగ్‌కు ఫిదా అయిపోయాడు. ఫార్మాట్, ఆడే పొజిషన్‌తో సంబంధం లేకుండా పరుగుల వరద పారిస్తున్నాడని చెప్పుకొచ్చాడు. అతడు టీమిండియా తరఫున ఆడుతున్నంత కాలం.. ఏ స్థానంలో బ్యాటింగ్ చేస్తున్నది పట్టించుకోకుండా రన్స్ చేస్తాడని కొనియాడాడు. ముఖ్యంగా ఇషాన్ ఎక్స్‌ట్రా కవర్ మీదుగా కొట్టే షాట్లు తనకు ఎంతో ఇష్టమని గ్రేమ్ స్వాన్ వ్యాఖ్యానించాడు. కాగా అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన రెండో వన్డేలో ఇషాన్ కిషన్.. 79 బంతుల్లో 125 పరుగులు చేశాడు. హాఫ్ సెంచరీ చేసేందుకు 52 బంతులు తీసుకున్న అతడు.. తర్వాత టాప్ గేర్‌లోకి వచ్చాడు.

## హర్షిత్ రాణా రీ-ఎంట్రీ..!?

ఇండియా ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణాకు సంబంధించిన ఒక బిగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. అఫ్ఘానిస్తాన్‌తో శనివారం చెన్నైలో జరగబోయే లాస్ట్ వన్డే మ్యాచ్ కోసం అతన్ని ఇండియన్ క్రికెట్ టీమ్ స్క్వాడ్‌లోకి సెలెక్ట్ చేశారు. త్రీ-మ్యాచ్ వన్డే సిరీస్‌లో ఫస్ట్ రెండు మ్యాచ్‌లు గెలిచిన ఇండియా ఆల్రెడీ 2-0 తో సిరీస్ కైవసం చేసుకుంది. ఇప్పుడు క్లీన్‌స్వీప్ టార్గెట్‌గా పెట్టుకున్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆర్మీకి హర్షిత్ రాణా రాక మరింత బలాన్ని ఇచ్చింది. టీ20 వరల్డ్ కప్ 2026 కు ముందు ముంబైలో సౌతాఫ్రికాతో జరిగిన వార్మప్ మ్యాచ్ టైమ్‌లో హర్షిత్ మోకాలి గాయానికి గురయ్యాడు. దీంతో ఆ మెగా టోర్నమెంట్‌తో పాటు కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున ఐపీఎల్ కు కూడా కంప్లీట్‌గా దూరమయ్యాడు. గాయం తర్వాత హర్షిత్ రాణా చాలా రోజులు క్రికెట్‌కు దూరంగా ఉండాల్సి వచ్చింది. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు) లో చేరిన హర్షిత్, అక్కడ తన రిహాబిలిటేషన్‌ను సక్సెస్ ఫుల్ గా కంప్లీట్ చేసుకున్నాడు.

పూర్తి ఫిట్‌నెస్ సాధించిన తర్వాత చెన్నై వేదికగా అఫ్ఘానిస్తాన్‌తో జరిగే మ్యాచ్ కోసం టీమ్‌తో జాయిన్ అయ్యాడు. "బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో రిహాబిలిటేషన్ పూర్తి చేసుకున్న హర్షిత్ రాణా చెన్నైలో వన్డే స్క్వాడ్‌తో కలిశాడు" అని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా ఒక మీడియా రిలీజ్ లో స్పష్టం చేశారు. 24 ఏళ్ల హర్షిత్ రాణా ఇండియా తరఫున ఇప్పటివరకు 14 వన్డేలు ఆడి 27.38 యావరేజ్, 6.21 ఎకానమీ రేట్‌తో 16 వికెట్లు పడగొట్టాడు. ఈ ఏడాది జనవరిలో న్యూజిలాండ్‌తో జరిగిన హోమ్ టీ20ఐ సిరీస్‌లో అతను లాస్ట్ టైమ్ ఇండియా జెర్సీలో కనిపించాడు. అయితే గాయం నుంచి కోలుకున్న వెంటనే అతనికి సెలెక్టర్లు వరుస ఛాన్సులు ఇస్తున్నారు. అఫ్ఘాన్ మ్యాచ్‌తో పాటు రాబోయే ఐర్లాండ్, ఇంగ్లాండ్ టూర్లలో ఆడే ఇండియా స్క్వాడ్‌లో కూడా హర్షిత్‌కు ప్లేస్ దక్కింది.



# "స్పిరిట్" ఈజ్ నాట్ వన్ సినిమా తీసి సర్వం కోల్పోయాం..

**ప్రభాస్ గారు మాకు మీరే దిక్కు**
**మా సినిమా పైన కోర్టు కేసు వేసి రిలీజ్ ఆపేసి రోడ్డున పడేసిన ప్రభాస్ ప్రొడ్యూసర్స్:**
**మహిళా రైతు నిర్మాత నర్సమ్మ**

పాన్ ఇండియా హీరో ప్రభాస్ గారు మాకు మీరే దిక్కు ఆస్తులు అమ్మి "స్పిరిట్" ఇస్ నాట్ వన్ సినిమా తీసి సర్వం కోల్పోయాం. పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం లా మా మీద రెండు లీగల్ నోటీసులు పంపించి సినిమా రిలీజ్ ఆపేసారు. మాతో మాట్లాడితే వేరే టైటిల్ పెట్టుకుని మా సినిమా రిలీజ్ చేసుకునేవాళ్ళం. రిలీజ్ చెయ్యడానికి ఊరిలో ఒకరిని డబ్బులు అడిగాం అప్పుడు డబ్బులు ఇస్తాను అన్నవాళ్లు కూడా భయపడి ఇవ్వలేదు. ఊరిలో పరువు పోయింది ఇప్పుడు మమ్మల్ని ఎవ్వరు నమ్మడం లేదు. మా ఫ్యామిలీ రోడ్డున పడిపోయాం. ప్రభాస్ గారు మమ్మల్ని మీరే ఆదుకోవాలి. మీకోసం టైటిల్ మార్చుకోడ డానికి మేము సిద్ధం గానే ఉన్నాము. మమ్మల్ని సంప్రదించకుండా టీ-సిరీస్ సంస్థ అధినేత శ్రీ భూషణ్ కుమార్ రెండు లీగల్ నోటీసులు పంపారు. అడిగి ఉంటే మేము టైటిల్ మార్పుకు ఒప్పుకునే వాళ్ళం. ఒక రైతు ఫ్యామిలీ సినిమా తీస్తే మాకు వచ్చిన టైటిల్ వివాదం కి సినిమా ఇండస్ట్రీ ఎటువంటి సపోర్ట్ చెయ్యడం లేదు. ప్రభాస్ గారిపై, సందీప్ రెడ్డి వంగా గారిపై అభిమానంతో ఈ విజ్ఞప్తిని చేస్తున్నాను. మీరు చేస్తున్న "స్పిరిట్" సినిమా నిర్మాతలు అయిన టీ-సిరీస్ సంస్థ అధినేత శ్రీ భూషణ్ కుమార్ గారి తరఫున, మా "స్పిరిట్ ఈజ్ నాట్ వన్" చిత్రాన్ని విడుదల చేయకూడదని, దాని ప్రచార కార్యక్రమాలు నిలిపివేయాలని కోరుతూ మాకు లీగల్ నోటీసు పంపబడింది. మా "స్పిరిట్ ఈజ్ నాట్ వన్" చిత్రం 8th Wonder Cinemas బ్యానర్‌పై నిర్మించబడింది. ఈ చిత్రానికి మీరు సూట్ మొదలు పెట్టక ముందు సంవత్సరంలోనే మాకు సెన్సార్ సర్టిఫికేట్ లభించింది. అంతకుముందే మేము అనేక యూట్యూబ్ ఛానెల్స్, వార్తాపత్రికలు, ఇతర మీడియా వేదికల ద్వారా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాము. చిత్రానికి సంబంధించిన ఇంటర్వ్యూలు కూడా ఇచ్చాము. గత నెలలో చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించి, పోస్టర్లు ముద్రించి, విడుదలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన సమయంలో, సందీప్ రెడ్డి వంగా గారి మేనేజర్ ద్వారా మా ఇంటి చిరునామాలు, ఇతర వివరాలు మా నుంచే సేకరించి, వాటిని టీ-సిరీస్ వారికి అందించి అనంతరం మాకు లీగల్ నోటీసు పంపించారు. ఈ పరిణామాల వల్ల మా కుటుంబం సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. విడుదల కోసం పెట్టిన పెట్టుబడులు నిలిచిపోయాయి. గతంలో ఈ సినిమా నిర్మాణం కోసం చేసిన అప్పుల



కారణంగా రుణదాతల నుంచి కూడా ఒత్తిడి ఎదురవుతోంది. అంతేకాక మీరు పంపించిన లాయర్ నోటీసు మేమే కావాలని మా ఊర్లో మా ఇంటికి పంపించి అప్పుల వాళ్ళకి డబ్బులు ఇవ్వకుండా ఎగ కొట్టాలని అనుకుంటున్నాము అని మీ వల్ల నింద కూడా వచ్చింది. మీరు ఈ నోటీసు పంపడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో మాకు తెలియదు. ఒకవేళ టైటిల్‌కు సంబంధించిన ఏదైనా అభ్యంతరం ఉంటే, పెద్దల సమక్షంలో చర్చించి పరిష్కారం కనుగొనడానికి మేము సిద్ధంగా ఉన్నాము. మీకు కూడా దురుద్దేశం ఏమీ లేకపోతే మీరు పెద్దమనుషులు దగ్గరికి రావాలని ఆశిస్తూ చిన్న నిర్మాతలు, మంచి కథలు, మంచి టైటిళ్లతో సినిమాలు చేయకూడదనే ఉద్దేశం ఎవరికీ ఉండకూడదని మా అభిప్రాయం. ఒకవేళ ఈ చర్యలు కేవలం మీ సినిమా ప్రచారం లేదా వాణిజ్య ప్రయోజనాల కోసం జరిగి ఉంటే, దాని వల్ల మా కుటుంబం, మా సినిమా తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నాయి. అయితే ఈ విషయాల గురించి మీకు పూర్తి సమాచారం లేకపోతే, దయచేసి మీ నిర్మాతలతో మాట్లాడి నిజానిజాలు తెలుసుకొని మాకు న్యాయం జరిగేలా సహకరించగలరని కోరుతున్నాము. అలాగే, మీ నిర్మాతల అభ్యంతరాలు ఉపసంహరించుకున్నట్లయితే, "8th Wonder Cinemas" బ్యానర్‌పై నిర్మితమైన "స్పిరిట్ ఈజ్ నాట్ వన్" చిత్రానికి ఎటువంటి అభ్యంతరం లేదని, దాని విడుదల, ప్రదర్శన, డిజిటల్ లేదా ఇతర ప్లాట్‌ఫారమ్‌లలో విక్రయానికి తమకు ఎటువంటి అభ్యంతరం లేదని స్పష్టంగా తెలియజేసే అధికారిక లేఖ, ప్రకటన కుడా ఇవ్వగలరని మనవి. మా సినిమా కోసం మేము అనేక సంవత్సరాలుగా శ్రమించాము. ఇది కేవలం ఒక సినిమా మాత్రమే కాదు, నా చిన్ననాటి కల. మా కుటుంబ సభ్యులందరి కష్టం, ఆశలు, పెట్టుబడులు ఈ చిత్రంలో ఉన్నాయి. మేము గౌరవప్రదంగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలనే సంకల్పంతో ముందుకు వచ్చాము. కాబట్టి, దయచేసి మా పరిస్థితిని అర్థం చేసుకుని, మాకు సానుకూలంగా స్పందించి, "స్పిరిట్ ఈజ్ నాట్ వన్" చిత్రాన్ని విడుదల చేసుకునే అవకాశాన్ని కల్పించగలరని, మాది చిన్న సినిమా కాబట్టి మా సినిమా రిలీజ్ అయ్యే అంతవరకు మీ స్పిరిట్ సినిమా రిలీజ్ ని వాయిదా వేసుకోవాలి అని చేతులు జోడించి ప్రభాస్ గారిని, సందీప్ రెడ్డి వంగా గారిని వేడుకుంటున్నాను. చివరగా, ఈ విజ్ఞప్తిపై మీరు సానుకూలంగా స్పందించి, మా చిత్ర విడుదలకు సహకరిస్తారని ఆశిస్తున్నాము. ఒకవేళ ఈ అంశంపై మీ నుంచి ఎలాంటి స్పందన రాకపోయినా, లేదా మా సమస్యకు న్యాయమైన పరిష్కారం లభించకపోయినా, మా హక్కులు, ప్రయోజనాలను కాపాడుకోవడానికి మేము న్యాయస్థానాన్ని ఆశ్రయించక తప్పదు. అలాగే, ఇప్పటివరకు మాకు జరిగిన ఆర్థిక నష్టం, పరువు నష్టం, ఇతర ఇబ్బందులన్నింటినీ పరిగణనలోకి తీసుకొని, చట్టపరంగా మాకు అందుబాటులో ఉన్న అన్ని న్యాయపరమైన మార్గాలను అనుసరించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని మర్యాదపూర్వకంగా తెలియజేస్తున్నాము. అయినప్పటికీ కంటే పరస్పర అవగాహనతో సమస్యకు పరిష్కారం లభించాలని మేము హృదయపూర్వకంగా కోరుకుంటున్నాము.

## టామ్ హాలండ్ 'స్పైడర్-మ్యాన్: బ్రాండ్ న్యూ డే' తెలుగు ట్రైలర్ విడుదల.. జూలై 30న గ్రాండ్ రిలీజ్

ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న కథలో పీటర్ పార్కర్ పూర్తిస్థాయిలో స్పైడర్-మ్యాన్‌గా నేరాలతో పోరాడుతూనే, తన గత జీవితాన్ని కోల్పోయిన బాధను మోస్తుంటాడు. తన స్నేహితులు, తనకు అత్యంత ఆప్తులైన వ్యక్తులు తనను గుర్తుపట్టక పోవడం అతని జీవితంలో కీలకమైన మార్పులకు దారి తీస్తుంది. అయితే అదే మార్పు నగరాన్ని, తన ప్రియమైన వారిని రక్షించడానికి అవసరమైన శక్తిగా



హాలీవుడ్ సూపర్ హీరో చిత్రం 'స్పైడర్-మ్యాన్: బ్రాండ్ న్యూ డే' నుంచి సెకండ్ ట్రైలర్ విడుదలైంది. నాలుగేళ్ల విరామం తర్వాత టామ్ హాలండ్ మరోసారి స్పైడర్-మ్యాన్‌గా ప్రేక్షకుల ముందుకు రానుండగా, ఈ ట్రైలర్ అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతోంది. తాజాగా విడుదలైన ఈ ట్రైలర్ తెలుగు ప్రేక్షకుల కోసం కూడా అందుబాటు లోకి వచ్చింది. ఆమ్‌స్టర్‌డామ్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో చిత్ర బృందం ఈ ట్రైలర్‌ను ఆవిష్కరించింది. ట్రైలర్‌లో పీటర్ పార్కర్ జీవితంలో చోటుచేసుకున్న కొత్త పరిణామాలు, అతను ఎదుర్కొనే సరికొత్త సవాళ్లు ఆసక్తికరంగా చూపించారు. 'స్పైడర్-మ్యాన్: నో వే హోమ్' ఘటనల అనంతరం ప్రపంచం మొత్తం పీటర్ పార్కర్‌ను మరిచిపోయిన పరిస్థితుల్లో, అతను మరోసారి తన బాధ్యతలను ఎలా స్వీకరించాడనే అంశం కథలో ప్రధానంగా కనిపిస్తోంది. అదే సమయంలో జెండయా పోషించిన ఎంజే (MJ)తో పీటర్‌కు ఉన్న భావోద్వేగ అనుబంధాన్ని కూడా ట్రైలర్ హైలైట్ చేసింది. భారీ యాక్షన్ సన్నివేశాలు, ఊహించని ట్విస్టులు, మరింత శక్తివంతమైన విలన్లతో ఈ చిత్రం సూపర్ హీరో అభిమానులకు కొత్త అనుభూతిని అందించనుందని ట్రైలర్ స్పష్టం చేస్తోంది. 'బ్రాండ్ న్యూ డే' మారుతుందా? అనేది చిత్రంలో ప్రధాన ఆసక్తికర అంశంగా నిలవనుంది. ముఖ్యంగా ఎవరూ చూడలేని ఓ కొత్త శక్తివంతమైన విలన్‌ను స్పైడర్-మ్యాన్ ఎలా ఎదుర్కొంటాడనేది చిత్రంపై మరింత ఆసక్తిని పెంచుతోంది. డెస్టిన్ డానియెల్ క్రెట్టన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో టామ్ హాలండ్, జెండయా, జేకబ్ బటలోన్, జాన్ బెర్నాల్, సాడీ సింక్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా అత్యంత భారీ అంచనాలు ఉన్న చిత్రాల్లో ఒకటైన 'స్పైడర్-మ్యాన్: బ్రాండ్ న్యూ డే'కు భారత్‌లోనూ విశేషమైన అభిమాన వర్గం ఉంది. అభిమానుల ఉత్సాహాన్ని మరింత పెంచుతూ చిత్ర విడుదల తేదీని ఒక రోజు ముందుకు జరిపినట్లు సోనీ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రకటించింది.

సోనీ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా ఈ చిత్రాన్ని జూలై 30న ఇంగ్లీష్, హిందీ, తమిళ్, తెలుగు, మలయాళం, కన్నడ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనుంది. 2D, 3D, 4DX 3D, ScreenX, Dolby Cinema, MX4D, P[XL], BIGPIX తదితర ప్రీమియం ఫార్మాట్లలో ప్రేక్షకులకు అందుబాటులోకి రానుంది.

## నాగబంధం' విజువల్‌గా ప్రేక్షకులకు గ్రాండ్ థియేట్రికల్ ఎక్స్‌పీరియెన్స్ అందిస్తుంది

### ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో డైరెక్టర్ అభిషేక్ నామా

'నాగబంధం – ది సీక్రెట్ ట్రెజర్' చిత్రం తాజాగా విడుదల చేసిన ట్రైలర్‌తో అంచనాలను మరింత పెంచేసింది. దర్శకుడు అభిషేక్ నామా అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన ఈ ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్‌లో విరాట్ కర్ణ హీరోగా నటించారు. పురాణాలు, రహస్యాలు, దివ్యశక్తులు, అడ్వెంచర్ అంశాల సమ్మేళనంగా రూపొందిన ఈ ట్రైలర్ ప్రేక్షకులను ఓ అద్భుతమైన ప్రపంచంలోకి తీసుకెళ్తోంది. శతాబ్దాల నాటి ఓ రహస్యం చుట్టూ కథ సాగుతున్నట్లు ట్రైలర్ ప్రజెంట్ చేసింది. అనంత పద్మనాభ స్వామి ఆలయంలో భద్రపరచబడిన పవిత్రమైన బ్రహ్మ కమలం కథలో కీలక అంశంగా కనిపిస్తోంది. తరతరాలుగా రక్షించబడుతున్న బ్రహ్మ కమలంను స్వాధీనం చేసుకోవాలనే దుష్టశక్తుల ప్రయత్నాలతో కథ ఆసక్తికర మలుపులు తిరుగుతుంది. కథ ముందుకు సాగే కొద్దీ పురాతన, ఆధ్యాత్మిక రహస్యాలు, మర్మమైన శక్తులు కూడా అత్యంత భారీ స్థాయిలో రూపొందినట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. నిక్ స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్ బ్యానర్లపై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో విరాట్ కర్ణ తన పాత్రలో అద్భుతంగా కనిపిస్తున్నారు. శారీరకంగా, భావోద్వేగంగా బలమైన పాత్రలో ఆయన ఆకట్టుకున్నారు. నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ, దక్ష నాగార్కర్ కీలక పాత్రల్లో నటించి చిత్రానికి మరింత బలం చేకూర్చారు. 'నాగబంధం' ట్రైలర్ పురాణాలు, ఫాంటసీ, మిస్టరీ, అడ్వెంచర్ అంశాల అద్భుత సమ్మేళనంగా నిలిచింది. ఆసక్తికరమైన కథ, అత్యున్నత నిర్మాణ విలువలు, ఆకట్టుకునే విజువల్స్‌తో ఈ చిత్రం జూలై 3న ప్రేక్షకులకు ఓ గొప్ప థియేట్రికల్ అనుభూతిని అందించేందుకు సిద్ధంగా ఉంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ అభిషేక్ నామా మాట్లాడుతూ:"అందరికీ



ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తాయి. భగవాన్ శివుడి ఆవిర్భావం, నాగసాధువుల ప్రవేశం కథను మరింత ఉత్కంఠభరితంగా మారుస్తాయి. ట్రైలర్ చివర్లో కనిపించే 'నాగబంధం' దివ్య రక్షణ శక్తి కథలో ప్రధాన సంఘర్షణకు కేంద్ర బిందువుగా నిలవబోతుంది. ఈ ట్రైలర్‌లో ప్రధానంగా ఆకట్టుకునే అంశం దర్శకుడు అభిషేక్ నామా సృష్టించిన అద్భుత ప్రపంచం. కేవలం భక్తి అంశాలకే పరిమితం కాకుండా, ట్రెజర్ హంట్, చరిత్ర, అతీంద్రియ శక్తులు, మిస్టరీ, అడ్వెంచర్ అంశాలను సమన్వయం చేస్తూ కథను మరింత ఆసక్తికరంగా మలిచారు. నిర్మాణ విలువల పరంగా 'నాగబంధం' అత్యున్నత స్థాయిలో కనిపిస్తోంది. ప్రొడక్షన్ డిజైనర్ అశోక్ కుమార్ రూపొందించిన దేవాలయాలు, భారీ సెట్లు, ఆధ్యాత్మిక వాతావరణాన్ని ప్రతిబింబించే విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. సినిమాటోగ్రాఫర్ ఎస్. సౌందరరాజన్ ప్రతి ఫ్రేమ్‌ను అత్యంత గ్రాండ్‌గా మలిచారు. జునైద్ ఖాన్, అబే అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు మరింత బలం చేకూర్చింది. భావోద్వేగం, ఉత్కంఠ, భక్తి భావనలను సమపాళ్లలో మేళవిస్తూ ప్రతి సన్నివేశాన్ని మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దింది. యాక్షన్ సన్నివేశాలు నమస్కారం. జీవితంలో ఎన్నో కలలు, ఎన్నో ఆలోచనలు ఉంటాయి. కానీ ఒక గొప్ప విజన్‌ను ఆచరణలోకి తీసుకురావాలంటే దాన్ని నమ్మే నిర్మాత అవసరం. మా నిర్మాత కిషోర్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సినిమా కోసం ఖర్చు చేసిన ప్రతి రూపాయి కూడా తెరపై కనిపిస్తుంది. ఆర్ట్ డైరెక్టర్ అశోక్ గారు, డీవోపీ సౌందర్ రాజన్ గారు, మా ఎడిటర్‌తో పాటు ప్రతి సాంకేతిక నిపుణుడు నా విజన్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంలో ఎంతో కీలక పాత్ర పోషించారు. వారి సహకారం లేకుండా ఈ స్థాయి సినిమా సాధ్యమయ్యేది కాదు. జూలై 3న మీ అందరికీ ఒక అద్భుతమైన సినిమాను అందిస్తున్నామనే నమ్మకం ఉంది. ఈ సినిమా కోసం దాదాపు మొత్తం పని తెలుగు రాష్ట్రాల్లోనే జరిగింది. ఇందులో కనిపించే విజువల్ ఎఫెక్ట్స్ కూడా మన తెలుగు టెక్నీషియన్స్ రూపొందించినవే కావడం నాకు మరింత గర్వంగా ఉంది. ఈ విజన్‌ను నిజం చేయడానికి ప్రతి ఒక్కరూ ఎంతో అంకితభావంతో పనిచేశారు. విజువల్‌గా, సాంకేతికంగా ఈ సినిమా ప్రేక్షకులకు ఒక గ్రాండ్ థియేట్రికల్ అనుభూతిని అందిస్తుంది. మీ అందరి ప్రేమ, ఆశీర్వాదాలు కావాలి.



## దర్శకుడు వైభవ్ కౌండిన్య తెరకేక స్తున్న "గాసిప్" చిత్రం నుంచి తొలి గీతం "సిప్పు సిప్ప" రిలీజ్

మోస్ట్ టాలెంటెడ్, ఎనర్జిటిక్ రాశి సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నా వైభవ్ సినీ స్కల్ప్ట్ స్టూడియోస్ బ్యానర్‌పై యతి నిర్మాతగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'గాసిప్ . నేటి తరానికి కనెక్ట్ అయ్యే ఎమోషన్స్, అందమైన ప్రేమ కథతో మేళవిస్తూ సోషల్ సెటైర్ గా డైరెక్టర్ వైభవ్ కౌండిన్య ద్వారా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇప్పటికే విడుదలైన సిప్పు సిప్పు సాంగ్ ప్రోమోకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మేకర్స్ మ్యూజికల్ జర్నీ స్టార్ట్ చేస్తూ ఈ సినిమా నుంచి సిప్పు సిప్పు ఫుల్ లిరికల్ సాంగ్ ని ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదల చేశారు. శక్తి కాంత్ కార్తీక్ స్వరపరిచిన ఈ ఎనర్జెటిక్ పబ్ డాన్స్ ట్రాక్‌కు కాసర్ల శ్యామ్ అందమైన సాహిత్యాన్ని అందించగా సింగర్ మాళవిక వోకల్స్ తో పాటను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. సోషల్ సెటైర్ గా చిత్రీకరించిన "గాసిప్" అనే సినిమాలో మొదటి సాంగ్ గా సిప్పు సిప్పు అనే సాంగ్ వస్తుంది. గాసిప్ అనే ఈ సినిమా ఒక మిడిల్ క్లాసు అమ్మాయి చుట్టూ తిరిగే కథతో యూత్ కు మాత్రమే కాకుండా కుటుంబ ప్రేక్షకులకు నచ్చేలా తిర్చితిద్దుతున్నారు. ఈ పాట చాలా ఫ్రెష్ గా ఉండడంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సునీల్ సున్నపు మాస్టర్, ఫల్గుణి బంగెర కొరియోగ్రఫీ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## సంగీత ప్రియులను కట్టిపడేస్తున్న 'విశ్వనాథ్ & సన్స్' చిత్రం తొలి గీతం 'నేనో బటర్‌ఫ్లై'

సూర్య అభిమానులతో పాటు, సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'విశ్వనాథ్ & సన్స్'. బ్లాక్‌బస్టర్ దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 14వ తేదీన ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకొని సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేశాయి. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి తొలి గీతంగా 'నేనో బటర్‌ఫ్లై'ను తాజాగా చిత్ర బృందం విడుదల చేసింది. 'నేనో బటర్‌ఫ్లై' గీతం ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను అందుకుంటోంది. మధురమైన ట్యూన్ తో సరికొత్త అనుభూతిని అందిస్తున్న ఈ గీతం, విన్న తక్షణమే ప్రేక్షకుల హృదయాలను దోచుకుంటోంది. ఇటీవల కాలంలో వచ్చిన అత్యుత్తమ గీతాలలో ఒకటిగా నిలుస్తుంది అనడంలో సందేహం లేదు. ప్రస్తుతం వస్తున్న స్పందనను బట్టి చూస్తే, రాబోయే రోజుల్లో ఈ పాట సంగీత ప్రియుల ప్లేలిస్టుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. సినిమాలో కథానాయకుడు సూర్యను ఉద్దేశించి, నాయిక మమిత బైజు పాడుకునే ఈ 'నేనో బటర్‌ఫ్లై' గీతం వినసొంపుగా ఉంది. యువత మనసు దోచుకునేలా ఎంతో అందంగా జి.వి. ప్రకాష్ ఈ గీతాన్ని స్వరపరిచారు. మెలోడీల విషయానికి వస్తే జి.వి. ప్రకాష్ కుమార్ ఎప్పుడూ నిరాశపరచరు. మరోసారి ఆయన అద్భుతమైన సంగీతంతో మాయ చేశారు. దర్శకుడు వెంకీ అట్లూరితో ఆయన కాంబినేషన్ వరుసగా ఆకట్టుకుంటుండటంతో, ఈ సినిమా ఆల్బమ్‌పై అంచనాలు మరింత పెరిగాయి. "రఫ్ అయిన నువ్వు.. టఫ్ అయిన నేను.. మిక్స్ అయ్యే కాలం వచ్చిందిలే" అంటూ ప్రేమలోని అమాయకత్వం, ఉత్సాహం, భావోద్వేగాలను అద్భుతంగా ప్రతిబింబించేలా సరస్వతీపుత్ర రామజోగయ్య శాస్త్రి రాసిన సాహిత్యం పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇటీవలి బ్లాక్‌బస్టర్ పాటలతో విశేష గుర్తింపు పొందిన గాయని సుబ్లాషిని తన మధురమైన గాత్రంతో ఈ పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు. ప్రకటన వచ్చినప్పటి నుంచే 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాపై అన్ని వర్గాల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటివరకు విడుదలైన ప్రతి ప్రమోషనల్ కంటెంట్ సినీ అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం కుటుంబ భావోద్వేగాలు, హృదయాన్ని హత్తుకునే అంశాలతో కూడిన పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది.



'సార్/వాథి', 'లక్కీ భాస్కర్' వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన నిర్మాత నాగవంశీ, దర్శకుడు వెంకీ అట్లూరితో కలిసి మరోసారి అన్ని అంశాలతో నిండిన భారీ థియేట్రికల్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకులకు అందించబోతున్నారు. ఈ చిత్రంలో సూర్య, మమితా బైజు, రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. నిమిష్ రవి ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టగా, బంగ్లాన్ కళా దర్శకుడిగా పనిచేస్తున్నారు. 'విశ్వనాథ్ & సన్స్' చిత్రం ప్రేక్షకుల మనసులు గెలుచుకొని, ఈ ఏడాది అత్యంత ఆదరణ పొందే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లలో ఒకటిగా నిలుస్తుందనే అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి.

Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/26/A2380